నవంబర్
2014

103

సంపుటి : 9 సంచిక : 7

వెల రు. 10/-


## ఈ సంచికలో........


లక్ష్య సాధనకు పునరంకితమవుదాం!

యాభై ఏళ్ల కమ్యూనిస్టు ఉద్యమం-అనుభవాలు

ప్రజలకు దగ్గరవుదాం!

ప్రభుత్వరంగ అమ్మకాలు... సర్కారు వారి పాట

ప్రభుత్వ రంగాన్నివాపయోగించుకొని లాభపడింది ప్రైవేటు పెట్టుబడిదారులే

పెరుగుతున్న సామాజిక ప్రతీఘాత విప్లవ ప్రమాదం

ప్రపంచీకరణ సంస్కృతి- స్థానిక విలువలు

సహచరుల రక్షణ కోసం మృత్యువును ముద్దాడిన వీరకిశోరం కంఠంనేని వెంకటరత్నం

సామ్రాజ్యవాద పాలకవర్గాల సాంస్కృతిక ధాటిని ఎదుర్కోగలిగేంత స్థాయికి పీడితప్రజలు ఇంకా రాలేదు


స్ఫూర్తి

## సహచరుల రక్షణ కోసం మృత్యువును ముద్దాడిన వీరకిశోరం

# కంఠంనేని వెంకటరత్నం

వీరకిశోరాలు భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లను ఉరితీసిన ఘటన ఆ కామ్రేడ్ జీవితాన్ని ఉద్యమ పథం వైపు మరల్చింది. విద్యార్థి దశలో కమ్యూనిస్టు నేత మోటూరు హనుమంతరావుతో కలసి ఆ వీరకిశోరాల ఉరితీతకు నిరసనగా సమ్మె చేశారు. ఆ నేపథ్యమే ఆయనను కమ్యూనిస్టు పార్టీవైపు నడిపింది. వీరతెలంగాణా పోరాటానికి వెన్ను దన్నుగా నిలిచిన ఆంధ్ర ప్రాంతంలో నిర్బంధం పెరగడంతో అజ్ఞాతానికి వెళ్లారు. మలబారు పోలీసు మూకల దాడికి గురైన ప్రజల గురించి తెలుసుకోవడానికి, డెన్ (రహస్యస్థావరం)కు వచ్చారు. ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో పోలీసులు డెన్‌ను చుట్టుముట్టారు. లొంగిపొమ్మని హెచ్చరించారు. అప్పుడా కామ్రేడ్ డెన్ నిర్వాహకుడయిన తోటి కామ్రేడ్‌ను తప్పుకోమన్నాడు. అందుకా కామ్రేడ్ ఒప్పుకోలేదు. ఎదురుదాడే మార్గమని ఇద్దరూ నిర్ణయించుకున్నారు. మొదటి తూటాకు పోలీసు ఇనెస్పెక్టర్ నేలవాలాడు. మరో ఇద్దరు పోలీసులదీ ఆదే దారయ్యింది. పిచ్చేక్కినట్టు పోలీసులు ఇంటిమీద పెట్రోలు పోసి తగులబెట్టారు. తగుల బడుతున్న ఇంటి నుండి బయటకు వచ్చిన ఆ యువ కామ్రేడ్స్‌ను పోలీసులు కాల్చి వేశారు. ఈ సంఘటన 1950 బాపట్ల (ఉప్పరపాలెం)లో జరిగింది. అగ్గిరవ్వలా పోలీసుల మీద విరుచుకుపడిన కామ్రేడ్స్ కంఠంనేని వెంకటరత్నం, డెన్ నిర్వాహకులు, కొరియర్ కామ్రేడ్ మోటూరు వెంకటరత్నం ఉద్యమానికి వేగుచుక్కలై నిలిచారు. ఈ విషాద ఘటనలో కామ్రేడ్ మోటూరు వెంకటరత్నం రెండు సంవత్సరాల కుమార్తె కూడా కాల్పుల్లో చనిపోయింది.

కంఠంనేని వెంకటరత్నం 1916లో గుంటూరు జిల్లా భట్టిప్రోలు మండలంలోని పల్లెకోనలో ధనిక రైతుకుటుంబంలో జన్మించారు. తండ్రి లక్ష్మయ్యది కృష్ణా జిల్లా. తల్లిది పల్లెకోన. తండ్రి పల్లెకోనకు వచ్చి స్థిరపడ్డారు. వీరికి నలుగురు పిల్లలు. ముగ్గురు అబ్బాయిలు, ఒక అమ్మాయి. మగపిల్లల్లో పెద్దవారు వెంకట సుబ్బయ్య, వ్యవసాయ పనులు చూసేవారు. రెండవవారు వెంకటరత్నం, మూడవవారు



సత్యం. ఇతను హైస్కూల్ టీచర్‌గా చేశారు. బంధువులయిన మాకినేని బసవపున్నయ్య తోబుట్టువుతో వెంకటరత్నంకు వివాహం అయింది. వీరకిశోరాలు భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లను ఉరి తీసిన సంఘటన యావత్ భారత దేశంలో యువత రక్తాన్ని ఉడుకెత్తించింది. వారిని ఉరి తీశారన్న వార్త ఆసేతు హిమాచలం దావాగ్నిలా పాకింది. భారతీయుల గుండె మండింది. గాంధీతో గానీ, గాంధి పిలుపుతోగానీ సంబంధం లేకుండానే దేశమంతా బంద్‌లతో, ఊరేగింపులతో, హర్తాళ్‌లతో అట్టుడికిపోయింది. ఉప్పెనలా పొంగిన ఆ జాతీయాభిమానం తనలోకి లాక్కున్న అనేకమంది యువకులలో వెంకటరత్నం కూడా ఒకరు. అప్పటిదాకా చాలా మంచి బాలుడి ముద్రతో బుద్ధిగా పాఠాలు వల్లెవేసుకుంటున్న వెంకటరత్నంకు అమర జీవులకు అశ్రునివాళులివ్వాలనీ, వారిని అంత రాక్షసంగా హత్యచేసిన తెల్లవాడిపై తిరుగబడాలనీ అనిపించింది. అప్పటికి ఆయన రేపల్లె హైస్కూల్‌లో విద్యాభ్యాసం చేస్తున్నారు. ఆయన వయస్సు 16 సంవత్సరాలు. అప్పటికే ఆ స్కూల్లో చదువుతూ విద్యార్థుల సమస్యల మీద పని చేస్తున్న కామ్రేడ్ మోటూరు హనుమంతరావు హర్తాళ్ చేయాలని నిర్ణయించారు. ఆయనతో కామ్రేడ్ కంఠంనేని కలిశారు. మొత్తం స్కూలు విద్యార్థులను కలుపుకుని హర్తాళ్ చేశారు. ఆ రోజు నుండి కామ్రేడ్ వెంకటరత్నం వామపక్ష జాతీయ వాదిగా మారారు. విద్యార్థులను కూడగట్టడంలో, వారిలో జాతీయ స్ఫూర్తిని నింపటంలో నిమగ్నమయ్యారు. రైతుగా రైతు సమస్యలపై దృష్టి సారించారు. మానవతా వాదిగా వ్యవసాయ కార్మికులను ఆదుకుంటూ ఉండేవారు. వ్యవసాయ పనులు లేని రోజులలో వారికి రైతుల నుండి ధాన్యం ఇప్పించేవారు. నూర్పిళ్లు కాగానే వారి బాకీ తీర్చేవారు. ఇతర రైతుల దగ్గర తానే అప్పులు చేసి వ్యవసాయ కూలీలను ఆదుకునేవారు.

1935లో నిడుబ్రోలులో యన్.జి. రంగా ఏర్పాటు చేసిన రైతాంగ పాఠశాలలో మాకినేని బసవపున్నయ్యతో కలిసి పాల్గొన్నారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. అప్పటికే కామ్రేడ్ వెంకటరత్నం ఆలోచనా ధోరణిలో మార్పు రావటం మొదలైంది. అర కొర సంస్కరణలు, పుష్కరానికి ఒకసారి జరిగే జాతీయ పోరాటాలు, దారిద్ర్యాన్ని పోగొట్టే అవకాశంలేని బూటకపు స్వాతంత్ర్యం ఆయనను తృప్తి పరచలేకపోయాయి. రైతుల భాగ్యం పేరుతో ఎన్జీ రంగా చేసే బోధనలు ఆయనలోని వామపక్షవాదిని తృప్తి పరచలేకపోయాయి. దీనికి తోడు కామ్రేడ్ మాకినేని బసవపున్నయ్య, కామ్రేడ్ మోటూరు హనుమంతరావుల సాహచర్యం, వారితో సాగే చర్చలు ఆయనను కమ్యూనిస్టుగా మార్చి వేశాయి. అంతే, కామ్రేడ్ కంఠంనేనిలో దాగివున్న సవ్యసాచి నిద్రలేచాడు. కార్యరంగం ఎవరూ అందుకోలేనంత విశాలంగా మారిపోయింది. రైతు ఉద్యమం, వ్యవసాయ కార్మిక ఉద్యమం, అస్పృశ్యతా నివారణ– ఒకటేమిటి సామాజిక, ఆర్థిక మార్పుకు అవసరమైన ప్రతి రంగంలోనూ పనిచేయటం ప్రారంభించారు. చదవటం, చదివించటం, వినటం, వినిపించటం, కదలటం, కదిలించటం..... అబ్బో.. ....అదొక సామ్యవాదియొక్క విశ్వరూపం. గ్రామంలో దోపిడి వర్గాలకు వ్యతిరేకంగా ప్రజా సమీకరణ చేయటం, వారిని చైతన్యవంతులను చేయటం మొదలుపెట్టారు.

ఆయన కృషి వ్యవసాయ కూలీలు, రైతులనేకాదు, పల్లెకోన పక్కనే ఉన్న రాచూరు

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


**1. సహచరుల రక్షణ కోసం మృత్యువును ముద్దాడిన వీరకిశోరం కంఠంనేని వెంకటరత్నం** – 2

**2. లక్ష్య సాధనకు పునరంకితమవుదాం!**
– ప్రకాశ్ కరత్ 4

**3. యాభై ఏళ్ల కమ్యూనిస్టు ఉద్యమం-అనుభవాలు**
– వి. శ్రీనివాసరావు 9

**4. ప్రజలకు దగ్గరవుదాం!**
– ఎస్. వీరయ్య 14

**5. ప్రభుత్వరంగ అమ్మకాలు... సర్కారు వారి పాట**
– సి.పి. చంద్రశేఖర్ 16

**6. ప్రభుత్వ రంగాన్నివాపయోగించుకొని లాభపడింది ప్రైవేటు పెట్టుబడిదారులే**
– సీతారామ్ ఏచూరి 19

**7. పెరుగుతున్న సామాజిక ప్రతీఘాత విప్లవ ప్రమాదం**
– ప్రభాత్ పట్నాయక్ 21

**8. ప్రపంచీకరణ సంస్కృతి- స్థానిక విలువలు**
– నీలాంజన గుప్తా 27

**9. సామ్రాజ్యవాద పాలకవర్గాల సాంస్కృతిక ధాటిని ఎదుర్కోగలిగేంత స్థాయికి పీడిత ప్రజలు ఇంకా రాలేదు**
– బివి రాఘవులు 33



**సంపాదకుడు:**
ఎస్. వెంకట్రావు

**సంపాదక వర్గం:**
పాటూరు రామయ్య
బి.వి. రాఘవులు
తమ్మినేని వీరభద్రం
ఎస్. వీరయ్య
తెలకపల్లి రవి

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరుపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
**ఫోన్:** ఎడిటోరియల్ **0866-2573822**
**మేనేజర్: 040-27673787**
EMail:svenkatarao_1958@yahoo.com
Visit cpi(m) site at : cpim.org


# నల్ల కుబేరులు

**న**ల్ల ధనవంతుల సమస్య మోడీ ప్రభుత్వ మోసకారితనాన్ని మరోమారు దేశానికి వెల్లడించింది. ఎన్నికల ముందు నల్ల ధనంపై మోడీ చేసిన వాపన్యాసాలు దేశంలోని మధ్యతరగతిని ఊరించి ఎన్నిల్లో ఓట్ల వర్షం కురిపించింది. యూపిఎ ప్రభుత్వం నల్ల ధనవంతులను కాపాడుతోందని మోడీ ప్రతి వేదిక మీదా ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే వారి పేర్లు బయటపెడతామన్నారు. విదేశీ బ్యాంకుల్లో దాగీున్న రూ 75 లక్షల కోట్ల నల్లధనాన్ని దేశానికి రప్పించి ప్రతి భారతీయునికీ రూ. 15 లక్షలు పంచుతామని ఊదరగొట్టారు. కానీ అధికారంలోకి రాగానే ఆయనా, ఆయన ప్రభుత్వం గొంతు మారింది. గతంలో నల్లధనవంతుల పేర్లు వెల్లడించాలని సుప్రీం కోర్టు కోరినప్పుడు యుపిఎ ప్రభుత్వం ఏ సాకులైతే చెప్పిందో మోడీ ప్రభుత్వం కూడా అవే సాకులు అందుకుంది. సుప్రీం కోర్టు గట్టిగా అడిగితే అసలైన వారి పేర్లు విడిచిపెట్టి ముగ్గురు అర్భకుల పేర్లు వెల్లడించింది. తీరా సుప్రీం కోర్టు ఆగ్రహం చెంది మొట్టికాయలు వేస్తే 627 మంది నల్లధనవంతుల జాబితాను కోర్టుకు సమర్పించింది. ఇది కూడా చాంతాడంత జాబితాలో చిన్న భాగం మాత్రమే. ఇప్పుడు కూడా వారి పేర్లు బహిరంగంగా వెల్లడించడానికి ప్రభుత్వం సిద్ధపడ్డం లేదు.

నల్ల ధనవంతులపై ప్రభుత్వ కప్పగెంతులకు కారణం సులువుగానే కనిపెట్టొచ్చు. మొదటిది, ఎన్నికల్లో మోడీని గెలిపించడానికి కృషి చేసిన కార్పొరేట్ వర్గాలు నల్ల ధనవంతుల జాబితాలో మొదటి పీఠిన వాన్నాయి. రెండోది ఎన్నికల్లో ఆ నల్ల డబ్బే బిజెపీ విజయానికి పెద్ద ఎత్తున పని చేసింది. మోడీ ఎన్నికల ఖర్చు సుమారు రూ. 50,000 కోట్లలో అగ్రభాగం ఈ నల్లడబ్బుదే. మూడవది, నల్ల ధనవంతుల్లో చాలా మంది బిజెపీ, కాంగ్రెస్ నాయకులు కూడా వాన్నారు. అందువల్ల నల్ల ధనవంతుల జాబితా వెల్లడించాలన్న ఆలోచన ప్రభుత్వానికి లేకపోగా, వారిని కప్పిపుచ్చడానికే అది ప్రయత్నిస్తోందన్నది స్పష్టం. కాకపోతే సుప్రీం కోర్టు చీవాట్లు పెట్టింది కనుక జాబితా సమర్పించింది. అంతే.

నిజానికి నల్ల ధనవంతులు, తెల్ల ధనవంతులు అంటూ లేరు. ప్రతి ధనవంతుని వెనుక నల్ల మరకలు వాన్న దేశం మనది. దేశంలో నయా-వాదారవాద దోపిడీకి తలుపులు తెరవడంతో అభివృద్ధి ఫలాలు కొద్ది మంది కుభేరులు వద్ద సహస్ర కోట్ల రూపాయల్లో పోగుపడ్డాయి. విస్తారమైన ప్రజానీకానికి నాలుగు వేళ్లు నోట్లోకి వెళ్లడం కష్టంగా మార్చేశాయి. పేదలకు ఇస్తున్న సబ్సిడీలు తగ్గించడం, సంక్షేమ కార్యక్రమాలకు కోతపెట్టడం, మందులు, పెట్రోల్, ఇతర నిత్యావసరాలపై కంట్రోల్ ఎత్తివేయడం, ప్రభుత్వ రంగ సంస్థల వాటాలు అమ్మేయడం, కార్మిక చట్టాలను సరళీకరించడం వంటి విధానాలు ఒకవైపు పేదలపై భారాల మీద భారాలు వేస్తున్నాయి. మరోవైపు ధనికులకు పన్ను రాయితీలు ప్రకటించడం, వాదారంగా ప్రభుత్వ భూములు, గనులు, ఇతర వనరులు కేటాయించడం, కాంట్రాక్టులు, కమీషన్లు, స్పెక్యులేటివ్ వ్యాపారం ధనికుల లాభాలను ఇబ్బిడి ముబ్బిడిగా పెంచుతున్నాయి. ఇలా పేదల పొట్టలుగొట్టి ధనికుల వద్ద పోగుపడ్డ సొమ్ముకు పన్నులు చెల్లించకుండా దేశం దాటించే ఏర్పాట్లు, తిరిగి విదేశీ పెట్టుబడుల పేరుతో మలేషియా మార్గంలోనో, సింగపూర్ రూట్‌లోనో మన దేశంలోకి ప్రవేశ పెట్టే ఏర్పాట్లు కూడా ఈ ప్రభుత్వాలే చేస్తున్నాయి. అందువల్ల ప్రభుత్వాలు ఎన్ని కబుర్లు చెప్పినా, కార్పొరేట్ బేహారుల కొమ్ముకాసే మోడీలు ఎన్ని ఫీంకారాలు చేసినా నల్ల ధనాన్ని అరికట్ట లేరు. నల్ల ధనం ఈ వ్యవస్థలో భాగం అయిపోయింది. కార్పొరేట్ శక్తులను ఎదుర్కొని నిలిచే వామపక్షాలు అధికారంలోకి వచ్చినప్పుడు మాత్రమే ఈ నల్ల ధనవంతుల ఆటలు కట్టడవుతాయి. ఈలోగా నల్ల ధనంపై పోరాటం కొనసాగాల్సిందే.


**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10,** సంవత్సర చందా:**రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**

**మేనేజర్,**
**మార్క్సిస్టు**
**(సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.హెచ్ భవన్** (ప్రజాశక్తి కార్యాలయం),
**అజామాబాద్, హైదరాబాద్- 20**

# లక్ష్య సాధనకు పునరంకితమవుదాం!



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి

ప్రకాశ్ కరత్

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) స్వర్ణోత్సవాలు జరుపుకొంటోంది. కొల్‌కతాలో 1964 అక్టోబరు 31 నుండీ నవంబరు 7 వరకు జరిగిన మహాసభల్లో ఆవిర్భవించిన సిపిఐ(ఎం) ఎన్నో ఒడిదుడుగులను అధిగమించి పురోగిస్తోంది. స్వర్ణోత్సవ సందర్భాన పార్టీ పురోగమన క్రమంలో ప్రాణత్యాగం చేసిన వేలాదిమంది అమరులకు ముందుగా విప్లవాంజలి అర్పిస్తున్నాము.

భారత కమ్యూనిస్టు ఉద్యమ పురోగమనంలో సిపిఐ(ఎం) ఆవిర్భావం ఒక ముఖ్యమైన మైలురాయి. 1920 అక్టోబరులో తాష్కెంట్ వెళ్లిన కొందరు ప్రవాస భారతీయులు తొలిరిగా భారత కమ్యూనిస్టు పార్టీగా ఏర్పడ్డారు. దాన్నే అప్పటి కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ కూడా గుర్తించింది. తదనంతర కాలంలో 1920 నాటికి దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో చిన్న చిన్న కమ్యూనిస్టు గ్రూపులు ఏర్పడ్డాయి. 1934లో మీరట్ కేసు నిందితులు విడుదలయ్యాక అఖిల భారత స్థాయిలో భారత కమ్యూనిస్టు పార్టీ సంఘటిత పార్టీగా పని చేయటం ప్రారంభించింది.

స్వాతంత్ర్యానంతర భారతదేశంలో విప్లవోద్యమంలో అనుసరించాల్సిన వ్యూహం గురించి పార్టీలో సుదీర్ఘకాలం సాగిన అంతర్గత పోరాటం పర్యవసానంగా సిపిఐ(ఎం) ఆవిర్భవించింది. దశాబ్ద కాలం పాటు పార్టీలో అంతర్గత పోరాటం జరిగింది. అందువల్లనే ఈ కాలంలో పార్టీ నిర్దిష్ట కార్యక్రమం రూపొందించుకోలేకపోయింది.

1964 ఏప్రిల్‌లో జరిగిన జాతీయ కౌన్సిల్ సమావేశాల నుండి 32 మంది వాకౌట్ చేశాక సోవియట్ యూనియన్–చైనాల మధ్య విభజనలో భాగంగా భారతదేశంలో కూడా కమ్యూనిస్టు పార్టీ చీలిపోయింది అని పలువురు భావించారు. సిపిఐ(ఎం)గా ఏర్పడిన వారిని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా "చైనా అనుకూల తీవ్రవాదులుగా" ముద్ర వేసింది. ఈ గందరగోళం ఏర్పడటానికి కావల్సిన పరిస్థితులు ఆనాడు నెలకొని ఉన్నాయి. 1960, తర్వాతి కాలంలో చైనా కమ్యూనిస్టు పార్టీ పిలుపు మేరకు అనేక దేశాల్లో ఉనికిలో ఉన్న కమ్యూనిస్టు పార్టీల నుండి కొన్ని గ్రూపులు చీలిపోయాయి. ఈ విధంగా చీలిపోయిన వారు చీలికదారులుగానే మిగిలిపోయారు తప్ప తమకంటూ గణనీయమైన ప్రజా పునాదిని సమకూర్చుకోలేకపోయారు.

**సోషలిజం స్థాపన దిశగా ప్రత్యామ్నాయ విధానాలకోసం జరిగే పోరాటం ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి సాగించవల్సినది. సిపిఐ(ఎం) ఆవిర్భావ స్వర్ణోత్సవ వేడులక వేళ పార్టీ మనముందుంచిన లక్ష్య సాధనకు మరింత కృతనిశ్చయులమై మనలను మనం పునరంకితం చేసుకుందాం.**

కానీ భారతదేశంలో పరిస్థితులు దీనికి భిన్నంగా సాగాయి. సోవియట్ రష్యా, చైనా కమ్యూనిస్టు పార్టీల మధ్య అగాథం పెరుగుతున్న కాలంలోనే భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీలో భిన్నాభిప్రాయాలు వేళ్లూనుకోవటం జరిగింది. అయితే అదొక్కటే భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ చీలిపోవటానికి కారణం కాదు. భారత దేశంలో రాజ్యపు వర్గ స్వభావం, పాలకవర్గాల స్వభావం, వంటి కీలక అంశాల విషయంలో పార్టీలో అంతర్గతంగా జరిగిన సుదీర్ఘ పోరాటానికి ముగింపుగానే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఏర్పడింది.

## 1

ఆ విధంగా 1964లో అక్టోబరు–నవంబరు మాసాల్లో జరిగిన పార్టీ 7వ మహాసభలో పార్టీ కార్యక్రమం ఆమోదించుకోవటంతో సిపిఐ(ఎం) ఆవిర్భావ ప్రక్రియ పూర్తి అయ్యింది.

1964లో ఆమోదించుకున్న పార్టీ కార్యక్రమం తొలిసారిగా భారతీయ సమాజం, అందులోని వర్గాల గురించి మార్క్సిస్టు–లెనినిస్టు అవగాహనతో విశ్లేషణ చేసి, ఆ విశ్లేషణ ఆధారంగా విప్లవోద్యమానికి మార్గదర్శనం చేసే ప్రక్రియ ప్రారంభమైంది. విదేశీ గుత్తపెట్టుబడిదారులతో మిలాఖత్ అయిన దేశీయ గుత్తపెట్టుబడిదారులు–భూస్వామ్య పాలకవర్గం చేతుల్లో భారత ప్రభుత్వం ఉందని 1964లో ఆమోదించిన పార్టీ కార్యక్రమం నిర్ద్వంద్వంగా నిర్ధారించుకొన్నది. తద్వారా అప్పటికి స్వాతంత్ర్యానంతర భారత ప్రభుత్వ వర్గ స్వభావాన్ని అంచనా వేయటంలో నెలకొన్న గందరగోళానికి స్వస్తి చెప్పింది. ప్రభుత్వపు వర్గ స్వభావాన్ని సరిగ్గా అంచనా వేయటం విప్లవోద్యమంలో నిర్దిష్ట వ్యూహాన్ని అనుసరించటానికి అత్యంత కీలకమైన అంశం.

విప్లవ దశ, ప్రభుత్వ వర్గ స్వభావం, జనతా ప్రజాస్వామిక విప్లవ సాధనకు అవసరమైన వర్గ పొందిక వంటి అంశాల్లో పార్టీ కార్యక్రమం ఇచ్చిన అవగాహన నేటికీ సరైనదే అని ఆచరణలో నిరూపించబడింది. 2001 సంవత్సరంలో పార్టీ కార్యక్రమాన్ని

తాజాపర్చుకున్నప్పటికీ 1964 నాటి కారక్రమం లోని పైన చెప్పిన అంశాలకు సంబంధించిన అవగాహనను యథాతథంగా కొనసాగించు కుంటున్నాము. గడచిన ఐదు దశాబ్దాల్లో పార్టీ రాజకీయ, సైద్ధాంతిక, నిర్మాణాత్మక కార్యాచరణకు మార్గదర్శిగా ఉన్నది 1964 నాటి కార్యక్రమమే.

ఈ కార్యక్రమం ప్రాతిపదికన పని చేసినందునే సిపిఐ(ఎం) దేశంలోని వామపక్ష శక్తుల్లో నాయకత్వ స్థానానికి ఎదగగలిగింది. ప్రస్తుతం పార్టీలో 10 లక్షల మంది సభ్యులున్నారు. వీరు 7 కోట్ల మంది సభ్యులున్న వివిధ ప్రజా సంఘాల్లో పని చేస్తున్నారు.

**2**

సిపిఐ(ఎం) పార్టీ ఆవిర్భవించిన వెను వెంటనే తనదైన సైద్ధాంతిక అవగాహనను రూపొందించుకున్నది. 1960 దశకంలో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో తీవ్రమైన సైద్ధాంతిక చర్చలు చోటు చేసుకున్నాయి. వివాదాలు తలెత్తాయి. నూతన దశ స్వభావం, మౌలిక సామాజిక వైరుధ్యాలు, రెండు శిబిరాలుగా చీలిన ప్రపంచ దేశాల నడుమ శాంతియుతమైన సహజీవనం, సోషలిజం సాధనలో శాంతియుత పురోగమనం వంటి అనేక అంశాలపై రష్యా కమ్యూనిస్టు పార్టీ దాని మద్దతుదారులు, చైనా కమ్యూనిస్టు పార్టీ, దాని మద్దతుదారుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. సిపిఐ(ఎం) ఏర్పడిన వెనువెంటనే మొత్తం నాయకత్వాన్ని ప్రభుత్వాలు జైల్లో పెట్టాయి. దాంతో సమకాలీన సైద్ధాంతిక వివాదాలపై 1968 వరకు సిపిఐ(ఎం) నిర్దిష్ట వైఖరి రూపొందించుకోలేకపోయింది. దాంతో సిపిఐ(ఎం) చైనా కమ్యూనిస్టు పార్టీ వైఖరిని సమర్థిస్తోందని కొందరు తప్పుడు నిర్ధారణలకు రావటానికి కారణం అయ్యింది. దేశ వామపక్ష ఉద్యమంలో ఒంటెత్తువాద పోడకలు ముందుకొచ్చినపుడు నిర్దిష్ట సైద్ధాంతిక సమస్యలపై పార్టీ తన వైఖరిని స్పష్టంచేయకపోవటం వల్ల కొంత నష్టం జరిగింది.

1968లో బర్ద్వాన్‌లో జరిగిన ప్లీనం సమావేశాల్లో లోతైన అంతర్గత చర్చల తర్వాత సైద్ధాంతిక అంశాలపై నిర్దిష్ట వైఖరి తీసుకొన్నది. భారతదేశంలోనూ, అదేవిధంగా అంతర్జాతీయంగానూ ఆనాటికి కొనసాగుతున్న అతివాద, మితవాద వామపక్ష శక్తుల కంటే సిపిఐ(ఎం) భిన్నమైనది అని నిరూపించటానికి ఈ తీర్మానం ఉపయోగపడింది. అటు చైనా కమ్యూనిస్టు పార్టీ, ఇటు రష్యా కమ్యూనిస్టు పార్టీ అనుసరించిన అనేక పొరపాటు వైఖరులనూ,

"1968లో బర్ద్వాన్‌లో జరిగిన ప్లీనం సమావేశాల్లో లోతైన అంతర్గత చర్చల తర్వాత సైద్ధాంతిక అంశాలపై నిర్దిష్ట వైఖరి తీసుకొన్నది. భారతదేశంలోనూ, అదే విధంగా అంతర్జాతీయంగానూ ఆనాటికి కొనసాగుతున్న అతివాద, మితవాద వామపక్ష శక్తుల కంటే సిపిఐ(ఎం) భిన్నమైనది అని నిరూపించటానికి ఈ తీర్మానంఉపయోగపడింది."



కేరళ రాజధాని తిరువనంతపురంలో జరిగిన 13 మహాసభ సందర్భంగా కామ్రేడ్ ఇఎంఎస్, కామ్రేడ్ ప్రకాశ్ కరత్

ధోరణులనూ ఎత్తిచూపటంలో సిపిఐ(ఎం) స్వతంత్ర పంథాను అనుసరించింది.

నిజానికి ఈ స్వతంత్ర పంథా సిపిఐ(ఎం) ప్రత్యేతకు దర్పణంగా నిలిచింది. అవిభక్త సిపిఐ శైశవ దశలో ఉన్నప్పుడు సైద్ధాంతిక, ఆచరణాత్మక మార్గదర్శనం కోసం రష్యా కమ్యూనిస్టు పార్టీ సహకారం తీసుకొన్నది. (స్వాతంత్ర్యానికి ముందు బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ ఈ సహకారం అందించింది.) స్వాతంత్ర్యానంతరం కూడా ఈ సాంప్రదాయం కొనసాగింది. 1960 దశకం చివరి సంవత్సరాల్లో అతివాద వామపక్ష శక్తులు చైనా కమ్యూనిస్టు పార్టీ కార్యాచరణ నుండి స్ఫూర్తి పొందారు. ఈ విధంగా సైద్ధాంతిక, కార్యాచరణ మార్గదర్శనం నిమిత్తం ఇతరులపై ఆధారపడే పద్ధతికి, సాంప్రదాయానికి సిపిఐ (ఎం) స్వస్తి చెప్పింది. పార్టీ కార్యక్రమం రూపొదించుకోవటం, సదరు కార్యక్రమం మార్గదర్శకత్వంలో ఎత్తుగడల పంథాను అనుసరించటం, సైద్ధాంతిక సమస్యలపై నిర్దిష్ట వైఖరి తీసుకోవటం వంటి పరిణామాలు అప్పటికి దేశ కమ్యూనిస్టు ఉద్యమంలో కొనసాగుతున్న సాంప్రదాయాల కంటే భిన్నమైనవిగా నిరూపితం అయ్యాయి. ఈ విభిన్నతకు కారణం భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా మార్క్సిజం-లెనినిజంలను వర్తింపచేయటం కోసం ప్రయత్నించటమే. అంటే విప్లవాలు సాధించిన దేశాల్లో అనుసరించిన విధి విధానాలను మక్కీకి మక్కి అనుసరించటం కాదు.

సోవియట్ రష్యా పతనం ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీలపైనా, సోషలిజం సాధన కోసం పని చేసే శక్తులపైనా ప్రతికూల ప్రభావాన్ని చూపింది. భారత కమ్యూనిస్టు ఉద్యమంపై కూడా ఈ ప్రభావం ఉంది. కానీ సిపిఐ(ఎం) మిగిలిన కమ్యూనిస్టు పార్టీల్లా అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో చోటుచేసుకున్న సైద్ధాంతిక రాజకీయ, నిర్మాణాత్మక మార్పులకు బెసకలేదు. పార్టీ తనకంటూ మార్క్సిజం గురించిన నిర్దిష్టమైన అవగాహన కలిగి ఉండటమే దీనికి కారణం. సోవియట్ వ్యతిరేక వైఖరి అనుసరించకుండానే సిపిఐ(ఎం) సోవియట్ కమ్యూనిస్టు పార్టీ వివిధ సందర్భాల్లో అమలు చేసిన సైద్ధాంతిక అవగాహనల పట్ల విమర్శనాత్మక ధోరణితో వ్యవహరించింది. సోవియట్ కమ్యూనిస్టు పార్టీ పట్ల సిపిఐ(ఎం)కు గుడ్డి నమ్మకం లేకపోవటంతో సోవియట్ పతనం కారణంగా బెంబేలెత్తలేదు. ఆ ఒడిదుడుకులను తట్టుకుని నిలబడగలిగింది. ఫలితంగా సోవియట్ పతనం వల్ల సిపిఐ(ఎం) అంత పెద్దగా నష్టపోలేదు. భారత కార్మికవర్గం, మార్క్సిజం-లెనినిజంలలో వేళ్లూనుకున్న సిపిఐ(ఎం) తనదైన స్వతంత్ర సైద్ధాంతిక అవగాహన నుండే స్ఫూర్తి పొందింది. ప్రాణవాయువు పీల్చుకున్నది. ఈ స్ఫూర్తితోనే 20వ శతాబ్దంలో సోషలిజం నిర్మాణం గురించిన అవగాహనను పునః మదింపు చేసుకొన్నది. 21వ శతాబ్దంలో సోషలిజం స్థాపన లక్ష్యం పట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించుకున్నది. నిజం చెప్పాలంటే 1991 తర్వాత దశాబ్దం కాలం పాటు సిపిఐ(ఎం) సభ్యత్వం పెరుగుతూ వచ్చింది.

**3**

భారతదేశంలో ప్రజాతంత్ర విప్లవ

**“ ప్రస్తుత బూర్జువా భూస్వామ్య రాజ్యాంగ యంత్రానికి ఆర్థిక అణచివేత, సామాజిక అణచివేత రెండు మూల స్థంభాలుగా ఉన్నాయని సిపిఐ(ఎం) గుర్తించింది. అందువల్లనే మహిళలు, దళితులు, ఆదివాసీ ప్రజలు, మైనారిటీల పట్ల సాగుతున్న అన్ని రకాల వివక్షలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడు తోంది. ”**

సాధనకు వ్యవసాయక విప్లవం ఇరుసు అని సిపిఐ(ఎం) కార్యక్రమం ఉద్భోదిస్తోంది. తదను గుణంగానే ఆచరణలో భూ సమస్య, వ్యవసాయక సమస్యలు కేంద్ర స్థానం ఆక్రమించాయి.

పార్టీ ఆవిర్భవించిన నాటి నుండీ భూ సమస్యపై నికరంగా, నిర్దిష్టంగా ఉద్యమించిన పార్టీ సిపిఐ(ఎం). భూస్వామ్యానికి వ్యతిరేకంగా, బినామీ భూముల స్వాధీనం కోరుతూ, మిగులు భూములను భూమి లేని పేదలకు పంపిణీ చేయాలని కోరుతూ, వ్యవసాయ కార్మికులు, ఇతర పేదలకు ఇళ్ల పట్టాలు కేటాయించటం వంటి సమస్యలపై సాగించిన సమరశీల పోరాటాలే తర్వాతి కాలంలో పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపురల్లో వామపక్ష సంఘటన అధికారానికి రావటానికి దోహదం చేశాయి. ఈ మూడు రాష్ట్రాల్లోని వామపక్ష సంఘటన ప్రభుత్వాలు మాత్రమే భూ సంస్కరణల చట్టాలను అర్థవంతంగా అమలు చేయగలిగాయి. మిగులు భూముల పంపిణీతో పాటు భూస్వాముల దోపిడీ, దాష్టీకాల నుండి కౌలు రైతులను కాపాడటం కోసం నిర్దిష్ట చర్యలు చేపట్టిన ప్రభుత్వాలు కూడా సిపిఐ(ఎం) నాయకత్వంలో ఏర్పాటు అయిన ఈ రాష్ట్ర ప్రభుత్వాలే.

ఈ సమస్యలపై 1960, 70 దశాకాల్లో ఉద్య మాలు వెల్లువెత్తాయి. 1967-1970 మధ్య కాలంలో పశ్చిమబెంగాల్, కేరళల్లో ఐక్య సంఘటన ప్రభుత్వాలు అధికారానికి వచ్చాయి. ఈ ప్రభుత్వాల్లో సిపిఐ(ఎం) కీలక శక్తిగా ఉంది. శక్తివంతమైన పోరాటాల మద్దతుతో ఆయా రాష్ట్రాల్లో భూ సమస్యపై బృహత్ విజయాలు సాధించింది.

కార్మికవర్గ పార్టీగా సిపిఐ(ఎం) దేశంలో కార్మికవర్గ పోరాటాలను బలోపేతం చేయటానికి, కార్మికవర్గాన్ని ప్రజాతంత్ర ఉద్యమాలకు నాయకత్వం వహించగలిగిన ఒక రాజకీయ శక్తిగా తీర్చి దిద్దటంలోనూ సిపిఐ(ఎం) విశిష్ట పాత్ర పోషించింది. కార్మిక హక్కుల పరిరక్షణకే కాక ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణకు వ్యతిరేకంగా సిపిఐ(ఎం) నికరమైన పోరాటాలు చేసింది.

ప్రస్తుత బూర్జువా భూస్వామ్య రాజ్యాంగ యంత్రానికి ఆర్థిక అణచివేత, సామాజిక అణచివేత రెండు మూల స్థంభాలుగా ఉన్నాయని సిపిఐ(ఎం) గుర్తించింది. అందువల్లనే మహిళలు, దళితులు, ఆదివాసీ ప్రజలు, మైనారిటీల పట్ల సాగుతున్న అన్ని రకాల వివక్షలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతోంది.

**4**

పాలకవర్గాలు తమ వర్గ ప్రయోజనాల కోసం ప్రజాస్వామ్యంపై కూడా దాడికి వెనకాడని పరిస్థితుల్లో ప్రజాస్వామ్యం, ప్రజాస్వామిక హక్కులు, చివరకు రాజ్యాంగం కల్పించిన కనీస హక్కులకు కూడా రక్షణ ఉండదన్నది ప్రజాస్వామ్యం పట్ల సిపిఐ(ఎం)కు ఉన్న అవగాహన. 1972లో తమ తొమ్మిదవ మహాసభల సందర్భంగా ఏక పార్టీ నియంతృత్వం గురించి హెచ్చరించిన మొట్టమొదటి పార్టీ సిపిఐ(ఎం). 1971 నుండీ అప్పటికి కేంద్రంలోని ఇందిరా గాంధీ ప్రభుత్వ మద్దతుతో పశ్చిమబెంగాల్‌లో సాగిన అర్థఫాసిస్టు మారణకాండ అనుభవాలతో ఈ హెచ్చరిక చేసింది. 1975లో అంతర్గత అత్యవసర పరిస్థితి విధించటానికి ముందు నుండే సిపిఐ(ఎం) ప్రజాస్వామ్యం, ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కోసం జరిగిన పోరాటాల్లో ముందు పీఠిన నిలిచింది. అత్యవసర పరిస్థితి కాలంలో ప్రభుత్వ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పార్టీ పోరాడింది. వందలు, వేల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలను ప్రభుత్వం జైలు పాలు చేసినా ప్రజాస్వామ్యంపై జరుగుతున్న ఈ దాడికి వ్యతిరేకంగా సాగుతున్న పోరాటాల్లో సిపిఐ(ఎం) భుజం భుజం కలిపి ముందుకు నడిచింది. అందువల్లనే అత్యవసర పరిస్థితి రద్దు అయిన తర్వాతికాలంలో పార్టీ ప్రతిష్ట ఇనుమడించింది. ఈ అర్థఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో అంతర్భాగంగానే 1977లో పశ్చిమబెంగాల్‌లో జరిగిన ఎన్నికల్లో తొలిసారి మూడింట రెండు వంతుల మెజారిటీతో సిపిఐ(ఎం) అధికారానికి వచ్చింది.

ప్రజాస్వామిక హక్కుల హననం, ప్రజాస్వామ్య వ్యతిరేక దాడులు తరచు సిపిఐ(ఎం), ఇతర వామపక్ష వ్యతిరేక దాడులుగా మారాయి. పశ్చిమబెంగాల్‌లో అర్థఫాసిస్టు అణచివేత అనుభవాలు మరువక ముందే త్రిపురలో 1988-1993 మధ్యకాలం లో ప్రజాతంత్ర ఉద్యమం అణచివేతను ఎదుర్కోవాల్సి వచ్చింది. తిరిగి 2011 నుండీ పశ్చిమబెంగాల్‌లో ప్రజలు ప్రజాతంత్ర హక్కుల హననం రుచి చూస్తున్నారు. పార్టీ పతాకాన్ని నిలిపి ఉంచే క్రమంలో, ప్రజాతంత్ర హక్కుల హననానికి వ్యతిరేకంగా సాగుతున్న పోరాటంలో వందలాదిమంది కార్యకర్తలు అశువులు బాసారు.

**5**

పార్లమెంటరీ ప్రజాతంత్ర వ్యవస్థల్లో పని చేసే విషయంలో భారతదేశంలో వామపక్ష ఉద్యమానికి విలువైన అనుభవాలు ఉన్నాయి. ఈ రంగంలో సిపిఐ(ఎం) తన విశిష్ట సేవ

**‘మార్క్సిస్టు’ పై**

**మీ అభిప్రాయాలు తెలపండి!**

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్థిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తు న్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

లందించింది. సిపిఐ(ఎం) ఆవిర్భవించిన తర్వాత ప్రజాస్వామిక వేదికల్లో పాలుపంచుకోవటం, రాష్ట్ర ప్రభుత్వాల్లో భాగస్వామ్యం వహించటం వంటి కీలకమైన అంశాల్లో సృజనాత్మక వైఖరి అనుసరించింది. పార్టీ కార్యక్రమమే దీనికి సంబంధించి అనుసరించాల్సిన ఎత్తుగడల విషయంలో మార్గదర్శనం చేసింది. కేరళలో 1957లో అధికారానికి వచ్చిన మొట్టమొదటి వామపక్ష ప్రభుత్వం అనుభవాల నుండి సిపిఐ(ఎం) తన అవగాహనకు మరింత పదును పెట్టింది. శాసనసభల్లో వామపక్ష ప్రజాతంత్ర శక్తులు అధిక ప్రాబల్యం ఉన్న చోట్లనే సిపిఐ(ఎం) అధికారంలో భాగస్వామి అవుతుందని పార్టీ కార్యక్రమం, ఇతర అనుభవాల వెలుగులో నిర్ణయించుకున్నాము. బూర్జువా భూస్వామ్య వ్యవస్థ పరిధిలోనే ప్రజలకు కావల్సిన వెసులు బాటు కల్పించటంతో పాటు ప్రజాతంత్ర ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లటంలో, ప్రజా పోరాటాలను అభివృద్ధి చేయటంలో రాష్ట్ర ప్రభుత్వాల్లో పాలుపంచుకోవటం కూడా అంతర్భాగమే అని సిపిఐ(ఎం) నిర్ధారించుకున్నది. 1967-70 మధ్య కాలంలో కేరళ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో ఐక్యసంఘటన ప్రభుత్వాలు అధికారానికి వచ్చినప్పుడు ఈ అవగాహనను సిపిఐ(ఎం) అమల్లో పెట్టింది. బూర్జువా భూస్వామ్య విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలు రూపొందించి ప్రజల ముందుంచే క్రమంలో 1977 నుండీ పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపురల్లో సిపిఐ(ఎం) నాయకత్వంలో అధికారానికి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వాలు మౌలికమైన ముందడుగుగా చెప్పుకోవచ్చు.

భూ సంస్కరణలు, అధికార వికేంద్రీకరణ, ఉమ్మడి కార్యాచరణ దిశగా కార్మికవర్గ హక్కులను బలోపేతం చేయటం, లౌకిక తత్వ పరిరక్షణ వంటి లక్ష్యాల సాధనకు తోడ్పడిన వామపక్ష సంఘటన ప్రభుత్వాలు దేశంలో ప్రజాతంత్ర హక్కుల పరిరక్షణ దిశగా వామక్ష ప్రభుత్వాల కృషి అని చెప్పటానికి వెనకాడాల్సిన అవసరం లేదు.

**❝ మతోన్మాదానికి వ్యతిరేకంగా నికరమైన పోరాటం చేస్తున్న పార్టీ సిపిఐ(ఎం) మాత్రమే. బ్రిటిష్ పాలన నాటి నుండీ ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేయటంలో మతోన్మాదం ప్రధాన సాధనంగా పని చేస్తూ వచ్చింది. దేశ విభజన రోజుల్లో మతోన్మాదపు నెత్తురు ధారల నడుమ జాతీయ సమైక్యత, సమగ్రతల కోసం, పరమత సహనం కోసం ఎదురొడ్డి నిలిచిన పార్టీ సిపిఐ(ఎం).❞**




**1981లో విజయవాడలో జరిగిన పార్టీ 11వ మహాసభలో ప్రసంగిస్తున్న కా॥ హరికిషన్ సింగ్ సూర్జిత్**

### 6

సిపిఐ(ఎం) నిరంతరం జోక్యం చేసుకుంటూ వచ్చిన మరో అంశం, మరో రాజకీయ వేదిక... సమాఖ్యతత్వం. జాతుల సమస్యలకు సంబంధించిన పార్టీ అవగాహన మేరకు భారత దేశం బహుళజాతుల దేశం. సమాఖ్యతత్వాన్ని బలోపేతం చేయటం ద్వారా భారత దేశ ఐక్యతను పరిరక్షించగలం. సమాఖ్యతత్వాన్ని బలోపేతం చేయటం అంటే భారతదేశంలో భాషా ప్రాతిపదికన ఉన్న వేర్వేరు జాతుల ప్రజలకు సామాజిక ఆర్థికాభివృద్ధిలో తగిన వాటా దక్కటం. ఇందుకుగాను సమాఖ్య స్వభావం కలిగిన రాజకీయ నిర్మాణం అవసరం.

ప్రాంతం, భాష, తెగల ప్రాతిపదికన ముందుకొస్తున్న ఉద్యమాలకూ, ఛాందసవాదానికీ వ్యతిరేకంగా సమాఖ్యతత్వాన్ని పరిరక్షించటం కోసం సిపిఐ(ఎం) నిరంతరం పాటుపడింది. 1980 దశకంలో దేశంలోని భిన్న ప్రాంతాల్లో వేర్పాటువాద శక్తులు క్రియాశీలకంగా ఉన్నప్పుడు జాతీయ సమైక్యత, సమగ్రతల కోసం కంకణ బద్ధురాలై నిలిచిన పార్టీ సిపిఐ(ఎం). ఈ క్రమంలో జమ్మూ-కాశ్మీర్, పంజాబ్, అస్సాం, త్రిపురల్లో వందలాదిమంది కార్యకర్తలు అమరులయ్యారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉండాల్సిన సంబంధాలను పునర్నిర్మించటంలో సిపిఐ(ఎం) కీలక పాత్ర పోషించింది. ఈ విషయంలో పార్టీ అవగాహనను సంబంధిత వేదికల మీద సిపిఐ(ఎం) నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం లేవనెత్తుతూ వచ్చాయి. 1983 నాటి 15 పార్టీల శ్రీనగర్ ప్రకటన తరహాలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాల విషయంలో ఉమ్మడి అవగాహన రూపొందించటంలో సిపిఐ(ఎం) ముఖ్యమైన పాత్ర పోషించింది.

### 7

మతోన్మాదానికి వ్యతిరేకంగా నికరమైన పోరాటం చేస్తున్న పార్టీ సిపిఐ(ఎం) మాత్రమే. బ్రిటిష్ పాలన నాటి నుండీ ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేయటంలో మతోన్మాదం ప్రధాన సాధనంగా పని చేస్తూ వచ్చింది. దేశ విభజన రోజుల్లో మతోన్మాదపు నెత్తురు ధారల నడుమ జాతీయ సమైక్యత, సమగ్రతల కోసం, పరమత సహనం కోసం ఎదురొడ్డి నిలిచిన పార్టీ సిపిఐ(ఎం). అప్పటికి సిపిఐ(ఎం) చిన్న పార్టీయే అయినా మతోన్మాద మూకల నుండి ప్రజల ప్రాణాలు కాపాడటంలో ప్రాణాలొడ్డి నిలిచింది. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో సైతం ఏ ప్రాంతంలో మతోన్మాద కలహాలు, ఘర్షణలు, మారకాండ చోటు చేసుకున్నా ఈ మారకాండకు బలవుతున్న వారిని కాపాడటం కోసం కమ్యూనిస్టులు అహర్నిశలు కృషి చేశారు. ఈ ధీరోధాత్తమైన వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తూనే 1968లో కేరళలోని తలస్సెరిలో మతోన్మాద

> **❝ భారతదేశంలో ప్రత్యామ్నాయ అభివృద్ధి పంథాను ప్రతిపాదించి, ముందుకు తీసుకెళ్లటంలో గత ఐదు దశాబ్దాలుగా సిపిఐ(ఎం) ఒక ముఖ్యమైన శక్తిగా నిలిచింది. సిపిఐ(ఎం) ప్రతిపాదిస్తున్న ప్రత్యామ్నాయ అభివృద్ధి పంథా రాజకీయంగానూ, సామాజికంగానూ, ఆర్థికంగానూ న్యాయమైనది. ప్రజాతంత్రయుతమైనది. ❞**



**2010లో విజయవాడలో జరిగిన పార్టీ ప్లీనంలో ప్రసంగిస్తున్న కా॥ ప్రకాశ్ కరత్**

మూకల దాడుల నుండి మసీదును కాపాడే ప్రయత్నంలో ప్రాణాలర్పించాడు యుకె కుంజిరామన్. మతపరమైన వ్యవహారాలకు ప్రభుత్వం దూరంగా ఉండాలన్న నిజమైన లౌకిక స్ఫూర్తికి సిపిఐ(ఎం) ఎల్లప్పుడూ కట్టుబడి ఉంది. లౌకికతత్వం పట్ల అన్నిమతాలకూ ఆశలు చూపి రాజకీయ పబ్బం గడుపుకునే బూర్జువా పార్టీల అవగాహనకు సిపిఐ(ఎం) అవగాహన పూర్తిగా భిన్నమైనది. బూర్జువా పార్టీలు అనుసరిస్తున్న వైఖరి మెజారిటీ, మైనారిటీ మతోన్మాదాలు రెండింటినీ పెంచి పోషించేదిగా ఉంటోంది. రాజకీయాల్లో ఏ రకమైన మతతత్వ శక్తుల జోక్యాన్నయినా సిపిఐ(ఎం) నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తోంది.

1980 దశకంలో మెజారిటీ మతోన్మాద ప్రమాదం ముందుకొచ్చినపుడు బిజెపి–ఆరెస్సెస్‌లు ఈ మతోన్మాదాన్ని పెంచి పోషించే శక్తులని మొట్టమొదట గుర్తించింది సిపిఐ(ఎం) ఒక్కటే. హిందూత్వ మతోన్మాదానికి వ్యతిరేకంగా పార్టీ నికరంగా పోరాడుతూ వచ్చింది. హిందూత్వ మతోన్మాద శక్తులను రాజకీయంగా ఒంటరిపాటు చేయటానికి సిపిఐ(ఎం) శాయశక్తులా కృషి చేసింది. జాతీయ రాజకీయాల్లో బిజెపి పెరుగుదల, ఆ పార్టీ అధికారానికి రావటం దేశంలోని బడా బూర్జువా, కార్పొరేట్ వర్గాల ప్రయోజనాల పరిరక్షణలో అంతర్భాగమే అని సిపిఐ(ఎం) విశ్వసిస్తోంది. ఈ శక్తులు నయా–ఉదారవాద ఎజెండాను ముందుకు తీసుకెళ్లే కర్తవ్యాన్ని బిజెపి నెత్తిన పెట్టాయి. అందువల్లనే నయా–ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటం, మెజారిటీ మతోన్మాదానికి వ్యతిరేకంగా సాగే పోరాటం పరస్పరం సంబంధం కలిగిన పోరాటాలని సిపిఐ(ఎం) విశ్వసిస్తోంది. ఎన్నికల ప్రయోజనాలకోసమో, మరే ఇతర రాజకీయ ప్రయోజనాల కోసమో బిజెపితో షరీకు కాకుండా మిగిలింది కేవలం సిపిఐ(ఎం), ఇతర వామపక్ష మిత్రులే అని గర్వంగా చెప్పుకోవాలి.

**8**

భారతదేశంలో ప్రత్యామ్నాయ అభివృద్ధి పంథాను ప్రతిపాదించి, ముందుకు తీసుకెళ్లటంలో గత ఐదు దశాబ్దాలుగా సిపిఐ(ఎం) ఒక ముఖ్యమైన శక్తిగా నిలిచింది. సిపిఐ(ఎం) ప్రతిపాదిస్తున్న ప్రత్యామ్నాయ అభివృద్ధి పంథా రాజకీయంగానూ, సామాజికంగానూ, ఆర్థికంగానూ న్యాయమైనది. ప్రజాతంత్రయుతమైనది. భారత రాజకీయాల్లోని అన్ని మూల మలుపుల్లోనూ – లౌకికతత్వ పరిరక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ, సమాఖ్య స్ఫూర్తి పరిరక్షణ, సమానత్వం, న్యాయం సాధన లక్ష్యాలుగా తెరమీదకు వచ్చిన అన్ని సందర్భాల్లోనూ – సిపిఐ(ఎం) తనదైన విలక్షణ తోడ్పాటును అందించింది.

తాజాగా ముగిసిన ఎన్నికల్లో సిపిఐ(ఎం), సోదర వామపక్ష శక్తులు బాగా ఎదురు దెబ్బలు తిన్నాయి. మితవాద శక్తుల దాడి బిజెపి ప్రభుత్వం అధికారం ఏర్పాటు చేయటానికి దారి తీసింది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇటు మతోన్మాదశక్తులకూ, అటు కార్పొరేట్ శక్తులకూ ప్రాతినిధ్యం వహిస్తోంది. లౌకిక ప్రజాస్వామ్యం, కార్మిక హక్కులు, ప్రత్యామ్నాయ విధానాల సాధన కోసం బలమైన సిపిఐ(ఎం), వామపక్ష శక్తుల ఉనికి అవశ్యం. ఈ సవాలును పార్టీ స్వీకరిస్తోంది. ఏప్రిల్ 2015లో జరగనున్న పార్టీ 21వ మహాసభల నేపథ్యంలో పార్టీ కేంద్ర కమిటీ రాజకీయ ఎత్తుగడల పంథాను పునఃసమీక్షించనున్నది. మారిన రాజకీయ పరిస్థితుల్లో అనుసరించాల్సిన సరికొత్త పంథాతో ముందుకు రానున్నది. రెండు దశాబ్దాలకు పైగా అమలు జరుగుతున్న నయా–ఉదారవాద ఆర్థిక విధానాల ప్రభావంతో భారత సమాజంలో, వివిధ వర్గాల్లో చోటుచేసుకుంటున్న మార్పులను నిర్దిష్టంగా అధ్యయనం చేయటానికి పూనుకొంది. రానున్న మహాసభలు ప్రజల్లో పార్టీ పనికి సంబంధించి నూతన దిశా నిర్దేశం చేయనున్నాయి.


పాలక వర్గాలు అనుసరించిన నయా–ఉదారవాద ఆర్థిక విధానాల నేపథ్యంలో విచ్చల విడి దోపిడీ శక్తుల స్వైరవిహారం, దాని పర్యవసానాలు రుచి చూస్తోంది సమకాలీన భారతం. ప్రపంచంలో అత్యంత ధనికులైన వారి సరసన నిలవగలిగే స్తోమత ఉన్న భారతీయుల సంఖ్యతో పాటు ప్రపంచంలోని కటిక దరిద్రుల సంఖ్య కూడా భారతదేశంలో ఎక్కువగా ఉంది. సోషలిజం స్థాపన దిశగా ప్రత్యామ్నాయ విధానాల కోసం జరిగే పోరాటం ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి సాగించవల్సిన పోరాటం.

సిపిఐ(ఎం) ఆవిర్భావ స్వర్ణోత్సవ వేడులక వేళ పార్టీ మనముందుంచిన లక్ష్య సాధనకు మరింత కృతనిశ్చయులమై మనలను మనం పునరంకితం చేసుకుందాం.

**(అనువాదం : కొండూరి వీరయ్య)**

సిపిఐ(ఎం) స్వర్ణోత్సవ ప్రత్యేకం

# యాభై ఏళ్ల కమ్యూనిస్టు ఉద్యమం: అనుభవాలు



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు

**వి. శ్రీనివాసరావు**

సుదీర్ఘ అంతర్గత పోరాటానంతరం 1964లో సిపిఐ(ఎం) ఏర్పడింది. ఆనాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై ప్రజల్లో భ్రమలు తొలుగుతోన్న క్రమంలో కమ్యూనిస్టు ఉద్యమంలో చీలికవచ్చింది. పాలకవర్గాల స్వభావం, విప్లవ వ్యూహంపై వచ్చిన అభిప్రాయ బేధాల కారణంగా ఈ చీలిక వచ్చింది. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన (సోవియట్–చైనాల మధ్య) సైద్ధాంతిక విభేదాలు దీనికి తోడయ్యాయి. ఈ చీలిక వల్ల కమ్యూనిస్టు అభిమానులు, సానుభూతి పరుల్లో నిరాశ, నిరుత్సాహం ఏర్పడ్డాయి. కలిసి ఉంటే కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా కమ్యూనిస్టు పార్టీ ఎదిగేదని చాలామంది ఇప్పటికీ అంటుంటారు. ఈ చీలిక నాయకుల మధ్య వ్యక్తిగత రాగద్వేషాల వల్ల వచ్చిందని అనే వారూ ఉన్నారు. ఈ యాభై ఏళ్ల అనుభవం పరిశీలిస్తే సిపిఐ(ఎం) ఏర్పాటు చారిత్రక అనివార్యత అనే విషయం స్పష్టంగా అర్థమౌతుంది. 1964లో సిపిఐ(ఎం) ఏర్పడిన తర్వాత ఎదురైన అనేక పరీక్షల్లో పార్టీ వైఖరి రాటుదేలింది. యాభై ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో వర్గపోరాటాలు నిర్వహించింది. అసమాన్యమైన త్యాగాలు చేసింది. ఒక్కమాటలో పోరాటాలు, త్యాగాల బాటలో సిపిఐ(యం) ప్రయాణం సాగింది.

1967లో వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారి కాంగ్రెస్‌పై పెద్దఎత్తున వ్యతిరేకత పెల్లుబికింది. అప్పటిదాకా నెహ్రూ ప్రభుత్వాన్ని బలపర్చడం ద్వారా దేశంలో సోషలిజాన్ని సాధించాలన్న సిపిఐ ఈ ఎన్నికల్లో బీహార్, ఉత్తరప్రదేశ్ లాంటి ముఖ్యమైన రాష్ట్రాల్లో కాంగ్రెసేతర బూర్జువా పార్టీలతో కలిసి ప్రభుత్వాల్లో చేరింది. నెహ్రూ ప్రభుత్వం బడా బూర్జువా వర్గానికి రాజకీయ ప్రతినిధనీ, దానికి వ్యతిరేకంగా పోరాడటం ద్వారానే ప్రజలను సమీకరించి, ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతామనీ సిపిఎం వాదిస్తూ వచ్చింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలని పిలుపునిచ్చింది. అయినప్పటికీ తగిన బలం లేకుండా బూర్జువా ప్రతిపక్ష పార్టీలతో కలిసి ప్రభుత్వాలలో చేరడానికి నిరాకరించింది. ఇదే వైఖరి 1996లో కేంద్రంలో కూడా తీసుకుంది. ప్రధానమంత్రి పదవిని తీసుకునే అవకాశం వచ్చినప్పటికీ నిరాకరించింది. ఆ రకంగా కమ్యూనిస్టు పార్టీ స్వతంత్ర వైఖరినీ, ప్రత్యేకతనూ ప్రజల మధ్య నిలబెట్టగలిగింది.

1971–77 మధ్య సిపిఐ(ఎం) తీవ్రమైన నిర్బంధం ఎదుర్కొంది. బెంగాల్లో అర్ధ ఫాసిస్టు పాలన నెలకొల్పబడింది. కేరళ, బెంగాల్, త్రిపుర, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో వందలాది మంది హత్యలకు గురయ్యారు. 74–76 మధ్య ఎమర్జెన్సీ ద్వారా ఇందిరాగాంధీ ప్రభుత్వం పౌర హక్కులను హరించింది. లక్షమంది ప్రతిపక్ష నేతల ను జైళ్లలో పెట్టింది. 1977లో జరిగిన సాధా రణ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయానికి గుర య్యింది. బూర్జువా ప్రతిపక్ష పార్టీల ఉమ్మడి కూట మైజనతా పార్టీ అధికా రంలోకి వచ్చింది. కేరళ, బెంగాల్, త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఐ(ఎం) నాయకత్వంలోని వామపక్షాలు అధికారంలోకి వచ్చాయి. ఈ కాలమంతా సిపిఐ కాంగ్రెస్‌ను బలపరుస్తూ వచ్చింది. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ప్రజలు తీర్పునివ్వడం, సిపిఐ లేకుండానే కేరళ, బెంగాల్, త్రిపురలో వామపక్ష పార్టీలు అధికారంలోకి రావడం సిపిఐని పునరాలోచనలో పడేశాయి. ఆ తర్వాత సిపిఐ ఆత్మవిమర్శ చేసుకుని వామపక్ష స్రవంతిలో

**గత 25 సంవత్సరాలుగా అనుసరిస్తోన్న రాజకీయ ఎత్తుగడలను పునఃపరిశీలించి నూతన ఎత్తుగడలను రూపొందించేందుకు పార్టీ 21వ మహాసభ సన్నాహాలు చేస్తోంది. వామపక్ష ప్రజాతంత్ర శక్తులను ఐక్యంచేసే దిశగా పార్టీ కృషి సాగిస్తుంది. దీనితో పాటు నిర్మాణ సమస్యలు, ప్రజాసంఘాల నిర్మాణం, వివిధ తరగతు లు, వర్గాలపై సరళీకరణ ఆర్థిక విధానాల ప్రభావంపై నిర్దిష్ట అధ్యయనం ఆధారంగా సమస్యల్ని తీసుకొని పనిచేయడం వంటి అనేక అంశాలను కూడా పార్టీ మహాసభ చర్చించనుంది. పార్టీని నూతనోత్సాహంతో ముందుకు నడిపించి సమాజ మార్పు కోసం సాగే పోరాటంలో సిపిఐ(ఎం) పాత్ర దోహద పడేలా 21వ మహాసభ నిర్ణయాలు తీసుకుంటుందని ఆశిద్దాం.**

**"ఆ నాటి పరిస్థితులను, ఉద్యమ పరిమితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర కమ్యూనిస్టు ఉద్యమ పునర్నిర్మాణానికి పార్టీ ఒక పథకాన్ని రూపొందించుకుంది. ఖమ్మం, విజయవాడ, నెల్లూరు, ఏలూరు, విశాఖ, కర్నూలు, హైద్రాబాదు వంటి నగరాల్లో ట్రేడ్ యూనియన్ ఉద్యమంపై కేంద్రీకరిస్తూ ఆ చుట్టు పక్కల గ్రామల్లో వ్యవసాయ కార్మిక పోరాటాలను బలపర్చుకోవడం ద్వారా కార్మిక, కర్షక పోరాటాలకు పునాది వేయాలన్నది ప్రధాన కర్తవ్యం."**



**2000 సం॥ విద్యుత్ పోరాటం: నేలకొరిగిన అమరుడు రామకృష్ణ**

భాగస్వామి అయ్యింది.

ఈ కాలంలో కమ్యూనిస్టు ఉద్యమానికి ఎదురైన విషమ సవాలు సోవియట్ యూనియన్ పతనమవ్వడం. 1992లో మద్రాసులో జరిగిన పార్టీ మహాసభ అంతర్జాతీయ పరిణామాలనూ, సైద్ధాంతిక అంశాలనూ విశ్లేషించి మార్క్సిస్టు మౌలిక సూత్రాలకు తాను కట్టుబడి ఉన్నట్లు నిర్ద్వంద్వంగా ప్రకటించింది. సిపిఐ(ఎం) తీసుకున్న ధృడమైన వైఖరి సిపిఐ సహా ఇతర కొన్ని వామపక్షపార్టీలు నిలదొక్కుకోవడానికి తోడ్పడింది.

ఈ కాలంలో వచ్చిన వివిధ పరీక్షల్లో సిపిఐ(ఎం) తనకుతాను నిలదొక్కుకోవడమే కాకుండా మొత్తం కమ్యూనిస్టు ఉద్యమం, వామపక్ష ఉద్యమం బలపడటానికీ, నిలదొక్కుకోవడానికీ తోడ్పడింది. కమ్యూనిస్టు ఉద్యమం ఐక్యంగా ఉండాలన్న మనోభావాల మీదే ఆధారపడి సైద్ధాంతిక అంశాలపై రాజీపడి ఉంటే దేశంలో మొత్తంగా కమ్యూనిస్టు ఉద్యమ అడ్రస్సే గల్లంతయ్యేది. అందుకే సిపిఐ (ఎం) ఏర్పాటు ఒక చారిత్రక అనివార్యత అయ్యింది. ఈ కాలంలో వామపక్ష ఐక్యత మొత్తం మీద బలపడింది. అనేక విడివిడి అంశాలపై భేధాభిప్రాయాలు ఏర్పడినప్పటికీ, అనేక సందర్భాలలో రాష్ట్రాల స్థాయిలో ఎన్నికల్లో వేర్వేరుగా పోటీ చేసినప్పటికీ జాతీయ స్థాయిలో వామపక్షాల ఐక్యతకు పెద్దగా విఘాతం కలగలేదు. దీనికి సిపిఐ(ఎం) అనుసరించిన విధానమే ముఖ్య కారణం. వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను ఐక్యం చేసే దిశగా ప్రయాణిస్తూ ఆ క్రమంలో వివిధ దశల్లో లౌకిక శక్తులతో కలసి పనిచేస్తూ ముందుకు సాగింది.

కమ్యూనిస్టు పార్టీలో వచ్చిన చీలిక రాష్ట్రంలో ఉద్యమాలను బలహీనపర్చిందనేది నిర్వివాదాంశం. పార్టీ సభ్యుల్లో గణనీయ భాగం సిపిఐ(ఎం)తో నిలబడినప్పటికీ నాయకత్వం, కేడర్ అత్యధిక భాగం సిపిఐతో వెళ్లిపోవడంతో పార్టీ నిలువులా చీలింది. ఆ తర్వాత 1967-68లో వచ్చిన నక్సల్స్ చీలికతో దాదాపుగా యువ కేడర్ అంతా కొట్టుకు పోయింది. ఈ రెండు చీలికలు సిపిఐ(ఎం)ను బాగా బలహీనపర్చాయి. ఖమ్మం, నల్గొండ, వరంగల్, కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాలకే సిపిఐ(ఎం) ఎక్కువ భాగం పరిమితమయ్యింది. ఉత్తర తెలంగాణా, ఉత్తరకోస్తాంధ్ర, దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో నామ మాత్రంగా మిగిలింది. కొంతమంది వ్యక్తులే మిగిలారు. ఇదే కాలంలో 1969-73లలో జైతెలంగాణా, జైఆంధ్ర ఉద్యమలు ఉధృతంగా వచ్చి వామపక్ష ఉద్యమ పురోగమనాన్ని అడ్డుకున్నాయి. ఈ పరిస్థితుల్లో ఉద్యమాన్ని తిరిగి పునర్నిర్మించి ఉన్న ప్రాంతాల్లోనైనా సంఘటితం చేసుకునేందుకు పార్టీ నాయకత్వం ప్రయత్నించింది. 1976 తర్వాత సుందరయ్య గారు రాష్ట్ర ఉద్యమంలోకి ప్రవేశించడంతో ఈ ప్రయత్నాలకు మరింత ఊపు వచ్చింది.

ఆ నాటి పరిస్థితులను, ఉద్యమ పరిమితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర కమ్యూనిస్టు ఉద్యమ పునర్నిర్మాణానికి పార్టీ ఒక పథకాన్ని రూపొందించుకుంది. ఖమ్మం, విజయవాడ, నెల్లూరు, ఏలూరు, విశాఖ, కర్నూలు, హైద్రాబాదు వంటి నగరాల్లో ట్రేడ్ యూనియన్ ఉద్యమంపై కేంద్రీకరిస్తూ ఆ చుట్టు పక్కల గ్రామల్లో వ్యవసాయ కార్మిక పోరాటాలను బలపర్చుకోవడం ద్వారా కార్మిక, కర్షక పోరాటాలకు పునాది వేయాలన్నది ప్రధాన కర్తవ్యం. దీనికి అవసరమైన కార్యకర్తలను తయారు చేసుకోవడానికి విద్యా కేంద్రాలపై కేంద్రీకరించి విద్యార్థి ఉద్యమాన్ని పటిష్టపర్చుకోవాలి. ఈ వ్యూహం చాలా సత్ఫలితాలనిచ్చింది. ఐతే ఎమర్జెన్సీ అనంతరం మారిన పరిస్థితుల్లో పార్టీ పదో మహాసభ-సాల్కియా ప్లీనం ఇచ్చిన మార్గదర్శకత్వంలో పార్టీ ప్రజా సంఘాలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలని పథకం రూపొందించింది. దీనికోసం పెద్ద ఎత్తున రాజకీయ పాఠశాలలను నిర్వహించింది. అవసరాన్ని బట్టి ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి క్యాడర్‌ను కూడా బదలాయించింది. 1977 ఎమర్జెన్సీ అనంతరం పార్టీ ప్రతిష్ట బాగా పెరిగింది. నక్సలైటు చీలికతో కోల్పోయిన క్యాడర్ స్థానంలో యువరక్తం వచ్చింది. దేశమంతా కాంగ్రెస్ ఓడిపోయినా ఇందిరాగాంధీ సంక్షేమ కార్యక్రమాల ప్రభావంతో మన రాష్ట్రంలో కాంగ్రెస్ విజయం సాధించింది. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో నక్సలైట్ల పేరుతో అనేక మందిని కాల్చి చంపారు. దీనిపై విచారణ జరపాలనీ, దోషులను శిక్షించాలనీ డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ఉద్యమం వచ్చింది. దీనికి సుందరయ్య గారే ప్రత్యక్షంగా సారథ్యం వహించారు. భార్గవ కమిషన్ ఏర్పాటుకు అది దారితీసింది. దీని కొనసాగింపుగా రాష్ట్రంలో పౌర హక్కుల సంఘం ఆవిర్భవించింది. మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో అవినీతి విస్తరించింది. దీనికితోడు ప్రజలపై పన్నుల భారం పెరిగింది. ఆర్టీసి ఛార్జీలు పెరిగాయి. హైద్రాబాదులో రమీజాబీ అనే మహిళపై జరిగిన అత్యాచారం రాష్ట్రమంతటా సంచలనం రేకెత్తించింది. అన్నీ కలిపి కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత పెల్లుబికింది. ఈ పరిస్థితుల్లో సిపిఐ(ఎం) ప్రత్యేకించి సుందరయ్య చొరవతో ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి అఖిలపక్ష

ఉద్యమానికి నాంది పలికాయి. విజయవాడలో జరిగిన పోలీసుల కాల్పుల్లో ఒక యువకుడు మరణించాడు. అనేక చోట్ల లాఠీ చార్జీలు, కేసులతో నిర్బంధం అమలు జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు, బంద్‌లు జరిగాయి. ప్రజలు పెద్దఎత్తున వీటిలో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఈ పోరాటాల ఫలితంగా కాంగ్రెసేతర ప్రతిపక్ష పార్టీల మధ్య సమన్వయం పెరిగింది. మరోవైపు ఇదే కాలంలో సిపిఐ(ఎం) నాయకత్వంలో స్వతంత్రంగా రాష్ట్ర వ్యాప్తంగా కూలి పోరాటాలు, భూపోరాటాలు జరిగాయి. నెల్లూరు జిల్లాలో జరిగిన భూ పోరాటంలో పోలీసు కాల్పుల్లో ఒకరు మృతి చెందారు. అనేకమంది గాయపడ్డారు. వీటన్నింటి ఫలితంగా కాంగ్రెస్ వ్యతిరేకత పెల్లుబికింది. కమ్యూనిస్టు ఉద్యమ ప్రతిష్ట పెరిగింది.

ఈ పరిస్థితుల్లో 1982లో అనుకోకుండా రాష్ట్ర రాజకీయం కొత్త మలుపు తిరిగింది. పెరుగుతోన్న కమ్యూనిస్టు ఉద్యమ ప్రతిష్టతో కంగుతిన్న బూర్జువా, భూస్వామ్య వర్గాలు కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఎన్టీఆర్ సారధ్యంలో తెలుగుదేశం పార్టీని ముందుకు తెచ్చాయి. ఈ కొత్త రాజకీయ శక్తిని సిపిఐ(ఎం) ఆహ్వానించింది. 1983లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం ఘనవిజయం సాధించింది. టిడిపితో సీట్ల పొత్తులు కుదరని కారణంగా సిపిఐ, సిపిఐ(ఎం) కలిసి విడిగా పోటీచేశాయి. రాజకీయ పవనాలు తెలుగుదేశంకు అనుకూలంగా ఉండటంతో కమ్యూనిస్టు పార్టీలు ఈ ఎన్నికల్లో వెనుకపట్టు పట్టాయి. టిడిపితో పొత్తు కుదరని కారణాలపై కేంద్ర కమిటీ సమీక్ష ఆధారంగా రాష్ట్ర కమిటీ కొన్ని నిర్ధారణలకు వచ్చింది. 1984లో ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని అక్రమంగా రద్దు చేయడంతో ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం ప్రజా ఉద్యమం పెల్లుబికింది. సిపిఐ, సిపిఐ(ఎం)లు ఇందులో చురుకైన పాత్ర పోషించాయి. 1985లో జరిగిన మధ్యంతర అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి, వామ పక్షాలు కలిసి పోటీ చేసి ఘనవిజయం సాధించాయి. ఈ ఉమ్మడి అవగాహన దీర్ఘకాలం కొనసాగడంతో ఏర్పడిన దుష్పరిణామాలపై 1998లో జరిగిన నల్గొండ రాష్ట్ర మహాసభలో ఆత్మ పరిశీలన చేసుకుంది. బూర్జువా పార్టీలతో ఎన్నికల్లో కలిసి వ్యవహరిస్తున్నప్పటికీ దానిని ఎన్నికలకే పరిమితం చేసి మిగతా కాలంలో స్వతంత్రంగా వ్యవహరించాలని ఆ మహాసభ నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత పార్టీ విస్తరణకు నూతన ఒరవడితో పనిచేయాలని నిశ్చయించుకుంది. 2002లో హైదరాబాద్‌లో జరిగిన 17వ అఖిలభారత మహాసభ దీన్ని ధృవీకరించింది. కొన్ని విలువైన రాజకీయ పాఠాలను తీసింది.

> **"1985లో సుందరయ్య గారు మరణించడంతో రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమానికి నూకలు చెల్లినట్లేనని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. కానీ పార్టీ సమిష్టి నాయకత్వంలో ఒడిదుడుకులను ఎదుర్కొని ముందుకు సాగింది."**



ఇళ్ల స్థలాల పోరాటం: నేలకొరిగిన ముదిగొండ అమరులు

1985లో సుందరయ్య గారు మరణించడంతో రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమానికి నూకలు చెల్లినట్లేనని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. కానీ పార్టీ సమిష్టి నాయకత్వంలో ఒడిదుడుకులను ఎదుర్కొని ముందుకు సాగింది. ఈ కాలంలో కారంచేడు దళితుల ఊచకోతపై రాష్ట్రమంతటా ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఎన్జీఓలు రాష్ట్ర వ్యాపిత సమ్మెకు పూనుకున్నారు. ప్రకాశం జిల్లాలో పత్తిరైతుల ఆత్మహత్యలు వ్యవసాయ సంక్షోభానికి అద్దం పట్టాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో ఆకలి చావులు, కరీంనగర్ జిల్లాలో చేనేత కార్మికుల ఆకలి మరణాలు పెరుగుతోన్న ఆర్థిక సంక్షోభానికి నిదర్శనంగా నిలిచాయి. ఎన్టీఆర్ ఎన్నో ప్రతిష్టాత్మకమైన సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ దళితులు, ఎన్జీఓల్లో వచ్చిన వ్యతిరేకతతో ఓటమి పాలవ్వక తప్పలేదు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్, బిజెపిలకు వ్యతిరేకంగా వామపక్ష, ప్రజాతంత్ర లౌకిక పార్టీలతో కలిసి పనిచేయాలన్న నిర్ణయం కారణంగా రాష్ట్రంలో టిడిపితో పొత్తు కొనసాగింది. టిడిపిపై వచ్చిన వ్యతిరేకత ప్రభావం కమ్యూనిస్టు పార్టీలపై కూడా పడింది. ఈ దీర్ఘకాల రాజకీయ పొత్తులు పార్టీపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. పార్లమెంటరీధోరణులు ప్రవేశించాయి. క్రమంగా ప్రజాపునాది బలహీనపడింది. 1999 ఎన్నికల్లో ఎక్కువ స్థానాల్లో తక్కువ ఓట్లు వచ్చాయి. 2002లో హైద్రాబాద్‌లో జరిగిన పార్టీ అఖిల భారత మహాసభ బూర్జువా పార్టీలతో పొత్తులపై అనుభవాలను సమీక్షించింది. పొత్తులు ఉన్నప్పటికీ వాటిని ఎన్నికలకే పరిమితం చేసి పార్టీ స్వతంత్రతను కాపాడుకోవాలని ఆ మహాసభ పిలుపునిచ్చింది. 1998లో జరిగిన సాధారణ ఎన్నికల అనంతరం తెలుగుదేశం పార్టీ బిజెపి కూటమిలో చేరింది. ఈ ప్రతికూల రాజకీయ పరిణామాన్ని రాష్ట్రంలో సిపిఐ(ఎం) తనకు అనుకూలంగా మలుచుకుంది. చంద్ర బాబు అనుసరిస్తోన్న ప్రపంచబ్యాంకు ప్రాయోజిత ఆర్థిక విధానాలపై చురుగ్గా పోరాడింది. ప్రపంచబ్యాంకు ఒప్పందాల అసలు రూపాన్ని వెల్లడిచేస్తూ పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టింది. సిపిఐ(ఎం) విడుదల చేసిన అనేక కరపత్రాలు, పుస్తకాలు, వ్యాసాలను కాంగ్రెస్ పార్టీ కూడా తన ప్రచారానికి వినియోగించుకుంది. 2000 సంవత్సరంలో విద్యుత్ ఛార్జీల పెంపుపై పెల్లుబికిన వ్యతిరేకత మొత్తం ఉద్యమాన్ని ఒక మలుపు తిప్పింది. రాష్ట్రవ్యాప్తంగా మూడు మాసాలు కొనసాగిన ఈ ఉద్యమం అనేక విలువైన పాఠాలను నేర్పింది. నూతన తరహా ప్రచారాందోళన పద్ధతుల్లో పార్టీ కార్యకర్తలు రాటుదేలారు. ప్రజలను సమీకరించడానికి విస్తృతంగా పర్యటించారు. కేసులు, నిర్బంధాలు

**❝ దీర్ఘకాల ప్రతిష్టంభన అనంతరం 2014 జూన్ 2వ తేది నుండి తెలంగాణా ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. ప్రజల్లో అభివృద్ధి కావాలన్న ఆకాంక్షలు పెరిగాయి. సీమాంధ్ర ప్రాంతంలో వెనుకబడిపోతామన్న భయాందోళనలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా నిరుద్యోగ యువతలో ఇది ఎక్కువగా ఉంది. రెండు రాష్ట్రాల్లో సిపిఐ(యం) కమిటీలు ఏర్పడి ఉద్యమాన్ని చురుగ్గా ముందుకు నడిపించడానికి కృషి చేస్తున్నాయి. ❞**



అంగన్వాడీ మహిళలపై గుర్రాలపై దాడి చేసిన నాటి చంద్రబాబు ప్రభుత్వ పోలీసులు.

ఎదుర్కొన్నారు. పోలీసుల లాఠీ దెబ్బలను కార్యకర్తలు సహనంగా భరించడాన్ని టివీల్లో చూసిన ప్రజలు ఆగ్రహావేశాలకు లోనయ్యారు. ఎమ్మెల్యేల నిరసన దీక్షలకు మద్దతుగా చేపట్టిన చలో హైద్రాబాదు కార్యక్రమాన్ని ప్రభుత్వం రక్తపుటేరుల్లో ముంచింది. ముగ్గురు యువ కిశోరాలు నేలకొరిగారు. పదుల సంఖ్యలో కార్యకర్తలు తుపాకీ గుళ్లకు గురయ్యారు. వందల, వేలమంది లాఠీదెబ్బలకు గురయ్యారు. యువకులు, మహిళలు ఈ ఉద్యమంలో ముఖ్యపాత్ర పోషించారు. సిపిఐ(ఎం) ప్రతిష్ట బాగా పెరిగింది. రాష్ట్రంలో 1978-82 మధ్య సాగిన ఉధృత పోరాటాల దశ తర్వాత దీన్ని మరో పోరాటాల దశగా చెప్పుకోవచ్చు. 2000-2004 మధ్య రాష్ట్రంలో వామపక్ష ఉద్యమానికి కొత్త రూపం ఇవ్వడంలో సిపిఐ(ఎం) కీలకపాత్ర పోషించింది. 9 వామపక్ష పార్టీల మధ్య ఐక్య కార్యాచరణ బలపడింది. 2004 ఎన్నికల్లో బిజెపి-తెలుగుదేశం పార్టీల ఓటమితో వామపక్షాల ప్రాబల్యం మరింత పెరిగింది.

పార్టీ నల్గొండ రాష్ట్ర మహాసభ తర్వాత వివిధ సామాజిక తరగతుల్లో పనిచేయడానికి సిపిఐ(ఎం) చొరవ తీసుకుంది. ఊరూరా దళితవాడలకు తిరిగి సర్వేలు నిర్వహించింది. వాటి ఆధారంగా డిమాండ్లు రూపొందించింది. కులవివక్షతపై కమిషన్ వేయాలన్న ప్రధాన డిమాండుతో రాష్ట్రవ్యాప్త పోరాటానికి దిగింది. ఈ ఉద్యమం ఫలితంగా కులవివక్ష వ్యతిరేక ఉద్యమం సంఘటిత రూపం తీసుకుంది. ఇదే కాలంలో వివిధ వృత్తి సంఘాలు ఏర్పడ్డాయి. కూలి పోరాటాలు ఊరూరా విస్తరించాయి. తమ డిమాండ్లు తామే రూపొందించుకుని స్వతంత్రం గా పోరాటాలు నిర్వహించేవిధంగా కూలీలను సమాయత్తం చేయడంలో ప్రజాతంత్ర పనివిధా నం సాధానంగా తోడ్పడింది. విశాఖ మన్యం, పశ్చిమ గోదావరి, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో భూమి కోసం గిరిజన పోరాటాలు ఉధృతంగా సాగాయి. పశ్చిమగోదావరి జిల్లాలో పెద్దఎత్తున పోలీసు నిర్బంధం వచ్చింది. దాన్ని ఎదుర్కొని పార్టీ నిలబడింది. సమరశీలంగా గిరిజనులు పార్టీ వెనుక నిలబడ్డారు. వివిధ ప్రభుత్వ స్కీముల్లో పని చేస్తున్న మహిళలు సంఘాలు పెట్టుకుని సిఐటియు ఆధ్వర్యంలో పోరాడి తమ హక్కులను సాధించుకున్నారు. 2006-07లో సాగిన భూ పోరాటం వేలాది మందిని కదిలించింది. పట్టణాల్లోని మురికివాడల ప్రజలు, ప్రత్యేకించి మహిళలు ఇళ్ల స్థలాల కోసం సమరశీలంగా ముందుకొచ్చారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా ముదిగొండలో జరిగిన కాల్పుల్లో ఏడుగురు చనిపోయారు. వేలాదిమందిని జైళ్లకు పంపారు. ఈ ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణిచివేయాలని రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ప్రయత్నించింది. ఇళ్ల స్థలాల సమస్యను ఎజెండాపైకి తీసుకురావడంలో ఈ ఉద్యమం ముఖ్యపాత్ర పోషించింది. అనేక చోట్ల ఆక్రమించుకున్న స్థలాలకు పట్టాలు కూడా పొందారు. ఇప్పటికీ పట్టాల కోసం ఆ పోరాటం వివిధ రూపాల్లో కొనసాగుతూనే ఉంది. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం అన్ని జిల్లాలలో నిర్దిష్ట ప్రణాళిక, కార్యాచరణతో పాదయాత్రలు జరిగాయి. ముఖ్య నాయకత్వమంతా ఇందులో పాల్గొన్నది. రోజుల తరబడి ఈ యాత్రలు సాగాయి. దారి పొడవునా ప్రజల్ని కలుసుకొని సంభాషించారు. ప్రజలు కూడా యాత్రిల్ని స్వాగతించారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నీటిపారుదల ప్రాజెక్టుల్ని చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని పెద్ద ఎత్తున ఆందోళనలు సాగాయి. ప్రాజెక్టు సాధన కమిటీలు ఏర్పడ్డాయి. కులవివక్షతను అంతం చేయాలని రంగారెడ్డి, ఖమ్మం జిల్లాలలో రాష్ట్ర కార్యదర్శి, కార్యదర్శివర్గ సభ్యులు సైకిల్ యాత్రలు చేపట్టారు. ఇది మంచి ప్రభావాన్ని చూపింది. తర్వాత సబ్‌ప్లాన్ చట్టం కోసం రాష్ట్రకార్యదర్శి, కార్యదర్శివర్గసభ్యులు హైదరాబాద్‌లో నిరాహార దీక్షలు చేసిన ఫలితంగా ప్రభుత్వం దిగొచ్చి చట్టం చేయక తప్పలేదు. పలు సామాజిక సంస్థలు, రాజకీయ పార్టీలు దీనికి మద్దతునిచ్చాయి.

పోరాటాలతో పాటు పార్టీ కార్యకర్తలను రాజకీయంగా అభివృద్ధి చేసుకోడానికి పెద్దఎత్తున రాజకీయపాఠశాలలు నిర్వహించింది. అధ్యయన తరగతుల ద్వారా నిరంతర స్వీయ అధ్యయనాన్ని కార్యకర్తల్లో ప్రేరేపించింది. అనేక కొత్త ప్రాంతాలకు పార్టీ, ప్రజాసంఘాలు విస్తరించాయి. దాదాపు ఉమ్మడి రాష్ట్రంలో అన్ని జిల్లాలలో, మండలాలలో శాఖలు ఏర్పడ్డాయి. అసంఘటిత రంగంలో కార్మికోద్యమం బలపడింది. దళితులు, గిరిజనుల్లో పార్టీ ప్రతిష్ట పెరిగింది. కానీ ఇదే కాలంలో పార్టీ అనుసరించిన రాజకీయ విధానంలో ఉన్న కొన్ని పొరపాటు ధోరణుల వల్ల స్వతంత్రంగా అభివృద్ధి కావడానికి ఆటంకాలు ఏర్పడ్డాయి. పోరాటాల్లో ఎర్రజెండా చేపట్టి నడచిన ప్రజలంతా రాజకీయంగా పార్టీతో రాలేదు. బూర్జువా పార్టీలపై వారిలో భ్రమలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ అంశాలను రానున్న 21వ అఖిల భారత మహాసభల్లో విపులంగా చర్చించి నిర్ణయం తీసుకోనుంది.

1990ల తర్వాత ప్రవేశించిన సరళీకరణ ఆర్థిక విధానాలు అనేక మార్పుల్ని తీసుకొచ్చాయి. నూతన మధ్యతరగతి ఆవిర్భవించింది. వారి ఆలోచనా ధోరణులు మారాయి. త్వరగా

సంపన్నులు కావాలన్న మధ్యతరగతి ఆలోచనా ధోరణులను బూర్జువాపార్టీలు తమకనుకూలంగా మలచుకున్నాయి. ప్రత్యేకించి ఇటీవల జరిగిన ఎన్నికల్లో మోడీ నాయకత్వంలోని మతోన్మాద శక్తులు బలపడ్డాయి.

దీర్ఘకాల ప్రతిష్టంభన అనంతరం 2014 జూన్ 2వ తేది నుండి తెలంగాణా ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. ప్రజల్లో అభివృద్ధి కావాలన్న ఆకాంక్షలు పెరిగాయి. సీమాంధ్ర ప్రాంతంలో వెనుకబడిపోతామన్న భయాందోళనలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా నిరుద్యోగ యువతలో ఇది ఎక్కువగా ఉంది. రెండు రాష్ట్రాల్లో సిపిఐ(యం) కమిటీలు ఏర్పడి ఉద్యమాన్ని చురుగ్గా ముందుకు నడిపించడానికి కృషి చేస్తున్నాయి.

మొత్తం మీద ఈ యాభై ఏళ్ల చరిత్రను పరిశీలించినప్పుడు రాష్ట్రంలో పలు ముఖ్యమైన దశల్లో ఉద్యమం మలుపులు, ఆటుపోట్లు ఎదుర్కొంది. జయాపజయాలను చవిచూసింది. ఎగుడుదిగుళ్లను ఎదుర్కొంది. 1964 నుండి 1972 వరకు పార్టీని పునర్నిర్మించుకునే దశగా పేర్కొనవచ్చు. 1972-76 మధ్య పోరాటాలు-నిర్బంధాల దశ. 1977-82 మధ్య సమైక్య ప్రజా ఉద్యమాలు ఉధృతంగా సాగిన దశ. 1984 నుండి 98 వరకూ పార్టీ, ప్రజా ఉద్యమాలను సంఘటితం చేసుకునేందుకు కృషి జరిగిన దశగా చెప్పుకోవచ్చు. 2000 తర్వాత నూతన ఒరవడితో పార్టీ, ప్రజా ఉద్యమాలు విస్తరించిన దశగా చెప్పుకోవచ్చు. మొత్తంమీద కొన్ని సానుకూల, ప్రతికూల రాజకీయ పరిస్థితుల మధ్య సిపిఐ(ఎం) పనిచేసింది. ఐనప్పటికీ పార్టీ ఆశించిన విధంగా పెరగలేదు. అభివృద్ధిలో నిలకడ లేదు. దీనికి కొన్ని వస్తుగత కారణాలతో పాటు ఆత్మగతమైన కారణాలు కూడా ఉన్నాయి. పోరాటాలు, ఉద్యమాల్లో వెల్లువగా వచ్చిన ప్రజా సమూహాలను రాజకీయంగా సంఘటితం చేసుకోవడంలో వైఫల్యం ఉంది. ఈ వైఫల్యానికి నిర్మాణ కారణాలతో పాటు రాజకీయ కారణాలు కూడా ముఖ్యపాత్ర పోషించాయి. దీర్ఘకాలం వివిధ బూర్జువా పార్టీలతో పెట్టుకున్న పొత్తులను ప్రజలు హర్షించలేదు. క్యాడర్, నిర్మాణంపై ఇది ప్రతికూల ప్రభావం చూపింది. కమ్యూనిస్టులతో ఉండే ప్రజా సమూహాలు బూర్జువా పార్టీలపై బూర్జువా పార్టీలపై భ్రమలు పెంచుకున్నాయి. ఫలితంగా 1999లో ఒకసారి తిరిగి 2014లో మరోసారి ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తినాల్సి వచ్చింది. సరళీకరణ ఆర్థిక విధానాలు ప్రవేశించడం, సోవియట్ పతనం, మతోన్మాదశక్తులు ప్రమాదకరంగా పెరగడం వంటి పరిణామాల నేపథ్యంలో గత 25 సంవత్సరాలుగా అనుసరిస్తోన్న రాజకీయ ఎత్తుగడలను పున్ణపరిశీలించి నూతన ఎత్తుగడలను రూపొందించేందుకు పార్టీ 21వ మహాసభ సన్నాహాలు చేస్తోంది. వామపక్ష ప్రజాతంత్ర శక్తులను ఐక్యం చేసేదిశగా పార్టీ కృషి సాగిస్తుంది.

దీనితో పాటు నిర్మాణ సమస్యలు, ప్రజాసంఘాల నిర్మాణం, వివిధ తరగతులు, వర్గాలపై సరళీకరణ ఆర్థిక విధానాల ప్రభావంపై నిర్దిష్ట అధ్యయనం ఆధారంగా సమస్యల్ని తీసుకొని పనిచేయడం వంటి అనేక అంశాలను కూడా పార్టీ మహాసభ చర్చించనుంది. పార్టీని నూతనోత్సాహంతో ముందుకు నడిపించి సమాజ మార్పు కోసం సాగే పోరాటంలో సిపిఐ(ఎం) పాత్ర దోహద పడేలా 21వ మహాసభ నిర్ణయాలు తీసుకుంటుందని ఆశిద్దాం. ప్రజలకు సుస్థిరమైన, ప్రగతిశీల రాజకీయ ప్రత్యామ్నాయాన్ని అందిండానికి సిపిఐ(యం) తన పోరాటాలను కొనసాగిస్తుంది. సోషలిజాన్ని సాధించేదాకా ఎత్తినజెండా దించకుండా పట్టుదలతో ముందుకు సాగుతూనే ఉంటుంది.

## అభిప్రాయాలు

# పాత భావాలన్నింటినీ ప్రశ్నించాలి, విమర్శించాలి, సవాలు విసరాలి

మార్క్సిస్టు ఎడిటర్‌కి నమస్కారం. సెప్టెంబర్ మార్క్సిస్టు సంచికలో పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు గారు 'సాంస్కృతిక రంగం- పార్టీ కృషి' పేరుతో పదిపేజీల విలువైన సుదీర్ఘవ్యాసం రాశారు. దానిని ఆసాంతం చదివాను. ఆ వ్యాసం నాకే కాక అనేకమందికి చైతన్యాన్ని కలిగించింది. వ్యాసకర్తకు అభినందనలు.

కేంద్రంలో మతోన్మాదశక్తులు పాలన సాగిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో.. సామాజిక పురోగతికి పాటుపడే కమ్యూనిస్టులు, అభ్యుదయ, ప్రజాస్వామిక వాదులు ప్రజా-పాలకుల, పేద-ధనిక సంస్కృతుల మధ్య తేడాను ఎలా తెలుసుకోవాలి, కులం-మతం, స్త్రీలు-పిల్లలు, శ్రమ పట్ల ఎలాంటి అవగాహనను కలిగి ఉండాలి, ప్రతిభ, అందం అంటే ఏమిటి? ఇలా మన జీవితాలతో పెనవేసుకుపోయిన అనేక సంఘటనల పట్ల మనం ఎలాంటి దృక్కోణం కలిగి ఉండాలనే అంశాలను ఈ వ్యాసం ద్వారా చర్చించడం అవసరం.

ఆర్ఎస్ఎస్ మతోన్మాద భావజాలంతో పెరిగిన బిజెపి నేడు కేంద్రంలో ప్రభుత్వాన్ని స్థాపించే స్థాయికి చేరిందంటే దీని వెనక కల్చర్ పేరుతో మతోన్మాదాన్ని ప్రజల్లోకి ఎక్కించడమే కారణం.

ఆర్ఎస్ఎస్ కన్నా ముందు పుట్టిన కమ్యూనిస్టుపార్టీ, ఇతర లౌకికవాద శక్తులు మతాన్ని తక్కువ ఫాసిస్ట్ తీవ్రతగా చూడడమే ఈనాటి వెనుకపట్టుకు కారణం.

కారల్‌మార్క్స్ "క్రిటిసిజమ్ ఆఫ్ రెలిజియన్ ఈస్ ది ప్రీకండీషన్ ఆఫ్ ఆల్ క్రిటిసిజమ్" ("మత విమర్శ అన్ని విమర్శలకు పునాది") అని చెప్పిన మాటను మనం సరిగ్గా అర్థం చేసుకోలేకపోయాం.

భారతీయ సంస్కృతి మతం, కులం, పునాదులపైనే నిర్మింపబడింది. సంస్కృతిని అర్థం చేసుకోవాలంటే రాజకీయ అవగాహనతో పాటు కులం, మతం పునాదులను తెలుసుకోవాలి.

సామాజిక పురోగమనానికి పాటు పడేవారు పాత భావాలన్నింటినీ ప్రశ్నించాలి, విమర్శించాలి, సవాల్ విసరాలి కొత్త ఆలోచనలను రేపాలి, అదే అసలైన విప్లవం.

రచయిత, వ్యాసాన్ని ముగిస్తూ.."సాంస్కృతిక రంగంలో చాలామంది మిత్రులు, మనం ఊహించని మిత్రులున్నారు. వారందరినీ కలుపుకొని ముందుకు సాగాలి" అని కోరుకోవడం మంచి పరిణామం.

తప్పక అలాంటి శక్తులు అన్నీ ఒక్కటిగా కలవాలనీ, కలిసి పనిచేయాలనీ కోరుకుంటూ రచయితకి అభివాదములతో..

**బి.జగన్నాధరావు**
శ్రీకాకుళం.

పార్టీ నిర్మాణం

# ప్రజలకు దగ్గరవుదాం!



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కమిటీ సభ్యులు, ప్రజాశక్తి తెలంగాణా సంపాదకులు

**ఎస్. వీరయ్య**

ఈ సమాజం ఎప్పుడు మారుతుంది? సోషలిజం ఎప్పుడు వస్తుంది?

మన కళ్ల ముందు అనేక పార్టీలు కొత్తగా పుట్టి అధికారంలోకి వచ్చాయి. మన పార్టీ ఎందుకు రావడం లేదు? ఇంకా ఎంత కాలం పడుతుంది? ఇలాంటివే అనేక ప్రశ్నలు ఎదురవుతుంటాయి. నిజమే. సోషలిజం ఎప్పుడొస్తుంది? ఎంత కాలం ఎదురుచూడాలి?

ఎప్పుడు మారుతుందో వేచిచూడడమా? లేక మార్పుకోసం కృషి చేయడమా? ఇదే అసలు ప్రశ్న. సమాజాన్ని మార్చడం మన చేతుల్లో వున్నదా? ఇదీ పరిశీలించాల్సిన అంశమే.

ఈ వ్యవస్థ మారాలంటే రాజ్యాధికారం మారాలి. పెట్టుబడిదారులు, భూస్వాములు రాజ్యాధికారాన్ని తమ గుప్పిట్లో ఉంచుకున్నంతకాలం దోపిడీ వ్యవస్థను కాపాడుతూనే ఉంటారు. దాన్ని మార్చాలంటే రాజ్యాధికారం కార్మికవర్గం చేతుల్లోకి రావాలి. అది ఎన్నికల్లో ఆ పార్టీనీ, దాని మిత్రులనూ ఆ పార్టీ కీలకపాత్ర పోషించే విధంగా ఎన్నుకోవడం ద్వారా జరగవచ్చు లేదా కార్మికవర్గ నాయకత్వంలో ప్రజాతిరుగుబాటు ద్వారా జరగవచ్చు. కార్మికవర్గ పార్టీని ఎన్నుకోవాలన్నా లేదా తిరుగుబాటు చేయాలన్నా అందుకనుకూలమైన పరిస్థితులు కూడా ఉండాలి. తగు ఎత్తుగడలూ వేయాలి. దేశం తీవ్ర ఆర్థిక, రాజకీయ సంక్షోభంలో వుండాలి. అత్యంత వెనుకబడిన ప్రజానీకం కూడా అసంతృప్తితో ఉద్యమాల్లోకి, ప్రత్యక్ష పోరాటా ల్లోకి రావాలి. పాలకవర్గాలకు ఇంకే మాత్రం పాత పద్ధతుల్లో పరిపాలించడం సాధ్యంకాని స్థితి ఏర్పడాలి. వీటితోపాటు, ఈ పరిస్థితులను వినియోగించుకుని కార్మికవర్గాన్నీ, పేద ప్రజానీకాన్నీ సరైన బాటలో నడిపించగల శక్తివంతమైన దేశవ్యాపిత పార్టీ ఉండాలి. వీటిలో మొదటి నాలుగు పరిస్థితులు మన చేతుల్లో లేనివి. ఆ పరిస్థితులు పరిపక్వమయ్యే వరకు వేచిచూడాల్సిందే. కానీ, పార్టీని నిర్మించడం, సరైన ఎత్తుగడలు రూపొందించడం మన కృషికి సంబంధించినవి. మిగతావన్నీ అనుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ తగిన కమ్యూనిస్టు పార్టీ లేనప్పుడు, సరైన ఎత్తుగడలు వేయలేనప్పుడు, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేము. పాల పొంగులాగా ఉద్యమాలు రావడం, చల్లారడం జరగవచ్చు. ఎన్నికల సందర్భంగా అధికారపార్టీ మీద తీవ్ర అసంతృప్తి వ్యక్తం కావచ్చు. అందుబాటులో ఉన్న మరో పార్టీని ఎన్నుకోవచ్చు. కానీ కమ్యూనిస్టుపార్టీని ప్రత్యామ్నాయంగా ప్రజలు పరిగణించకపోవచ్చు. అందుకే అధికారంలోకి ఎప్పుడొస్తామని, సోషలిజం ఎప్పుడొస్తుందని ఎదురుచూడడం కాదు. అందుకోసం కృషి చేయాలి.

సమాజంలో మంచి మార్పు దానంతటది రాదు. అందుకోసం ప్రయత్నించాలి. అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలి. ఈ పని ఎవరు చేయాలి? ఎవరో చేయాలనుకుంటే మార్పు ఎప్పుడొస్తుందని అడుగుతాం. నేనే చేయాలనుకుంటే మార్పు త్వరగా వచ్చేందుకు ఇంకా ఏమి చేయాలో అన్వేషిస్తాం. మార్పుకు ప్రజలు సిద్ధంగా ఉన్నప్పుడు ప్రజలను సరైన దిశలో నడిపించగల రాజకీయశక్తి అందుబాటులో ఉండాలి. అది లేనప్పుడు తప్పుదారి పట్టించే రాజకీయశక్తులు ఆ పరిస్థితులను వినియోగించుకోవచ్చు. గత ఎన్నికల సందర్భంగా మన దేశంలో జరిగింది ఇదే. ప్రజలు కాంగ్రెస్ విధానాలతో విసిగిపోయారు. తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కానీ ప్రత్యామ్నాయ విధానాలతో కూడిన ఒక రాజకీయశక్తి ప్రజల ముందు అందుబాటులో లేదు. ఈ పరిస్థితిని అభివృద్ధి నిరోధక శక్తి అయిన బిజేపీ చాకచక్యంగా వినియోగించుకున్నది. ప్రాంతీయ పార్టీలు కూడా అనేక సందర్భాలలో ఇలాంటి విజయాలు సాధించాయి. బూర్జువా, భూస్వామ్య పార్టీలు ఒకదాని స్థానంలో మరొకటి అధికారంలోకి రావడం సులభం. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా పెట్టుబడిదారులకు, భూస్వాములకు ఇబ్బందిలేదు. ఎవరైనా వారి ప్రయోజనాలనే కాపాడతారు. ఇప్పుడు కేంద్రంలో జరిగిందీ అదే. ప్రజలు కాంగ్రెస్ మీద అసంతృప్తితో ఉన్నప్పుడు పెద్దపెద్ద పెట్టుబడిదారులంతా బిజేపీ వెనుక సమీకృతమయ్యారు. వారందరికీ కాంగ్రెస్ అంటే వ్యతిరేకత వుండికాదు, కాంగ్రెస్ ఏం చేసినా గెలిచే పరిస్థితి లేదు. అందువల్ల తమ ప్రయోజనాలను కాపాడగలిగే బిజేపీని వారు ఎంచుకున్నారు. వివిధ సందర్భాల్లో ప్రాంతీయ పార్టీలను ఎంచుకున్నది ఇందుకే. ఇవేవీ విధానపరంగా ఒకదానికొకటి ప్రత్యామ్నాయం కాదు. కానీ ప్రత్యామ్నాయ విధానాలతో కార్మికవర్గ ప్రయోజనంతో రాజకీయశక్తి ముందుకురావడం, ప్రజల విశ్వాసం పొందటం కీలకం. ఇందుకు దేశవ్యాపితమైన పటిష్టమైన కమ్యూనిస్టు పార్టీని నిర్మించాలి. సరైన ఎత్తుగడలు రూపొందించాలి. ప్రజలను చైతన్యపర్చాలి. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు? మనంకాకపోతే మరెవ్వరు? అని మనకు మనం ప్రశ్నించుకోవాలి.

మార్పు సహజం కదా! మనం కృషిచేయకపోతే ఆగుతుందా? నిజమే.. ఆగదు. నేను కాకపోతే నన్ను మించినవాళ్లు వస్తారు. మార్పు మాత్రం ఆగదు. అది ఎప్పుడనేదే సమస్య. నేనే చేయాలనుకుంటే ఆ ఏర్పాట్లు తొందరగా అవుతాయి. అనుకూల పరిస్థితులు వచ్చినప్పుడు సద్వినియోగం చేసుకోగలుగుతాం. పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభాలు అనివార్యమని పదేపదే రుజువైంది. తగు సమయంలో చైతన్యవంతమైన కార్మికవర్గం జోక్యం చేసుకోగలిగితే అధికారంలోకి రాగలుగుతుందని కూడా రుజువైంది.

**"ఏదైనా అనుభవం నుండి నేర్చుకోవాల్సిందే. అనుభవం వచ్చిన తర్వాత చేయడం కాదు, చేస్తుంటే అనుభవం వస్తుంది. ఎప్పుడైనా ఎక్కడో ఒక దగ్గర ప్రారంభించాల్సిందే. ఎంత తొందరగా ప్రారంభిస్తే అంత మంచిది. ఎదురు చూసి ప్రయోజనం లేదు. గడిచిన కాలం మళ్ళీ రాదు. ప్రతి నిముషాన్ని సద్వినియోగం చేసుకోవాలి."**

చైతన్య పరిచే పని, దిశానిర్దేశం చేయగల కమ్యూనిస్టు పార్టీని నిర్మించే పని నేనే చేయాలనుకుంటే ఆ మార్పు వేగవంతం కావడానికి నేనూ తోడ్పడగలను. ప్రజల విశ్వాసం పొందగల ఎత్తుగడలు రూపొందించడంలో నేను కూడా సృజనాత్మకంగా భాగస్వామిని కాగలను. ప్రతి కమ్యూనిస్టూ పట్టుదలను ప్రదర్శించాల్సింది ఇక్కడే. పోరాటాల సమయంలో కార్మికవర్గ చైతన్యం తొందరగా పెరుగుతుంది. సాధారణ సమయంలో అంత వేగంగా పెరగకపోవచ్చు. కాని ఎప్పుడైనా అందుకు కృషి చేయాల్సింది కమ్యూనిస్టులే. ఇది ప్రతి కమ్యూనిస్టూ చైతన్యయుతంగా చేయాల్సిన పని.

మార్పు కోసం చేసే కృషి ప్రణాళికాబద్ధంగా ఉండాలి. నిర్దిష్ట కాలంలో నిర్దిష్ట ఫలితాలు సాధించే లక్ష్యంతో చేయాలి. విప్లవానికి పరిస్థితులు అనుకూలించినప్పుడు వాటిని ఉపయోగించుకోగల దేశవ్యాపిత పార్టీని నిర్మించడమంటే విప్లవానికి తగు ఏర్పాట్లు చేసుకోవడమే. విప్లవోద్యమంలో విఫలం కాకుండా ఉండేందుకు తగు ఏర్పాట్లు చేసుకోవడమే. విఫలం కాకుండా ఉండేందుకు తగు ఏర్పాట్లు చేసుకోకపోవడమంటే విఫలం కావడానికి ఏర్పాట్లు చేసుకోవడమే. చేయాలన్న పట్టుదల ఉంటే మార్గం కోసం వెతుకుతాం. లేకపోతే సాకు కోసం వెతుకు తాం. సాకులు విలువలేనివి. ఫలితాలు విలువ కట్టలేనివి. అందుకే సాధించాలనే పట్టుదల, రాజకీయ లక్ష్యం ఉండాలి. మార్క్సిస్టు–లెనినిస్టు సిద్ధాంతం మీద విశ్వాసమే తగిన లక్ష్యాన్నీ, పట్టుదలనూ కలిగిస్తుంది. ఉద్యమం విజయ పరంపరతో ముందుకు సాగుతున్నప్పుడు అందులో ముందుండడం చాలా మందికి సాధ్యమే. ఎదురుగాలి వీచినప్పుడు, పరిస్థితులు అనుకూలించనప్పుడు కూడా పార్టీని సన్నద్ధం చేసుకునే కృషిలో పట్టుదల ప్రదర్శించడం ముఖ్యం. మార్క్సిజం మీద విశ్వాసం తగినంతగా లేనప్పుడు ఇలాంటి అననుకూల పరిస్థితుల్లో నిలదొక్కుకోవడం కష్టం. సిద్ధాంతం పట్ల అచంచలమైన విశ్వాసం ఉన్నప్పుడు ఫలితాలు సాధించడానికి మార్గాలు వెతుకుతాం. ఒక మార్గంలో విఫలమైతే మరో మార్గంకోసం అన్వేషిస్తాం. ఒక ఎత్తుగడతో ఫలితం రాకపోతే మరో ఎత్తుగడ వేస్తాం. దారిలేకుండా ఏ లక్ష్యమూ ఉండదు. దారి కనుక్కోవడమే మన పని. అందుకే అసాధ్యమనుకోవద్దు. సాధించేం దుకు ప్రయత్నించాలి. అంతేకాదు, ఫలితాలు మాటలతో రావు, కార్యాచరణతోనే వస్తాయి. అందుకే చేతల్లో చూడాలి.

సిద్ధాంతం పట్ల ఎంతటి విశ్వాసమున్నప్పటికీ అందరికీ సామర్థ్యం ఉంటుందా? అవును. అందరి సామర్థ్యమూ ఒకటికాదు. అందరి నైపుణ్యమూ సమానంకాదు. ఎంత చెట్టుకు అంత గాలి. శక్తి సామర్థ్యాలను బట్టే ఫలితాలు గాంటాయి. సామర్థ్యం పెంచుకునేందుకు అందరికీ అవకాశాలు ఉంటాయి. ఎవరూ పుట్టుకతో పరిపూర్ణులు కాలేరు. ఎవరూ ఎప్పటికీ అన్ని పనుల్లో పరిపూర్ణులు కారు. ప్రతి వ్యక్తిలోనూ కొన్ని సామర్థ్యాలు ఉంటాయి. ప్రతివారూ ఏదో ఒకదానిలో లేదా కొన్నింటిలో నిపుణులే. సామర్థ్యం/ నైపుణ్యం దానంతట అది రాదు, గాలిలో నుంచి ఊడిపడదు. సాధనతోనే వస్తుంది. ఎవరైనా ఓనమాలతో ప్రారంభించాల్సిందే. కాని మాధ్యమిక స్థితి, ముగింపు మన చేతుల్లో ఉంది. భవిష్యత్తు, అంతిమంగా సాధించాల్సింది మన చేతుల్లో ఉంది.

ఏదైనా అనుభవం నుండి నేర్చుకోవాల్సిందే. అనుభవం వచ్చిన తర్వాత చేయడం కాదు, చేస్తుంటే అనుభవం వస్తుంది. ఎప్పుడైనా ఎక్కడో ఒక దగ్గర ప్రారంభించాల్సిందే. ఎంత తొందరగా ప్రారంభిస్తే అంత మంచిది. ఎదురు చూసి ప్రయోజనం లేదు. గడిచిన కాలం మళ్ళీ రాదు. ప్రతి నిముషాన్ని సద్వినియోగం చేసుకోవాలి. చిన్న ఘటన, పెద్ద ఘటన అనేదానితో నిమిత్తం లేదు. ప్రతిదీ అనుభవం పెంపుదలకు తోడ్పడేదే. గణనీయమైన ప్రభావం చూపేదే. అందుకే దేనినీ తక్కువ అంచనా వేయవద్దు. ప్రతిదాని నుండి నేర్చుకునే ప్రయత్నం చేయాలి. కాలం మనకోసం ఆగదు. ఉన్న స్థితిలో మరోక్షణం ఉండజాలం. జీవితంలో ప్రతిరోజూ ఒక కొత్త అధ్యాయమే. కొత్తదనం ఉండాల్సిందే. కొత్తది సాధించాల్సిందే. వృధా చేసుకోవద్దు. నిన్నటికన్నా ముందుకు పోవాల్సిందే. సంవత్సరంలో సాధించాల్సిన దానిలో ఒకరోజు వాటా ఈ రోజు సాధించాల్సిందే. రేపటికి వాయిదా తగదు. వాయిదా వేయడమంటే విప్లవాన్ని వాయిదా వేయడమే. మనం చేయాల్సిన పనులన్నీ వాయిదా వేస్తూ విప్లవం ఎప్పుడొస్తుందని ఎవరినో అడిగి ప్రయోజనం ఏమిటి? దేశ వ్యాపిత పార్టీ గురించి మాట్లాడుతున్నాం. దేశంలో రాష్ట్రం భాగమే. రాష్ట్ర వ్యాపిత పార్టీ గురించి ఆలోచించాలి. జిల్లా వ్యాపిత పార్టీ గురించి ఆలోచించాలి. ప్రతి మండలంలో పార్టీని నిర్మించాలి. సంక్షోభ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయం కోసం ప్రజలు వెతుకుతున్నప్పుడు తమ చుట్టూ పార్టీ అందుబాటులో ఉండాలికదా? అప్పుడే ప్రత్యామ్నాయం కోసం వెతికే జనం కార్మికవర్గ పార్టీని కూడా ఒక ప్రత్యామ్నాయంగా పరిగణిస్తారు. విశ్వాసం కలిగితే ఎంచుకుంటారు.

తమకు కమ్యూనిస్టు పార్టీ అందుబాటులో ఉన్నంత మాత్రాన దీనినే ప్రత్యామ్నాయంగా ఎంచుకుంటారన్న నియమం ఏమీలేదు. ఈ పార్టీ విధానాలు ప్రత్యామ్నాయంగా ప్రజలు విశ్వసించినప్పుడే ఎంచుకుంటారు. ప్రజల విశ్వాసం పొందడం ఇక్కడ కీలకం. వివిధ రాజకీయ ఘటనల్లోనూ, ఎన్నికల సందర్భాల్లోనూ వేసిన ఎత్తుగడలను బట్టి, ప్రత్యామ్నాయ విధానాల కోసం చేసిన కృషిని బట్టి ప్రజలకు విశ్వాసం కలుగుతుంది. ప్రజలకు విశ్వాసం కలగలేదంటే మన విధానంలోనో లేక నిర్మాణ పద్ధతుల్లోనో ఎక్కడో లోపం ఉందనే అనుకోవాలి. పోగొట్టుకున్నచోటే వెతుక్కోవాలి. ప్రజలు మననెందుకు విశ్వసించడం లేదో గ్రహించాలి. అప్పుడే ప్రజల విశ్వాసం పొందే విధానం కోసం అన్వేషించగలం.

ఇది మహాసభల కాలం. ఇదొక యాంత్రికంగా, తంతుగా, ఒక వంతుగా నిర్వహించాల్సిన ప్రక్రియ కాదు. సమీక్షించుకునే సందర్భం. యావత్తు సభ్యులు, కార్యకర్తలు, నాయకులంతా క్రియాశీలంగా, సృజనాత్మకంగా భాగస్వాములు కావాలి. ఎత్తుగడల విధానాన్ని లోతుగా, నిర్మొహమాటంగా, విమర్శనాత్మకంగా పరిశీలించుకోవాలి. రాష్ట్ర వ్యాపిత, దేశ వ్యాపిత పార్టీగా ఎందుకు విస్తరించలేకపోయామో అర్థం చేసుకునేందుకు పని పద్ధతులను, అమలుకు చేసిన కృషిని కూడా పరిశీలించుకోవాలి.

ఆర్థిక రంగం

# ప్రభుత్వరంగ అమ్మకాలు... సర్కారు వారి పాట

సి.పి. చంద్రశేఖర్



రచయిత న్యూఢిల్లీలోని సెంటర్ ఫర్ ఎకనామిక్ స్టడీస్ అండ్ ప్లానింగ్ ప్రొఫెసర్. ఆర్థిక వ్యవహారాలపై విస్తృతంగా రాస్తారు

బిజెపి నేతృత్వంలో ఎన్‌డిఎ ప్రభుత్వం రెండోసారి అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే భారీ ఎత్తున ప్రైవేటీకరణకు తెర తీసింది. ఈ ఏడాది జులై నెలలో ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ లోని పెట్టుబడుల ఉపసంహరణ, ప్రైవేటీకరణ విధానాలను వేగవంతం చేయాలనే అభీష్టాన్ని స్పష్టం చేసింది. ఈ దిశగా తొలి అడుగు కూడా వేసేసింది. సెప్టెంబర్ నెలలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఇందుకు ఆమోద ముద్రపడింది. మంత్రివర్గ నిర్ణయానుసారం, భారీ లాభాలు ఆర్జిస్తున్న ఒఎన్‌జిసి, కోల్ ఇండియా, ఎన్‌హెచ్‌పిసి ఈ మూడు అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థలలో వాటాల అమ్మకంద్వారా 45,000 కోట్ల రూపాయలు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. పెట్టుబడుల ఉపసంహరణ తలపెట్టిన ఈ మూడు ప్రభుత్వరంగ సంస్థలూ 'బ్లూ చిప్' కంపెనీలే కాబట్టి మార్కెట్లో ఆ మేరకు సొమ్ము గడించడం కష్టమైన పనేం కాదు.

కోల్ ఇండియాలో 10 శాతం వాటాలు, ఒఎన్‌జిసిలో 5 శాతం వాటాలు, ఎన్‌హెచ్‌పిసిలో 11.36 శాతం వాటాల అమ్మకం ద్వారా వరుసగా 23,600 కోట్ల రూపాయలు, 19,000 కోట్ల రూపాయలు, 31,000 కోట్ల రూపాయలు సంపాదించాలి అనేది మోడీ సర్కార్ లక్ష్యం. ప్రస్తుతానికి ఈ మూడు ప్రభుత్వరంగ సంస్థలలో సర్కారువారి వాటా వరుసగా 89.65 శాతం, 68.94 శాతం, 85.96 శాతంగా ఉంది. ప్రతిపాదిత వాటాల అమ్మకం తరువాత కూడా ఈమూడు 'బ్లూచిప్' ప్రభుత్వరంగ సంస్థలలో ప్రభుత్వ వాటా యాభై శాతానికి పైగా ఉంటుంది. కాబట్టి ఇది 'ప్రైవేటీకరణ' కాదు, 'పెట్టుబడుల ఉపసంహరణ' మాత్రమే అనే వాదనని మోడీ ప్రభుత్వం ముందుకు నెడుతోంది. ఈ వాటాల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయ్యేనాటికి 48,425 కోట్ల రూపాయలు ఖజానాకు సమకూరుతాయని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఇదిగాక ప్రభుత్వేతర కంపెనీల్లో ఉన్న ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా మరో 15,000 కోట్ల రూపాయలు సమకూరుతాయని, మొత్తంగా 2014–15 ఆర్థిక సంవత్సరానికి పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా 63,425 కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని కేంద్ర సర్కారు ప్రకటించింది. నయా–ఉదారవాద విధానాలు మొదలైన రోజులనుండి పరిశీలిస్తే పెట్టుబడుల ఉపసంహరణ మార్గాన ఒక్క 2012–13లో మాత్రమే 25,000 కోట్ల రూపాయలు సమకూరిన వాస్తవాన్ని గమనంలోకి తీసుకుంటే ప్రస్తుతం మోడీ ప్రభుత్వం పెట్టుకున్న 63,425 కోట్ల రూపాయలు ఆదాయ లక్ష్యం ఆశబోతుదే అనుకోవాలి. అయితే ఇవాళ మోడీ ప్రభుత్వం అమ్మచూపుతున్న మూడు 'బ్లూ చిప్' ప్రభుత్వరంగ సంస్థల ప్రాధాన్యతల రీత్యాగానీ, భవిష్య మార్కెట్ విస్తరణరీత్యాగానీ – దీనికి తోడు స్టాక్‌మార్కెట్‌లో నెలకొని వున్న 'బుల్లిష్' (దూకుడు) ధోరణుల రీత్యాగానీ చూస్తే పాత రికార్డు ఏదో ఒక మేరకు అధిగమించే అవకాశాలే మెండుగా కనిపిస్తున్నాయి.

## హేతు రహితం

ప్రస్తుతం తన ముందున్న సమస్య సర్కారు లక్ష్యం ఫలిస్తుందా లేదా అనేది కాదు. ఈ నిర్ణయం వెనుక ఉన్న కారణాలు సహేతుకమా కాదా అనేది చూడాలి. బడ్జెట్ దృష్ట్యా చూస్తే ప్రభుత్వ వాటాల అమ్మకం అప్పులు చేసి తెచ్చే అవసరాన్ని తగ్గిస్తుంది. భవిష్యత్తులో వడ్డీల భారాన్ని కూడా తగ్గిస్తుంది అనేది ప్రభుత్వ వాదన. బడ్జెట్‌లో ఆదాయం కన్నా వ్యయ అంచనాలు ఎక్కువైనందున (దీనినే ద్రవ్యలోటు అంటారు) ఆ లోటును పూడ్చుకోవడానికి అప్పులు చేసే బదులు మంచి లాభసాటిగా నడుస్తున్న ప్రభుత్వరంగ కంపెనీల వాటాలు అమ్మకం పెట్టాం అనే సర్కారీ వాదన కేవలం అంకెల వ్యవహారం మాత్రమే కాదు. అలా చూసినా ఈ వాదన నిలిచేది కాదు. ప్రభుత్వం బాండ్లు, సెక్యూరిటీలు జారీచేసి వాటి అమ్మకాల ద్వారా ద్రవ్యలోటును పూడ్చుకునేందుకు చూస్తుంది. వీటికి 'సార్వభౌమ హామీ' (సావరిన్ గ్యారంటీ) ఉంటుంది. వీటిమీద వచ్చే వడ్డీ ఆదాయం కన్నా ప్రతిపాదిత 'బ్లూ చిప్ ప్రభుత్వరంగ సంస్థల వాటాలు కొనుగోలు చేస్తే వాటిమీద ఏటా వచ్చే డివిడెండ్ ఆదాయమే హెచ్చుగా వుంటుంది. కాబట్టి ప్రైవేటు కంపెనీలు, మదుపుదార్లు పెట్టుబడుల వాటాలు కొనుగోలు చేస్తారు. దీన్ని తిరగేసి అర్థం చేసుకుంటే ప్రభుత్వం అమ్మజూపుతున్న ప్రభుత్వరంగ సంస్థల వాటాలమీద ఏటా వచ్చే డివిడెంట్ ఆదాయాన్ని కోల్పోయినట్లే. ఇది సర్కారు చెబుతున్న అప్పులమీద తగ్గే వడ్డీ భారంకన్నా ఎక్కువ. దానాదీనా 'లాభం' గూబల్లోకి దిగుతుంది. పెట్టుబడుల ఉపసంహరణ వల్ల సర్కారుకు అదనంగా వచ్చేదీ, ఒరిగేదానికన్నా కోల్పోయేదే ఎక్కువ.

కేంద్రంలో అధికారం చలాయించిన

> “ప్రైవేటీకరణను మరింత వేగవంతం చేయాలని కోరుకొనే శక్తులే ‘ద్రవ్య క్రమశిక్షణ’, ‘అప్పులపై పరిమితులు’ వంటి అంశాల ప్రాధాన్యత గురించి నొక్కి చెబుతూ ఉండడం మనం గమనించవచ్చు. ప్రభుత్వ ఆస్తుల మీద కన్నేసి ఏదో ఒక మార్గాన వాటిపై వచ్చే స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఆదాయాలనూ, వీలయితే ఆ సంస్థలనూ సొంతం చేసుకోవాలని తహతహలాడే బడా ప్రైవేట్ కార్పొరేట్ శక్తులే ఈ వాదనలు ముందుకు తీస్తున్నాయనేది వేరుగా చెప్పనక్కరలేదు.”

వరుసవారీ ప్రభుత్వాలు అది యుపిఎ సర్కారా, ఎన్‌డిఎ సర్కారా అనే దానితో నిమిత్తం లేకుండా పెట్టుబడుల ఉపసంహరణ మీద అంత ప్రత్యేక శ్రద్ధ ఎందుకు పెడుతున్నాయి అనే ప్రశ్న తలెత్తడం సహజం. ఈ ధోరణులకు రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. ప్రభుత్వ వ్యయానికి తగిన స్థాయిలో పన్నుల ఆదాయం వసూళ్ళు కాకపోవడం ఒక కారణం. అయితే ప్రభుత్వ వ్యయాన్నీ, ద్రవ్యలోటునూ తగ్గించే పేరిట కేంద్ర సర్కారు సామాజిక రంగాలకు, సంక్షేమ పథకాలకు చేసే కేటాయింపులోనూ, క్యాపిటల్ వ్యయంలోనూ కోతలు పెడుతూనే మళ్ళీ అవే సాకులతో పెట్టుబడుల ఉపసంహరణకు పూనుకోవటం ఆశ్చర్యం కలిగించే అంశం.

ఇంకా ఆశ్చర్యం కలిగించే అంశమేమిటంటే స్థూల జాతీయోత్పత్తి (జి.డి.పి.) రేటు గత మూడు దశాబ్దాలతో పోల్చి చూసినప్పుడు మెరుగ్గా ఉన్న పరిస్థితులలో ప్రభుత్వం (ఆదాయాలు) ఎంత కటకటగా ఉందంటే ఇప్పటికే కోత పెట్టి తగ్గించిన ప్రభుత్వ వ్యయానికి కూడా సరిపోవడం లేదు. ఇలా ఎందుకు జరుగుతుందని ఆరాతీస్తే స్థూల జాతీయోత్పత్తితో – పన్నుల ఆదాయం నిష్పత్తిని పోల్చిచూస్తే, ఆదాయం అత్యంత కనిష్టస్థాయిలో ఉండడం మనకు కనిపిస్తుంది. కొన్ని సందర్భాల్లో అయితే నేలబారుకు పడిపోయిన పరిస్థితీ ఉంది. ఇంతటి తలతిక్క వ్యవహారాన్ని కూడా నయా–ఉదారవాద మేధావులు సమర్థించుకోవడానికి ఏం చెబుతారంటే “ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించడానికీ, వాటికి వెసులుబాటు కల్పించడానికీ ప్రభుత్వం పన్నుల విధింపు మీద నిగ్రహం పాటిస్తూ ఉండాలి’ అంటుంటారు. ఆర్థిక సంస్కరణల మర్మం ఇదే.

### ద్రవ్య క్రమశిక్షణా సిద్ధాంతం

సంస్కరణల పేరిట నేరుగా ప్రైవేటీకరణకు ఎక్కడా పూనుకోరు. పెట్టుబడుల ఉపసంహరణ అంటేనే పరోక్ష ప్రైవేటీకరణ. వరసవారీ కేంద్ర ప్రభుత్వాలు యుపిఎ/ఎన్‌డిఎ అనే తేడా లేకుండా పెట్టుబడుల ఉపసంహరణకు పూనుకోవడానికి రెండో కారణం ఏంటంటే – ప్రపంచ దేశాలతో పోల్చిచూస్తే మన దేశంలో ప్రభుత్వ అప్పులు స్థూల జాతీయోత్పత్తి శాతంతో పోలిస్తే అంత హెచ్చుగా లేవనే నమ్మం ఒకటి ఉంది. ద్రవ్య క్రమశిక్షణ కోసం ద్రవ్యలోటుమీద పరిమితి విధించుకోవడంతోపాటుగా, ప్రభుత్వం సేకరించే రుణాల మీద కూడా పరిమితి ఉండాలని, అలాగే రుణయేతర మార్గాల ద్వారా గడించే ఆదాయాలు ద్రవ్యలోటును తగ్గించుకోవడానికి వినియోగించుకోవాలనేది నయా–ఉదారవాద సిద్ధాంతం.

ద్రవ్యలోటును తగ్గించుకోవడానికి ప్రైవేటీకరణ మార్గాన్ని ఒక సాధనంగా యుపిఎ/ఎన్‌డిఎ ప్రభుత్వాలు ఎలా వినియోగించుకుంటున్నాయో పైన చెప్పిన వాదనలు బట్టి మనం అర్థం చేసుకోవచ్చు. ప్రైవేటీకరణను మరింత వేగవంతం చేయాలని కోరుకొనే శక్తులే ‘ద్రవ్య క్రమశిక్షణ’, అప్పులపై పరిమితులు వంటి అంశాల ప్రాధాన్యత గురించి నొక్కి చెబుతూ ఉండడం మనం గమనించవచ్చు. ప్రభుత్వ ఆస్తుల మీద కన్నేసి ఏదో ఒక మార్గాన వాటిపై వచ్చే స్వల్పకాలిక – దీర్ఘకాలిక ఆదాయాలనూ, వీలయితే ఆ సంస్థలనూ సొంతం చేసుకోవాలని తహతహలాడే బడా ప్రైవేట్ కార్పొరేట్ శక్తులే ఈ వాదనలు ముందుకు తెస్తున్నాయనేది వేరుగా చెప్పనక్కరలేదు.

### ప్రైవేటు కార్పొరేట్ శక్తుల జోక్యం

ఈ ప్రక్రియలో ప్రైవేటు కార్పొరేట్ శక్తుల జోక్యం ఈ మధ్యకాలంలో మరీ మితిమీరుతోంది. అనేక ప్రభుత్వరంగ సంస్థలు పెట్టుబడి చోదిత (కాపిటల్ ఇంటెన్సివ్) సంస్థలుగా ఉన్నాయి. ఈ సంస్థలకు ఉండే సానుకూల అంశం ఏమిటంటే ఇవి ఆర్థిక వ్యవస్థలో ఇతరేతర అంశాలనూ, పార్శ్వాలనూ ఆర్థిక కోణంలో ప్రభావితం చేస్తాయి. అందుకే ఆర్థికాభివృద్ధి కారణాలరీత్యా ఈ సంస్థల ఉత్పత్తుల అమ్మకం ధరల మీద పూర్తి నియంత్రణగానీ, పాక్షిక నియంత్రణలుగానీ ఉంటూ వచ్చాయి.

అందుకే ప్రైవేటు పెట్టుబడిదారులు ఈ రంగాల జోలికి వచ్చేవారు కాదు. ఈ రంగాల్లో పెట్టుబడులు పెట్టడం లాభదాయకం కాదు, పైగా రిస్క్ కూడా ఎక్కువ అని భావించేవారు. దీనితో అనివార్యంగా ప్రభుత్వమే ఈ రంగాలకు పెట్టుబడులు సమకూర్చేది. అలాంటి రంగాలలో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలలో వాటాలు కొనుక్కోవడానికి ఇవాళ ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలు, ప్రైవేటు పెట్టుబడిదారులు ఎగబడుతున్నారంటే దీనివెనుక ఏదో మర్మం దాగి ఉందనిపించడం లేదూ!

### ప్రైవేటు రంగం అత్యుత్సాహానికి కారణాలేమిటి?

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 67 ఏళ్ళు గడిచిన ఈ సుదీర్ఘకాలంలో భారత వాణిజ్య–వ్యాపార వర్గాలు ఇవాళ భారీ పెట్టుబడులను సమకూర్చడానికి, నిర్వహించడానికి తగిన శక్తి సంతరించుకున్నాయని భావిస్తున్నాయి. అందుకే ఇన్నేళ్ళుగా వేలుపెట్టని రంగాల్లోకి ఏకంగా కాళ్ళుదూర్చేస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం ఏంటంటే నయా–ఉదారవాద సంస్కరణల పుణ్యమా అని కంట్రోళ్ళు ఎత్తివెయ్యడం, ధరల నియంత్రణను నీరుకార్చడం, ప్రైవేటు పెట్టుబడులమీద ఆంక్షలు ఎత్తివేయడంతో ఈ రంగాలమీద ఇక సర్కారు పెత్తనం ఏమీ ఉండబోదనే అంచనాకు వచ్చాయి. ధరలను ఇష్టారాజ్యంగా పెంచుకొని మీదుమిక్కిలి లాభాలు పోగేసుకోవచ్చనే ఆశబోతుతనం పెరిగిపోయింది. అందుకే ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలు కొన్ని ఇప్పటిదాకా ప్రభుత్వరంగ సంస్థలకు పరిమితమైన రంగాలలో తామూ కంపెనీలు పెడుతుంటే, మరికొన్ని కంపెనీలు అమ్మకానికి పెట్టిన ప్రభుత్వరంగ సంస్థల వాటాలు కొనుక్కొని ఆయా రంగాల్లో ప్రవేశానికి ప్రణాళికలు వేసుకుంటున్నాయి. అనువు కాదనుకుంటే తిరిగి ఈ కొనుగోలు చేసిన వాటాలను వేరే ప్రైవేటు కంపెనీలకు అమ్ముకోవటానికి వెసులుబాటు ఎలానూ ఉండనే ఉంది. కేవలం లాభాపేక్ష తప్ప ప్రైవేటురంగ అత్యుత్సాహం వెనుక ప్రజా ప్రయోజనాలుగానీ, జాతిహితంగానీ లేనే లేవు.

ఈ అవకాశాలు, స్వీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలు, వాటికనుసన్నల్లో నడిచే మీడియా కలిసి సర్కారు తలపెట్టిన ప్రభుత్వరంగ సంస్థల పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియకు వంతపాడుతూ జనామోదాన్ని సృష్టించేందుకు రకరకాల వాదనలు ముందుకు తెస్తున్నాయి.

**❝ ఈ పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియలోనే అనేక లోపాలున్నాయి. బాగా లాభాలు వచ్చే ప్రభుత్వ రంగ కంపెనీల్లో, బాగా లాభాలు వస్తాయనుకునే ప్రభుత్వరంగ కంపెనీల వాటాలను అమ్మకానికి పెడితే తప్ప పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ విజయవంతం కాదు. అలాంటి కంపెనీలు ఉన్నదే తక్కువ. కాబట్టి ద్రవ్యలోటు పూడ్చుకునే పేరిట ఇతర మార్గాలను పరిశీలించకుండా ఇలా లాభదాయక కంపెనీల వాటాలు ఎంతకాలం అమ్ముతూ పోగలదు ఏ సర్కారయినా? ❞**

అయితే ఇవన్నీ పసలేని వాదనలనీ, ద్రవ్యలోటు తగ్గించుకోవటానికి అనే పేరుమీద తలపెట్టిన ఈ ప్రభుత్వ రంగ సంస్థల వాటాల అమ్మకం వల్ల వడ్డీ భారం తగ్గడంగానీ, రుణ భారం పెరగకుండా ఉండడంగానీ, జరగకపోగా ఇప్పటిదాకా 'డివిడెండ్ల' రూపంలో సర్కారు ఖజానాకు సమకూరుతున్న ఆదాయాన్ని కోల్పోవలసి వస్తుందనీ ఇంతకుముందే చెప్పుకున్నాం. అందుకే ద్రవ్యలోటు, ద్రవ్య క్రమశిక్షణ వంటి సమస్యలకు ప్రైవేటీకరణ పరిష్కారం కానేకాదు. కానీ ప్రైవేటీకరణను సమర్థించడానికి ప్రభుత్వరంగ సంస్థల యాజమాన్యాలు అసమర్థమైనవనీ, అవినీతి మయమైనవనీ, లాభాలు తీసి చూపించడం చేతగానివనీ, అసలు ఇవన్నీ కాదు ప్రభుత్వం వ్యాపారాన్ని వ్యాపకంగా పెట్టుకోవడం ఏమిటనే దబాయింపు వాదనలకు దిగుతున్నారు.

కానీ సమర్థ ప్రభుత్వ నిర్వహణ కోసం ఈ కార్పొరేట్ శక్తులు ముందుకు తెస్తున్న వాదనలే లోపభూయిష్టమైనవి. అవినీతికి అవాలమైనవని మనం గుర్తించాలి. 'ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించడానికి, వాటిని దువ్వడానికి ప్రభుత్వం పన్నుల విధింపుపట్ల నిగ్రహం పాటించాలని' ఏ సిద్ధాంతం అయితే ఈ కార్పొరేట్ శక్తులు ముందుకు తెస్తున్నాయో ఆ 'నిగ్రహం'మూలంగానే ప్రభుత్వం ద్రవ్యలోటును నిభాయించలేక పోతున్నదని సర్కారీ గణాంకాలే మనకు తెలియ చేస్తున్నాయి. ఈ వాదన ప్రక్కనబెడితే కార్పొరేట్ శక్తులు వాదించినట్లే అన్ని పనులూ ప్రభుత్వం చెయ్య లేనట్లే అనేక రంగాలకు నిధులు కేటాయించవలసి వచ్చినప్పుడు తగిన ఆదాయాలు లేని పరిస్థితుల్లో ఏ ప్రభుత్వమైనా ద్రవ్యలోటు కలిగి ఉండడం, అప్పులు తేవడం, అత్యంత సహజమైన అంశాలు అని కూడా మనం గమనించాలి. అలాగాక ప్రభుత్వ రుణాలమీద 'నిగ్రహం' పాటించాలనే కార్పొరేట్ శక్తుల వాదనను ఆమోదిస్తే ప్రభుత్వ రంగ సంస్థల వాటాల అమ్మకం అనివార్యంగా కనిపిస్తుంది. కాని ఇక్కడ ఓ వైరుధ్యం మనకు కనబడుతుంది. పన్నుల ఆదాయాలు, డివిడెంట్ల ఆదాయాల మాదిరి పెట్టుబడుల ఉపసంహరణ వల్ల వచ్చే ఆదాయాలూ నిరంతరమైనవి కావు. ఒకసారి వాటాలు అమ్మకం వేస్తే తిరిగి కొనుక్కొనే వీలు లేదు. కాబట్టి ఏ మేరకు ప్రభుత్వరంగ సంస్థల వాటాలు అమ్మకం పెడతారో ఆ మేరకు వాటి మీద వచ్చే డివిడెంట్లు తదితర రూపాల ఆదాయాలను సర్కారు కోల్పోవాల్సిదే. దీనివల్ల ద్రవ్యలోటు ఒక ఏడాదికి తగ్గినట్లు కనిపించినా తరువాతి తరువాతి ఏడాదుల్లో పెరగడం ఖాయం.

అంతేకాదు అసలు ఈ పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియలోనే అనేక లోటుపాట్లు ఉన్నాయి. బాగా లాభాలు వచ్చే ప్రభుత్వ రంగ కంపెనీలలో, బాగా లాభాలు వస్తాయనుకునే ప్రభుత్వరంగ కంపెనీల వాటాలను అమ్మకానికి పెడితే తప్ప పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ విజయవంతం కాదు. అలాంటి కంపెనీలు ఉన్నదే తక్కువ. కాబట్టి ద్రవ్యలోటు పూడ్చుకునే పేరిట ఇతర మార్గాలను పరిశీలించకుండా ఇలా లాభదాయక కంపెనీల వాటాలు ఎంత కాలం అమ్ముతూ పోగలదు ఏ సర్కారయినా? దశలవారీగా ఇలా అమ్ముకుంటూ పోతే సర్కారు వాటాల శాతం మైనార్టీకి పడిపోవా. పన్నులు, డివిడెండ్ల రూపంలో ఏటా ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూర్చిపెట్టే ఆస్తులు హరించుకుపోవా? ఆ తర్వాత పరిస్థితి ఏమిటి? చెప్పటానికి 'పెట్టుబడుల ఉపసంహరణ' అని మొదలు పెట్టినా అంతిమంగా ఇది ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకే గదా దారితీసేది.

పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను మార్కెట్ మార్గాన చేబడితే పైన చెప్పుకున్న పర్యవసానాలను, ఫలితాలను చవిచూడడానికి ఎంతోకాలం పట్టదు. నిధుల సమీకరణ, వాటాల ఉపసంహరణ అనేది ఆయా సంస్థల 'నిజ విలువ' మీద ఆధారపడి జరగాలి కానీ, మార్కెట్ సెంటిమెంట్‌మీద, మార్కెట్ ధరలమీద ఆధారపడి జరగకూడదు. ఇవాళ స్టాక్ మార్కెట్లు వెలిగిపోతూ ఉండొచ్చు. కాని 'ఫండమెంటల్స్' మాత్రం మార్కెట్లో నెలకొన్న ఈ 'బూమ్'ని ఏదో ఒక రోజున దెబ్బతీస్తాయి. ఆ రోజున షేర్ల ధరలు కుప్పకూలిపోవడం ఖాయం. ఇవన్నీ దృష్టిలో ఉంచుకొనే పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియలో వివిధ ప్రభుత్వరంగ సంస్థల వాటాలను ఒక ముద్దగా చేసి మరీ అమ్మేలా ప్రభుత్వం మీద మార్కెట్ శక్తులు ప్రభావం చూపిస్తాయి. మార్కెట్‌మీద ఆధారపడి భారీగా ఆదాయాలు సమకూర్చుకోవాలంటే ప్రభుత్వరంగ సంస్థల వాటాలను భారీగానే అమ్ముకోవాల్సి వస్తుంది. తద్వారా ప్రజల ఆస్తులైన ప్రభుత్వరంగ సంస్థల ఆస్తులు ఇట్టే కరిగిపోతాయి.

మార్కెట్లో పరిస్థితులు ప్రతికూలంగా ఉంటే ప్రభుత్వం మరో మార్గాన్ని ఎంచుకుంటుంది. వ్యూహాత్మక భాగస్వామ్యం పేరిట 26 శాతం వాటాలు కట్టబెట్టి యాజమాన్య నిర్వహణ కూడా ప్రైవేటు కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెడుతుంది. అయినా కార్పొరేట్ శక్తులు ఈ 'ఆఫర్'వైపు అంతగా మొగ్గుచూపవు. కారణం ఏంటంటే ఇందులో తను ప్రధాన షేర్ హోల్డర్ కావడానికి చిన్న వాళ్ళనుండి షేర్లు కొనాల్సి వస్తే వాళ్ళకి కూడా 26% వాటాలు కొనడానికి ప్రభుత్వానికి ఏ ధర చెల్లిస్తే ఆ ధరే చెల్లించాల్సి వస్తుంది. అందుకే కార్పొరేట్ వర్గాలను ఈ వ్యూహాత్మక భాగస్వామ్య ప్రక్రియలో భాగస్వాములుగా చెయ్యాలంటే ప్రభుత్వం షేరు ధరని తగ్గించి అమ్మాలి.

కాబట్టి ఎలా చూసినా పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ ప్రభుత్వ ద్రవ్యలోటు కష్టాలను తీర్చలేకపోగా ప్రభుత్వ ఆస్తులను ఉదారంగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టి వారిని మరింత సంపన్నులుగా చేయడానికి మాత్రమే ఉపకరిస్తుందని స్పష్టమైపోతుంది. నయా-ఉదారవాద సంస్కరణల సారమూ, తత్వమూ రెండూ కూడా ఉన్నవాళ్ళని మరింత ఉన్నవాళ్ళుగా చెయ్యడానికే తప్ప జాతి జనాన్ని ఉద్ధరించడానికి పనికి వచ్చేవి కాదు. మోడీ సర్కారు కార్పొరేట్ శక్తుల ఆకాంక్షలకు అనుగుణంగా, గాలివాటున వారి సంపద మరింత పెరిగేందుకు వీలుగా నయా-ఉదారవాద విధానాలను వేగంగా ముందుకు తీసుకువెళ్ళేదానికి ప్రయత్నిస్తోంది. దీనివల్ల అంతో ఇంతో గౌరవప్రదమైన జీవితాన్ని గడుపుతున్న ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే కార్మిక కుటుంబాలను ఇబ్బందుల్లోకి నెట్టడంతోపాటు, ప్రజాధనాన్నీ, ప్రభుత్వ ఆస్తులనూ ఉదారంగా నయా-సంపన్న వర్గాలకు దోచిపెడుతుంది మోడీ సర్కారు.

**(అనువాదం : సత్యరంజన్ .కె)**

**ఇంటర్వ్యూ**



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
పొలిట్‌బ్యూరో సభ్యులు

# ప్రభుత్వ రంగాన్ని వాపయోగించుకొని లాభపడింది ప్రైవేటు పెట్టుబడిదారులే

**– సీతారాం ఏచూరితో ఇంటర్వ్యూ**

***ప్రశ్న:*** 1990 నుండి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టుబడులు ఉపసంహరించిన దానికన్నా చాలా వేగవంతంగా నరేంద్రమోడీ సారథ్యంలోని బి.జె.పి. ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. దీనివల్ల దేశంలో మళ్లీ ప్రభుత్వ రంగ సంస్థల వాటాల అమ్మకంపై చర్చ ఊపందుకుంది. ఈ ప్రక్రియను వామపక్షాలు వ్యతిరేకిస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. కానీ మీ వాదనను అనేక మంది ప్రశ్నిస్తున్నారు. ఆర్థిక, వాణిజ్య మంత్రిత్వ శాఖకు చెందిన మంత్రులు, ప్రైవేటు పెట్టుబడిదారులు ఈ ఆలోచనలను గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు అనేవి కాలం చెల్లిన సిద్ధాంతాలనీ, సోషలిజం, ట్రేడ్ యూనియన్ సిద్ధాంతాలు మూసవాదనలనీ వారి వాదన. గతంలో ప్రభుత్వ రంగ వాటాల అమ్మకాలను వ్యతిరేకించిన వారు కూడా నేడు ఈ వాదనలను బలపరుస్తున్నారు. దీనికి మీరేమంటారు?

***ఏచూరి:*** ముందుగా మనం అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే, భారతదేశంలో ప్రభుత్వ రంగం అనేది కేవలం స్వాతంత్ర్య పోరాటం, వామపక్షాలు లేదా ట్రేడ్ యూనియన్ పోరాటాలు వలనే రాలేదు. దాని ఆవిర్భావం వెనుక ఈ దేశ ప్రైవేటు పెట్టుబడిదారుల పాత్ర కూడా చాలా ఉంది. అసలు దేశంలో ప్రభుత్వ రంగాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలలో కీలకమైనది "బాంబే ప్లాన్". దేశంలో ఆనాటికే ఉన్న ముఖ్యమైన కార్పోరేట్ రంగం ఈ ప్లానును తయారు చేసింది. వీరిలో టాటాలు, బిర్లాలు ఉన్నారు. ప్రభుత్వమే ప్రజల దగ్గర ఉన్న డబ్బును సేకరించి మౌలిక రంగాలకి కావాల్సిన పెట్టుబడి పెట్టాలని వారు సూచించారు. అన్ని రంగాలలో మౌలిక వసతులను ప్రభుత్వమే కల్పించాలనీ, ఉక్కు, ఇనుము రంగాలలో కూడా పెట్టాలనీ ఈ ప్లాన్‌లో సూచించారు. ఇంత పెట్టుబడి పెట్టడానికి ఆ రోజుల్లో ప్రైవేటు పెట్టుబడిదారుల దగ్గర పెట్టుబడి లేదు. అందువల్లనే భారతదేశంలో ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటు అనేది ప్రైవేటు పెట్టుబడిదారుల ప్రతిపాదనలతో వచ్చిందే తప్ప, వేరొకటి కాదు. అంతేకాదు ఈ ప్లాన్‌ద్వారా ప్రైవేటు పెట్టుబడిదారుల పరిమితులు కూడా బట్టబయలు చేయడం జరిగింది.

అందువలన భారతదేశ ఆర్థిక వ్యవస్థ పునాదులు ప్రభుత్వ రంగ సంస్థల ఆధారంగా ఉండాలన్నది ఈ దేశపు ప్రైవేటు పెట్టుబడిదారులే అనేది స్పష్టం. ఆ రకంగా ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు రంగానికి కావాల్సిన అన్ని రకాల ముడి సరుకులను అందించటం ద్వారా వారి ఉత్పత్తి ప్రక్రియకు ఎంతగానో దోహదపడ్డాయి. అందువలన మనం గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే, ప్రభుత్వ రంగ సంస్థల నుండి పెద్ద ఎత్తున లాభపడింది ఈ దేశపు ప్రైవేటు పెట్టుబడిదారులే. కనుక ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటు అనేది కార్మికవర్గ హక్కులను కాపాడుకోవటం, సోషలిస్టు భావజాలం ప్రభావాల వల్ల ఏర్పాటు చేయబడ్డాయి అని చెప్పడమంటే అది చరిత్రను వక్రీకరించటమే తప్ప మరొకటి కాదు. వారికి అవసరమయినప్పుడు దేశీయ ప్రైవేటు పెట్టుబడిదారులు ప్రభుత్వ రంగ సంస్థల వాదనను, సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారు. బలంగా సమర్ధించారు. ఈ రోజు వారి భవిష్యత్తు, లాభాలు, ఆదాయాల విస్తరీకరణ జరగాలంటే విదేశీ పెట్టుబడులపై ఆధారపడాలి కాబట్టి, మరీ ముఖ్యంగా విదేశీ ద్రవ్య పెట్టుబడితో మిలాకత్ అవ్వాలంటే, పెట్టుబడి రావాలంటే ప్రభుత్వరంగ సంస్థలను ఖాళీ చేయాలని భావిస్తున్నారు. ఇక మా వామపక్షాల అభిమతం ఒక్కటే, మేము ప్రభుత్వ రంగాన్ని సమర్ధిస్తున్నాము. ఎందుకంటే అది విదేశీ పెట్టుబడిపై ఆధారపడే పరిస్థితినిభారతదేశానికి తప్పిస్తుంది, రెండవది, దాని వల్ల దేశ ఆర్థిక స్వావలంబనకూ, స్వతంత్రతకూ అది ఎంతగానో ఉపయోగపడుతుంది.

***ప్రశ్న:*** నష్టాలలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలలో వాటాలు అమ్మటానికి ఎటువంటి వ్యతిరేకత ఉండాల్సిన అవసరం లేదు అని ఒక వాదన. వామపక్షాలు మొత్తం వాటాల అమ్మకానికి వ్యతిరేకమా? లేక లాభాలు ఉన్న సంస్థలలో వాటాలు అమ్మకానికే వ్యతిరేకమా ?

***ఏచూరి:*** మేము నష్టాలలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు, లాభాలలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు అనే విభజనను అంగీకరించం. అయితే ప్రభుత్వ రంగ సంస్థలు నష్టాలలో నడవాలని మా ఉద్దేశం కాదు. మొట్టమొదట పెట్టుబడుల ఉపసంహరణ పాలసీ వచ్చిన నాటి నుండి యు.పి.ఏ-1, యు.పి.ఏ-2 ప్రభుత్వాలలోనూ, ఇంకా అంతకు ముందున్న ఎన్.డి.ఏ హయాంలో కూడా మేము ఒకే మాటకు కట్టుబడి ఉన్నాము. అసలు ప్రభుత్వ రంగ సంస్థలలో నష్టాలు ఎందుకు వస్తున్నాయి? వాటిని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి.

నష్టాలు రావటానికి గల కారణాలు వెతకాలి? వాటిని కనుగొని మళ్లీ లాభాలలోకి తెచ్చే విధంగా మార్చలేమా? అధ్యయనం చేయాలి. ఇవన్నీ జరిగిన తరువాతనే, తప్పనిసరి పరిస్థితులు ఉంటే పెట్టుబడుల ఉపసంహరణ జరగాలి. కానీ ఇప్పటి వరకు ఈ ప్రక్రియ జరగనే లేదు. అది జరిగి ఉంటే చాలా మార్పులు మనం గమనించగలిగేవాళ్ళం.

మీకు ఉదాహరణకి విశాఖపట్నంలోని హిందుస్తాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ గురించి చెబుతాను. ఇది గతంలో నష్టాలలో నడిచేది. తూర్పు నౌకాదళ కేంద్రంగా ఉండటం వలన ఎట్టి పరిస్థితులలోనూ దానిని ప్రైవేటు వారికి ఇచ్చే ప్రసక్తి లేదు. అందువలన హెచ్.ఎస్.ఎల్‌ను రక్షణ శాఖ తన ఆధీనంలోకి తీసుకోవాలని మేము కోరాము. పడవల నిర్మాణ రంగంలో ప్రైవేటు వారిని ప్రోత్సహించటం వలన హెచ్.ఎస్.ఎల్‌కి ఆర్డర్లు రావటం లేదు. కాని అది ఒక సారి రక్షణ శాఖ ఆధీనంలోకి వెళ్ళిన తరువాత ఆర్డర్లు రావటం మొదలయ్యింది.

దీనితోపాటుగా, అదనంగా ఆ రంగానికి సంబంధించిన ఇతర ప్రభుత్వ రంగ సంస్థలతో అనుసంధానం చేయాలని మేము డిమాండ్ చేశాము. యు.పి.ఏ-1 ప్రభుత్వంలో ఇది అమలు జరిగింది. హెచ్.ఎస్.ఎల్ లాభాలలోకి వచ్చేసింది. మనం కనుక జాగ్రత్తగా పరిశీలనచేసి మార్పులు తీసుకువస్తే ప్రభుత్వ రంగ సంస్థలన్నీ నష్టాల నుంచి లాభాలలోకి రావటం కష్టమేమి కాదని పైన చెప్పిన ఉదాహరణ చెబుతోంది. అసలు పూర్తిగా భ్రష్టుపట్టిపోయిన ప్రభుత్వ రంగ సంస్థలలో కూడా, సృజనాత్మక ఆలోచనలతో, పట్టుదలతో కృషి చేస్తే వాటిని కూడా మార్చవచ్చని మనకి కేరళలో జరిగిన అద్భుత ఉదాహరణలు కనిపిస్తాయి. కేరళలోని వామపక్ష ప్రభుత్వం ఆధ్వర్యంలో దాదాపు 15 పి.ఎస్.యులు నష్టాల నుండి లాభాలలోకి తీసుకువచ్చి సరికొత్త రికార్డును సృష్టించింది.

*ప్రశ్న:* పెట్టుబడుల ఉపసంహరణ వాదానికి గట్టిగా మద్దతిచ్చే మేధావులు చెప్పేది ఏమిటంటే ముఖ్యమైన ప్రాజెక్టులకు కావాల్సిన పెట్టుబడుల సమీకరణకు ఇది చాలా ఉపయోగమని. బహుశా అందువలననేమో 1990 నుండి ఇప్పటి వరకు ఉపసంహరణ మీద ఉన్న సీలింగ్ పరిమితి కూడా నిదానంగా పెరుగుతూ వచ్చింది. ఎంతోమంది ఆర్థిక నిపుణులు, విధాన నిర్ణేతలు, మేధావులు దీనిని సమర్థిస్తున్నప్పుడు వామపక్షాలు దీనిని ఎందుకు వ్యతిరేకిస్తున్నాయి?

***ఏచూరి:*** అసలు ఈ వాదనకు ఎటువంటి పసలేదు. ఎందుకంటే నువ్వు అమ్ముతున్న ఆస్తులతో పెట్టుబడుల సమీకరించాలనేదే ప్రధాన లక్ష్యం. కాని ఇప్పటివరకు జరిగిన అనుభవాన్ని గమనిస్తే మొత్తం పెట్టుబడుల ఉపసంహరణ వలన వచ్చిన దానిలో ఒక్క రూపాయి కూడా పెట్టుబడిగా గానీ, లేదా సామాజిక కార్యక్రమాలలోగానీ వినియోగించలేదు. సేకరించిన ఈ మొత్తం పెట్టుబడి, తక్షణ ప్రభుత్వ అవసరాలకు వాడుకున్నారే తప్ప, మరేమీ చేయలేదు. ఇప్పటి వరకు అధికారికంగా జరిగింది అది. కాని వచ్చిన ప్రతి ప్రభుత్వం తాము దీనిని మారుస్తామని ప్రకటిస్తారు కాని, ఎవరూ ఆచరించి చూపలేదు.

*ప్రశ్న:* అయినా ఇప్పటికీ వీటిని వ్యతిరేకించే గొంతులు మూగపోయాయి. గతంలో వీటిని వ్యతిరేకించిన భారతీయ మజ్దూర్ సంఘ్ కూడా నేడు మౌనం దాల్చింది. మీరేమంటారు ?

***ఏచూరి:*** నాకు తెలిసినంత వరకు ఈ పరిస్థితి ఎక్కువ కాలం ఉండదు. సమాజంలోనూ, అలాగే కొన్ని సంఘాలలోనూ ఈ విషయాలపై అంతర్మథనం జరుగుతోంది. దాని పరిణామాలు నేడో, రేపో బయటపడే అవకాశాలు ఉన్నాయి. ఇంకొక అంశమేమిటంటే, మొత్తం ప్రభుత్వం అంతా ఇవాళ ప్రధానమంత్రి కార్యాలయం కేంద్రంగా పని చేస్తోందని అనిపిస్తోంది. దీని వల్ల కూడా భిన్నమైన అంశాలు, వాదనలు ఆయా శాఖల నుండి వచ్చే అవకాశాలు కుదించుకుపోయాయి. వివిధ మంత్రిత్వ శాఖలలో ఉన్న అంశాలపై, సమస్యలపై కొద్దిమేరకైనా స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి గతంలో ఉండేది. ఇప్పుడు అది కూడా కనిపించడం లేదు. కాకపోతే ప్రభుత్వంలోని రాజకీయ నాయకులు మాత్రం... ఈ విషయంలో అప్పుడే ఒక నిర్ధారణకు రావడం సరికాదనీ, వేచి చూడాలనీ సెలవిచ్చారు. మనం కూడా ఈ పరిస్థితిని జాగ్రత్తగా గమనిస్తూ ఉందాము.

ఈ ప్రభుత్వ ప్రత్యేక లక్షణం ఇంకొకటుంది. అది పత్రికలలో కూడా వచ్చింది. కేంద్రంలో ఏర్పడిన ప్రభుత్వంలోని మంత్రుల ప్రమాణ స్వీకారం అయిన తరువాత రాష్ట్రపతి భవనం నుండి వచ్చిన ప్రకటనలో ఒక ప్రత్యేకమైన వాక్యంలో, ప్రధానమంత్రి మాత్రమే అన్ని విధానాల రూపకల్పనకు బాధ్యుడుగా ఉంటాడని పేర్కొంది. గత కొన్ని దశాబ్దాలుగా నేను చూసిన ప్రభుత్వాలు వేటిలోనూ ఇటువంటి పరిస్థితి ఎన్నడూ లేదు. ఇతరులకు కేటాయించని శాఖలు, లేదా విభాగములకు మాత్రమే ప్రధానమంత్రి బాధ్యత వహించటం సాధారణంగా జరుగుతూ వస్తోంది. ఇదంతా దేనిని సూచిస్తోందంటే ఒక కొత్త విధాన ప్రక్రియతో గతంలో వివిధ అంశాలపై ఉన్న క్యాబినేట్ కమిటీలు, ఉదాహరణకి రాజకీయ అంశాల క్యాబినేట్ కమిటీ, ఆర్థిక అంశాలపై ఉన్న క్యాబినేట్ కమిటి, రక్షణ అంశాలపై ఉన్న క్యాబినేట్ కమిటీ వంటి వాటన్నిటినీ తోసిరాజనే వ్యవస్థ రాబోవుతున్నది.

*ప్రశ్న:* పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ ప్రారంభమైన తరువాత పెట్టుబడుల సమీకరణకూ, సామాజిక రంగంలో పెట్టే పెట్టుబడులకూ మధ్య సమతుల్యం పాటించాలనే చర్చ కూడా పెరిగింది. పెట్టుబడుల ఉపసంహరణ సిద్ధాంతం ముందుకు తీసుకుపోవటానికి కూడా ఈ ప్రచారం ఉపయోగించబడింది. వీటన్నిటికీ ప్రత్యామ్నాయంగా ప్రపంచ అనుభవాలలో ఏదన్నా విధాన ప్రక్రియ మీరు చెప్పగలరా?

***ఏచూరి:*** దక్షిణ అమెరికా ఖండంలో జరుగుతున్న పరిణామాలన్నీ మనకు కనిపించే స్పష్టమైన ప్రత్యామ్నాయ విధానాలు. అవి పూర్తిగా మన దేశంలో జరిగే వాదనలకు భిన్నంగా వున్నాయి. వెనుజులా, బొలీవియా, ఈక్వెడార్ వంటి దేశాలు తమ సహజవనరులను జాతీయం చేశాయి. చమురు సంపదను కూడా జాతీయం చేశాయి. ఈ విధంగా ప్రకృతి సహజ వనరులనూ, సంపదనూ జాతీయం చేసి వాటి నుండి వచ్చిన లాభాలను ఇవాళ ఆయా దేశాలలో భూ సంస్కరణల అమలుకు, విద్య, వైద్యం, మొత్తంగా సమాజాల అభివృద్ధికి వినియోగిస్తున్న పరిస్థితి మనకి కనిపిస్తోంది. దీని ఫలితంగా సామాజికంగా అద్భుతమైన పురోగతిని కూడా ఆ దేశాలలో సాధించారు.

దీనికి పూర్తిగా విరుద్ధమైన అనుభవాన్ని మనకి మాజీ సోవియట్ యూనియన్ అందిస్తోంది. రష్యానే ఉదాహరణకి తీసుకుంటే అక్కడ పెద్ద ఎత్తున ఉన్న సహజ వనరులు, చమురుతో సహా అన్నిటినీ ప్రైవేటు వారికి అప్పచెప్పారు. ఈ విధానం వలన ప్రైవేటు రంగంలో వచ్చిన లాభాలు/ ఆదాయాలలో ఒక్క శాతం కూడా దేశ అభివృద్ధికి మరల్చిన పరిస్థితి లేదు. ఆ దేశ ఆర్థిక, సామాజిక వ్యవస్థలను అభివృద్ధి చేయటానికి కూడా అవి పని చేయలేదు. అందువల్ల చరిత్ర గమనించినా, సమకాలీన ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలను గమనించినా మనకు అర్థమయ్యేది ఒక్కటే, ప్రభుత్వం నుండి ప్రైవేటు రంగానికి బదిలీ చేయబడిన పెట్టుబడులు ప్రయివేటు రంగాన్ని మరింత బలోపేతం చేస్తాయే తప్ప వెనక్కి తిరిగి వచ్చే ప్రసక్తే లేదు. ఎక్కడన్నా పొరపాటున వచ్చినా అది పిల్లికి బిచ్చమేసినట్లుగా చూపించుకోవటానికేనని అర్థం చేసుకోవాలి.

**(ఫ్రంట్‌లైన్ నుండి అనువాదం: ఎల్.ఎస్.భారవి)**

సామాజికాంశం

# పెరుగుతున్న సామాజిక ప్రతీఘాత విప్లవ ప్రమాదం



రచయిత ప్రఖ్యాత మార్క్సిస్టు ఆర్థిక వేత్త

ప్రభాత్ పట్నాయక్

**(సెప్టెంబరులో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్‌ఆఫ్ దళిత్ స్టడీస్‌లో ప్రభాత్ పట్నాయక్ చేసిన అబేద్కర్ స్మారకోపన్యాసం)**

**1949** నవంబరు 25న రాజ్యాంగ సభ (కాన్‌స్టిట్యూట్ అసెంబ్లీ) ముగింపు సమావేశంలో అంబేద్కర్ చేసిన ప్రసంగంలోని ఒక ముఖ్య అంశంపై చర్చించటానికి ఈ అవకాశాన్ని నేను వినియోగించుకొంటాను.

ఆధునిక భారత సమాజంలో ముందుకొస్తున్న ఒక ప్రధాన వైరుధ్యంపై అంబేద్కర్ ఆ ప్రసంగంలో చర్చించారు: ఆయన రాజ్యాంగ సభకు సమర్పించిన రాజ్యాగ ముసాయిదాలో (ఆ తర్వాత ఆమోదించబడింది) సార్వత్రిక వయోజన ఓటింగ్ హక్కు, చట్టంముందు సమానత్వం, ప్రాథమిక హక్కులు గల ప్రజాస్వామ్యం కావాలన్నారు. ఆ విధంగా ఆయన సమానత్వంతో కూడిన సోదరసమాజం వుండాలన్నాడు. కానీ ఈ భావనకు అనుగుణంగా రూపుదిద్దుకునే రాజకీయ వ్యవస్థ అసమానతలతో కూడిన కులవ్యవస్థ పునాదిగా వున్న సమాజం నుండి వచ్చింది. కాబట్టి అసమానతలతో వున్న ఆర్థిక, సామాజిక నిర్మాణంపై రాజకీయ సమానత్వాన్ని పైనుండి రుద్దటం జరిగింది. ప్రజాస్వామ్య విధానం కొనసాగటం అనేది సమాజంలోని అన్ని రంగాలలోనూ సమానత్వం, సహోదరభావం నెలకొల్పటంపై ఆధారపడి వుంటుందని అంబేద్కర్ నొక్కిచెప్పాడు. ఇందుకు రాజకీయ రంగంలో నెలకొన్న సమానత్వం సమాజంలోని అన్ని రంగాలలోకీ విస్తరించటం అవసరం.

వేల సంవత్సరాలుగా వ్యవస్థాగతంగా కులవ్యవస్థ పాతుకుపోయి,సామాజిక అసమానతలు నెలకొన్న భారతదేశం రాజకీయ సమానత్వాన్ని ప్రకటిస్తూ రాజ్యాంగాన్ని ఆమోదించటం చారిత్రక ప్రాధాన్యత కలిగిన అంశం.పంధొమ్మిదవ శతాబ్దం చివరిలోనూ, ఇరవయ్యవ శతాబ్దం ప్రారంభంలోనూ దేశాన్ని ఊపేసిన రెండు గొప్ప వుద్యమాలు ఈ ముందడుగు వేయటానికి దారితీశాయని నేను భావిస్తున్నాను. ఒక వైపున పూలే, పెరియార్, శ్రీనారాయణగురు, అంబేద్కర్‌ల నాయకత్వాన సాగిన సామాజిక విముక్తి వుద్యమాలు,మరోవైపు వలస విధానానికి వ్యతిరేకంగా వివిధ ప్రవాహాలుగా సాగిన వుద్యమాలు ఇందుకు దారితీశాయి.

ఈ రెండు వుద్యమాలు ఒకదానికి మరొక దానికి సంబంధంలేకుండా జరిగాయని, ఒకదానికి వ్యతిరేకంగా మరొకటి జరిగాయని కూడా కొందరు భావిస్తున్నారు.కానీ ఈరెండు వుద్యమాలు ఒకదాన్ని మరొకటి బలపరిచాయని నేను భావిస్తున్నాను.అంబేద్కర్ మాటల్లో చెప్పాలంటే సామాజిక విముక్తి కోసం జరిగిన వుద్యమం సామాజికంగా అణచబడ్డ తరగతుల్లో తమ ఆత్మగౌరవాన్ని చాటుకోవాలనే ఆకాంక్షను పెంచింది. వలస వ్యతిరేకపోరాటంలో పాల్గొనటం ఆఆకాంక్షను వ్యక్తంచేసే మార్గంగా భావించారు.మరోవైపు 1931లో కరాచీ కాంగ్రెస్ మహాసభ తీర్మానంలో వ్యక్తం చేసినట్లుగా నూతన భారతదేశంలోప్రజలందరు సమాన హక్కులు కలిగి వుంటారని చెప్పకపోయినట్లయితే వలస వ్యతిరేక పోరాటం వుధృతిని సంతరించుకొని వుండేది కాదు.

ఈ రెండు వుద్యమాలు భారతదేశంలో సుదీర్ఘ విప్లవానికి దారితీసి, ప్రజలందరికి సమానహక్కులు ఇచ్చిన రాజ్యాంగాన్ని ఆమోదించటానికి దారితీశాయి.కాని దీనిలో వున్న వైరుధ్యాల వలన క్రింద పేర్కొంటున్న రెండం శాలలో ఏదో ఒకటి జరగటానికి దారితీస్తుంది.అంబేద్కర్ భావించినట్లుగా ఆర్థిక, సామాజిక అసమానతలు క్రమంగా తగ్గుతూ, రాజకీయరంగంలో సాధించిన సమానత్వాన్ని ఇతర రంగాలకు విస్తరింపచేయటంద్వారా సుదీర్ఘ విప్లవాన్ని ముందుకు తీసుకువెళ్ళవచ్చు.లేదా ఆర్థిక,సామాజిక అసమానతలు అలాగే కొనసాగుతూ, మరింత తీవ్రమౌతూ రాజకీయరంగంలో నెలకొన్న సమానత్వాన్ని బలహీనపర్చి,ప్రస్తుతం చూస్తున్నట్లుగా సుదీర్ఘ విప్లవానికి వ్యతిరేకంగా సామాజిక ప్రతీఘాత విప్లవానికి దారితీస్తుంది.నా అభిప్రాయంలో మనం ఈ రెండవ మార్గంలో వెళతున్నామని చెప్పటానికి విచారిస్తున్నాను.అందుకే నా వుపన్యాసానికి ఈ పేరు పెట్టాను.

దేశంలోని ఏదో ఒక ప్రాంతంలో దళితులకు వ్యతిరేకంగా దారుణమైన అత్యాచారాలు జరిగినట్లు పత్రికలలో వార్తలు చూడకుండా ఒక్కరోజు కూడా గడవటంలేదు. ఇది అత్యాచారాలు పెరిగినందు వలన కాదని,ఇటువంటి ఘటనలను ప్రచురించటం పెరిగినందువలన ఎక్కువగా అత్యాచారాలు జరిగినట్లు కనబడుతున్నదని చెబుతున్నారు.దీనిపై నాకు సందేహాలున్నాయి.మరోవైపున ప్రతీఘాత విప్లవం జరుగుతున్నదని అనేక సూచికలు తెలియజేస్తున్నాయి. ప్రస్తుతం ఎమ్.జి.ఎన్.ఆర్.ఇ.జి.యస్.ను నీరుగార్చే ప్రయత్నం కూడా దీనిలో భాగంగానే భావిస్తున్నాను.ఈ విషయాన్ని గురించి నేను ఇక్కడ ప్రత్యేకమైన చర్చ చేయబోవటం లేదు.అందుకు బదులుగా రెండు అతిముఖ్యమైన వాస్తవాలను నేను చెప్పదలచుకున్నాను.

మొదటిఅంశం, సామాజిక ప్రతీఘాత విప్లవం అనేది సమగ్రమైనది. ఒక ప్రత్యేకరంగంలో జరుగుతున్న ప్రతీఘాతక విప్లవం ఇతర

**"కులవ్యవస్థను పూర్తిగా రూపుమాపాలనే చర్చ ప్రస్తుత సామాజిక,రాజకీయ చర్చల నుండి పూర్తిగా అదృశ్యం అవుతున్నది.దీన్ని కూడాసామాజిక ప్రతీఘాతక విప్లవంలో భాగంగానే నేను భావిస్తున్నాను.సమకాలీన భారతదేశంలో కులవ్యవస్థను నాశనం చేయటంపైకాక,దళితుల పరిస్థితులను మెరుగుచేయటానికి ఏవిధమైన ప్రత్యేక చర్యలు తీసుకోవాలనే అంశంపైనే చర్చను కేంద్రీకృతం చేస్తున్నారు."**

రంగాలలో కూడా అటువంటి పరిణామాలకే దారితీస్తుంది. కాబట్టి ప్రస్తుతం ముస్లింలకు వ్యతిరేకంగా జరుగుతున్న మతోన్మాద ఫాసిస్టు దాడులు, ముస్లిం వ్యతిరేక భావజాల ప్రచారం రాజకీయరంగంలో ఉన్న పౌరులందరూ సమానమనే సూత్రానికి వ్యతిరేకమైనది. ఇది అణచివేయబడుతున్న ఇతర తరగతులైన దళితులు, మహిళలు, జాతిరీత్యా మైనారిటీలైన ఇతర తరగతుల విముక్తిపై కూడా ప్రతికూల ప్రభావాన్ని వేస్తుంది.

రెండవఅంశం, కులవ్యవస్థను పూర్తిగా రూపుమాపాలనే చర్చ ప్రస్తుత సామాజిక, రాజకీయ చర్చల నుండి పూర్తిగా అదృశ్యం అవుతున్నది. దీన్ని కూడాసామాజిక ప్రతీఘాతక విప్లవంలో భాగంగానే నేను భావిస్తున్నాను. సమకాలీన భారతదేశంలో కులవ్యవస్థను నాశనం చేయటంపైకాక,దళితుల పరిస్థితులను మెరుగుచేయటానికి ఏవిధమైన ప్రత్యేక చర్యలు తీసుకోవాలనే అంశంపైనే చర్చను కేంద్రీకృతం చేస్తున్నారు. మరోవిధంగా చెప్పుకోవాలంటే సహోదరత్వంతో కూడిన సమానత్వాన్ని సాధించటానికి కులవ్యవస్థను నాశనం చేయటం నుండి ప్రస్తుతం ఉన్న వ్యవస్థలోనే దళితుల స్థితిగతులను మెరుగు చేయాలనే వైపుకు చర్చ మళ్ళించబడింది. ఈ విధంగా చర్చను మళ్ళించటంకూడా నాదృష్టిలో ప్రతీఘాత విప్లవంలో భాగమే.

ఈ విధంగా నొక్కిచెప్పటాన్ని కొందరు సరైనదిగా భావించకపోవచ్చు. దళితులపై ప్రత్యేకమైన అణచివేతలేనపుడు రాజకీయ నాయకత్వంలో ఉన్న సమానత్వానికి కులవ్యవస్థ ఏవిధంగా ప్రమాదం కలిగిస్తుందని ప్రశ్నిస్తారు. ఇందుకు ఉదారవాద సమాధానాన్ని,మార్క్సిస్టు దృక్పథంతో కూడిన సమాధానాల్ని చర్చిద్దాం. (సిద్ధాంతపరంగా ఈరెంటి మధ్య పెద్దగా వ్యత్యాసం లేనప్పటికీ. ఆచరణరీత్యా వీటిమధ్య తీవ్ర వైవిధ్యం ఉంటుంది.)

## 2

ఈ ప్రశ్నకు ఉదారవాద సమాధా నాన్ని ఇచ్చిన ఆడమ్ స్మిత్ వ్యక్తులందరిలోనూ సమానమైన శక్తి సామర్థ్యాలే ఉంటాయని చెప్పాడు. వెల్త్ ఆఫ్ నేషన్స్‌లోని ఒక ముఖ్యమైన పేరాలో ఈ విధంగా చెప్పాడు.

మనుష్యుల మధ్య సహజమైన ప్రతిభలో వ్యత్యాసం మనకు కనిపించేదానికన్నా చాలా తక్కువగా ఉంటుంది. వారు సంపూర్ణ మానవులుగా ఎదిగిన తర్వాత వివిధ వృత్తులలో ఉండేవారియొక్క మేధస్సులోని వ్యత్యాసం శ్రమ విభజన కారణంగా వస్తుంది. ఏమాత్రం పోలిక లేనటువంటి వృత్తులు చేసే తాత్వికుడు, బజారులో పనులు చేసే ముఠా కార్మికునికి మధ్య ఉండే వ్యత్యాసం అలవాట్ల వల్లనో, ఆచారాలు, విద్య వల్లనో వచ్చేవి కావు. వారు పుట్టినపుడు, ఏడెనిమిది సంవత్సరాలవయసు వారి శక్తి సామర్థ్యాలలో పెద్ద వ్యత్యాసాన్ని వారి తల్లి దండ్రులుగాని, స్నేహితులుగాని గుర్తించలేరు. వారిరువురు దాదాపుగా ఒకేవిధమైన శక్తిసామర్థ్యాలతో ఉంటారు. ఆవయసులోగానీ, ఆ తర్వాతగానీ వారు వేర్వేరు రంగాలలో పని చేస్తారు. వారి మధ్య వ్యత్యాసాన్ని అపుడు గమనించగలం. ఆవ్యత్యాసం క్రమంగా పెరిగి, చివరకుబజారులో బరువులు మోసే కార్మికునికి తత్వవేత్తకు మధ్య సామర్థ్యంలో ఎటువంటి పోలిక లేనిస్థితి ఏర్పడుతుంది. (స్మిత్ 1837 బుక్ 1 చాప్టర్2)

స్మిత్ అభిప్రాయం ఇక్కడి కులవ్యవస్థ సిద్ధాంతానికి పూర్తి భిన్నంగా ఉంది. ఈ అభిప్రాయాన్ననుసరించి వివిధ కులాలమధ్య ఎటువంటి వ్యత్యాసం లేనట్లయితే(అలా భావించటానికి అవకాశంలేదు), కొన్ని వృత్తులలో కొన్ని కులాలవారి ప్రాతినిధ్యం విస్తారంగా ఉంటే, కొన్ని కులాల నుండి తత్వవేత్తలు, కొన్నికులాల నుండి బజారు ముఠా కార్మికులు ప్రధానంగా తయారవుతారు. ఇందుకు కొన్ని కులాలను సామాజికంగా దూరం గా ఉంచటమే కారణం. ఇది రాజకీయ రంగంలో ఉన్న సమానత్వంతో పొసగదు. ఈ పరిస్థితిలో రాజకీయరంగంలోని సమానత్వం ఎక్కువ కాలం నిలబడదు. రాజకీయ రంగంలోని ఉన్న సమానత్వం నిలబడాలంటే సమాజంలో ఉన్న అసమానతలను, ముఖ్యంగా కులపరంగా కొనసాగుతున్న అసమానతలను అంతం చేయాలి. స్మిత్ చెప్పిన దాని ప్రకారం కుల వ్యవస్థను నైతికంగా తిరస్కరించటమేకాక, సమాజంలో కొనసాగుతున్న ఆర్థిక, సామాజిక అసమానతలకు,రాజకీయరంగంలో కొనసాగుతున్న సమానత్వానికి పొసగదని స్పష్టమౌతున్నది.

మార్క్సిస్టు దృక్పథం దీనికి భిన్నమైన అవగాహనతో ఉంటుంది. ప్రైవేటు ఆస్థిపై ఆధారపడిన సరుకుల ఉత్పత్తి వ్యవస్థలో వేరూనుకున్న వ్యక్తుల పరాయీకరణను అధిగమించటంపైనే మానవుని సేచ్ఛ ఆధారపడి ఉంటుందని మార్క్సిజం చెబుతుంది. ఈ వ్యవస్థ సమాజంలోని వ్యక్తులపైనేకాక, సమాజానికి నాయకత్వం వహించేపెట్టుబడిదారులపై కూడా బయటి నుండి వత్తిడి చేసుంది. ఈ పరాయీకరణను అధిగమించటానికి సమైక్య కృషి అవసరం అవుతుంది. ఈకృషి చేయటానికి ఉనికిలోకి వచ్చే సమానుల సహోదరత్వం నైతికంగా కోరుకోదగిందేకాక చరిత్ర సృష్టించే ప్రయత్నానికి తప్పనిసరి అవసరం. ఉనికిలోకి వచ్చే ఈవిధమైన ఐక్యతను దెబ్బతీసి,అణచబడ్డవారిని కుల, మత, జాతి ప్రాతిపదికపై చీల్చే శక్తులు మానవజాతి విముక్తికి ఆటంకం కలిగిస్తాయి. అందువలన కులాన్ని నాశనం చేయటం అనేది దళితుల ఆత్మగౌరవానికి, అణచబడ్డ వారికి స్వేచ్ఛ కోసమేకాక,ప్రతివారి స్వేచ్ఛకు అవసరం.

సమాజానికి నాయకత్వం వహిస్తున్న రాజకీయ నాయకత్వంసమాజాన్ని

ముక్కలుగా చేస్తున్న కుల పరమైన,ఇతర విభజనలను అధిగమించి మానవజాతిని విముక్తి చేసే ప్రయత్నం చేయకపోతే,చైతన్యపూర్వకంగా చరిత్ర సృష్టించే ప్రయత్నం చేయకపోతే, ఆసమాజం అదేస్థితిలో ఎక్కువకాలం ఉండదు. అపుడు సమాజంలోని విభజనలు కొనసాగటమే కాక తీవ్రం అవుతాయి. ముఖ్యంగా హఠాత్తుగా ఆర్థిక సంక్షోభాలు వచ్చినపుడు మరింత తీవ్రం అవుతాయి. సుదీర్ఘమైన సామాజిక విప్లవ క్రమం ముందుకు కొనసాగకపోతే అది స్థంభించిపోయి ఉండదు. అనివార్యంగా సామాజిక ప్రతీఘాత విప్లవం వైపుకు తిరోగమిస్తుంది.

ఈవిధంగారెండు మార్గాలలో ఏ మార్గంలో మనం ఆలోచించినా, కొందరు అంబేద్కర్‌లో ఈరెండు దృక్పథాల్ని దర్శించినా, కులవ్యవస్థను అంతం చేయటంఅనేది చారిత్రక ఎజెండాలో ఒక ముఖ్యాంశంగా ముందు

కొచ్చింది.

### 3

రాజకీయరంగంలో సాధించిన సమానత్వాన్ని ఆర్థిక,సామాజిక రంగాల్లోనూ సాధించాలనే అంబేద్కర్ కలలను నిజం చేయటానికి రెండు ఆటంకాలున్నాయి. ఒకటి మార్పు చెందటానికి వ్యతిరేకంగా, బలంగా పాతుకుపోయిన కులవ్యవస్థ, మార్పు చెందటాన్ని వ్యతిరేకిస్తున్నది. రెండో అంశం పెట్టుబడిదారీఅభివృద్ధి మార్గంలో పయనించటం.

> **“రాజకీయరంగంలో సాధించిన సమానత్వాన్ని ఆర్థిక, సామాజిక రంగాల్లోనూ సాధించాలనే అంబేద్కర్ కలలను నిజం చేయటానికి రెండు ఆటంకాలున్నాయి. ఒకటి మార్పు చెందటానికి వ్యతిరేకంగా, బలంగా పాతుకుపోయినకులవ్యవస్థ, మార్పు చెందటాన్ని వ్యతిరేకిస్తున్నది. రెండో అంశం పెట్టుబడిదారీఅభివృద్ధి మార్గంలో పయనించటం.”**

ఈరెండో అంశం కొందరికి ఆశ్చర్యకరంగా అనిపించవచ్చు. పెట్టుబడిదారీ విధానం ఆధునికమైనశక్తిఅని, పెట్టుబడిదారీ పూర్వ దోపిడీ రూపాల్ని, అసమానతల్ని, కట్టుబానిసత్వాన్ని రద్దు చేస్తుందని భావిస్తారు. అదికొత్త తరహా దోపిడీని, వేతన బానిసత్వాన్ని రూపొందించినప్పటికీ, అవి అసమానత్వానికి దారితీసినప్పటికీ అది పూర్తిగా కొత్త ప్రాతిపదికపై ఆదోపిడీని కొనసాగిస్తాయి. గతంలోని ఫ్యూడల్(మనదేశంలో ఫ్యూడల్,వలస)దోపిడీకి గురవుతున్న సమాజం నుండి స్వేచ్ఛాపోటీలో భాగస్వాములయే వ్యక్తులను సృష్టిస్తుంది. (గతం నుండి సంక్రమించిన ఆర్థిక,సామాజిక వ్యవస్థను పెట్టుబడిదారీ విధానం బలపరచటంతో గతంనుండి వస్తున్న సామాజిక అసమానతలు కూడా బలపడతాయి. వాస్తవంలో స్వేచ్ఛలేని, పరాయీకరణ చేయబడిన వ్యక్తిని స్వేచ్ఛపొందిన వానిగా చేయటంకాక, పూర్తిగా నూతనమైన దోపిడీని రుద్దటం ఆశ్చర్యం అనిపించవచ్చు.)

ఈవిషయంలో మూడవ ప్రపంచ దేశాల, అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థల అనుభవాలలో పెద్ద వ్యత్యాసయాంది. పెట్టుబడారీ విధానం ఎక్కడ తలఎత్తితే అక్కడ సహజంగా పెట్టుబడిదారీ విధాన పూర్వ దోపిడీ రూపాల్ని నాశనం చేస్తుందని చాలా మంది భావిస్తారు. కాని అది పశ్చిమయూరప్ దేశాలకు సంబంధించిన ప్రత్యేకమైన అనుభవం మాత్రమే. ఇతర దేశాలలో ఎక్కడా ఆవిధంగా జరగలేదు. పెట్టుబడిదారీ విధానం అనివార్యంగా, అన్ని సందర్భాలలోనూ పెట్టుబడిదారీ పూర్వ సంబంధాలను రద్దు చేయదు. (దూరప్రాంతాల్లో ఉన్న ప్రజల జీవితాలను నాశనం చేసి, అక్కడికిప్రజలు పెద్ద సంఖ్యలో వలస వెళ్ళటానికి అవకాశం ఉన్న చారిత్రక పరిస్థితులో పశ్చిమ యూరప్ దేశాలలో మాత్రమే పెట్టుబడిదారీ విధానం ఫ్యూడలిజాన్ని నాశనం చేసింది. పంథొమ్మిదవ శతాబ్దం నుండి మొదటిప్రపంచ యుద్ధం మధ్య సుదీర్ఘకాలంలో ఐదుకోట్లమంది యూరోపియన్లు సుదూరప్రాంతమైన, నూతన ప్రపంచం, కెనడా, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్ తదితర దేశాలకు వలస వెళ్ళారు.

వలసల ఫలితంగా పెట్టుబడిదారీ విధానం ఆక్రమించిన రంగాలలోని ప్రజలను అక్కడి ఉత్పత్తి విధానంలో ఇముడ్చుకోవాల్సిన అవసరం లేకపోయింది. దేశీయ పెట్టుబడిదారీ ఉత్పత్తిరంగంలో కొద్దిమంది నిరుద్యోగసైన్యం మాత్రమే మిగిలింది. వారు వలస వెళ్ళిన ప్రాంతాలలోని ప్రజలను భూముల నుండి తొలగించి స్వతంత్ర రైతులుగా వ్యవసాయం చేయటం, ఇతర వృత్తులలోకి పోవటం చేశారు. ఆవిధంగా స్వతంత్ర వ్యవసాయం చేయటం ప్రత్యక్షంగా, పరోక్షంగా డిమాండ్‌ను పెంచింది.

ఈ వాస్తవం పాత సామాజిక వ్యవస్థ బలహీనపడటం, విచ్ఛిన్నం కావటాన్నివేగిరం చేసింది. ఈ విధంగా వలసవెళ్ళే అవకాశం లేనట్లయితే పాత ఆర్థిక విధానంపై పెట్టుబడిదారీ దోపిడి పాత వ్యవస్థ విచ్ఛిన్నానికి దారితీసేది కాదు. అది పాతవిధానంలోనిచిన్న ఉత్పత్తిదారులను తమ సాంప్రదాయక వృత్తులను వదులుకోకుండా వారిని కనీస జీవనానికే పరిమితంచేసి వారిని దరిద్రంలో ముంచేది. అటువంటి పరిస్థితులలో వారుంటున్న సామాజిక వ్యవస్థ కూడా కొనసాగుతుండేది. మూడవ ప్రపంచదేశాలలో తమ జీవనాధారం కోల్పోయినవారు ఆవిధంగా వలసలు వెళ్ళటానికి అవకాశంలేనిచోట్ల, పెట్టుబడిదారీ విధానం వారిని మరింత దుర్భర పరిస్థితులలోకి నెడుతుంది. కానీ అది పాత సామాజిక వ్యవస్థను రద్దు చేయటానికి దారితీయదు. పాత సామాజిక విధానాన్ని రద్దుచేసి, ఆధునికతను తీసుకువచ్చే వేగుచుక్క లాగా పెట్టుబడిదారీ విధానం ప్రతి సందర్భంలోనూ వ్యవహరించదు.

వలసదేశాలలో సామ్రాజ్యవాద పెట్టుబడి ఉత్పత్తి రంగాలన్నింటిని ఆక్రమించుకొని ఆదేశాలను పారిశ్రామిక రహితం చేసి, వృత్తిదారులను ఆవృత్తులనుండి తొలగించింది. ఆదేశాలలో నిరుద్యోగం, దరిద్రం విపరీతంగా పెరిగాయి. కాని ఆదేశాలలో కులవ్యవస్థపై ఆధారపడిన ఫ్యూడల్ నిర్మాణాన్ని ఏమాత్రం బలహీనపరచలేదు. ఇదే విధంగా వలస విధానం అంతమైన తర్వాత కూడా సాంప్రదాయక ఆర్థిక వ్యవస్థను ఆక్రమించుకున్న పెట్టుబడి, ఈపెట్టుబడి సామ్రాజ్యవాద పెట్టుబడి స్థానంలో వచ్చిన దేశీయ పెట్టుబడే అయినప్పటికీ, అంతకు ముందున్న సామాజిక నిర్మాణాన్ని ధ్వంసం చేయలేదు. గతంలో సామ్రాజ్యవాద దేశాలలో ఉన్న విధంగాప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్ళటానికి అవకాశాలు లేని స్థితిలో వృత్తులు కోల్పోయినవారందరికీ ఉపాధి కల్పించలేని పరిస్థితులలో పెట్టుబడిదారీ విధానం ఈ విధంగా వ్యవహరించింది.

కాబట్టిపెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాద దేశాలలో వ్యవహరించిన విధంగా మనలాంటి దేశాలలో వ్యవహరించదు. పాత సామాజిక వ్యవస్థను ధ్వంసంచేయటంలో దానివిప్లవకరపాత్ర పరిమితం చేయబడుతుంది. పెట్టుబడిదారీ విధానం దోపిడీ చేయటంద్వారా వృత్తులు కోల్పోయి, నగరాలలో ఉపాధి పొందుదామని ప్రయత్నిస్తున్న చిన్న ఉత్పత్తిదారులకు నగరాలలోఉపాధి చూపించలేదు. ఉద్యోగాలలో ఉన్న వారితో పోల్చితే నిరుద్యోగుల సంఖ్య పెరుగుతుంది.

ఇది రెండు ముఖ్యమైన పరిణామాలకు దారితీస్తుంది. మొదటి అంశం ఈరెండు సైన్యాలు, ఉద్యోగ, నిరుద్యోగసైన్యాలు వేటికవి విడిగా ఉండవు. ఉద్యోగకల్పనలో పరిమితులు కొందరు కార్మికులు పూర్తి ఉద్యోగులు గానూ, మిగతావారు పూర్తి నిరుద్యోగులుగానూ ఉండటం జరగదు. అందుకుబదులుగా పార్ట్‌టైమ్, క్యాజువల్, కాంట్రాక్టు, ఇన్‌ఫార్మల్, ఇంటర్‌మిట్టెంట్ తదితర పేర్లతో తాత్కాలిక ఉద్యోగాలు విస్తరించటంతో ఎక్కువమంది పార్ట్‌టైమ్ ఉద్యోగులుగానే ఉంటారు. ఇది కార్మికసంఘాల కార్యకలాపాలపై పరిమితిని విధిస్తూ, కార్మికులు పెట్టుబడికి లొంగి ఉండేలా చేస్తుంది. ఇది అతివాద రాజకీయ కార్యకలాపాలపైకూడా పరిమితుల్ని విధిస్తుంది.

రెండవ అంశం ఇది పెద్దసంఖ్యలో

> **“ పెట్టుబడిదారీ విధానం ఎదురులేకుండా అభివృద్ధి సాధించిన దశలో సామ్రాజ్యవాద దేశాలలో జరిగిన పెట్టుబడి దారి విధాన అభివృద్ధికీ, మనలాంటి దేశాలలో జరుగుతున్న పెట్టుబడి దారీ విధాన అభివృద్ధికీ వ్యత్యాసం ఉంది. ఒకవైపున అభివృద్ధి చెందిన దేశాలలో చేసినట్లు ఈ దేశాలలో పాత సామాజిక వ్యవస్థను ధ్వంసం చేయదు. మరోవైపున నగరాలలో కనపడని రీతిలో నిరుద్యోగాన్ని పెంచుతూ, సమాజాన్ని క్రమంగా అలగా (లుంపెన్) జనంతో నింపేస్తుంది ”**

అలగాజనం పెరగటానికి దారితీసి, ఈ అలగా జనం చేసే పనులు పెరుగుతాయి. చైనా సమాజంలో వర్గాల విశ్లేషణ అన్న ప్రముఖ వ్యాసంలో మావోవిప్లవానికి పూర్వం చైనాలో భూములు కోల్పోయిన రైతులు నగరాలలో తగినంత ఉపాధి పొందలేక అలగాజనంలో భాగంగా మారిపోయారని చెప్పాడు. ఇదే ధోరణి ప్రస్తుతం మూడవ ప్రపంచ పెట్టుబడిదారీదేశాలన్నింటి లోనూ కనిపిస్తున్నది. పెట్టుబడిదారీ విధాన విస్తరణ సాంప్రదాయక చిన్న ఉత్పత్తిదారులను తీవ్రంగా దోపిడీ చేస్తుంది. కానీ అది అత్యధిక శాతం జి.డి.పి.పెరుగుదల సాధించినపుడు కూడా సరిపోనూ ఉద్యోగ అవకాశాలను కల్పించ లేదు. కాబట్టి పెద్ద సంఖ్యలో అలగా జనాన్ని సృష్టిస్తూ, సమాజాన్ని అలగాజనంతో నింపే స్తుంది.

పెట్టుబడిదారీ విధానం ఎదురులేకుండా అభివృద్ధి సాధించిన దశలో సామ్రాజ్యవాద దేశాలలో జరిగిన పెట్టుబడిదారి విధాన అభి వృద్ధికి, మనలాంటి దేశాలలో జరుగుతున్న పెట్టుబడిదారీ విధాన అభివృద్ధికి వ్యత్యాసం ఉంది. ఒకవైపున అభివృద్ధి చెందిన దేశాలలో చేసినట్లు ఈ దేశాలలో పాత సామాజిక వ్యవస్థ ను ధ్వంసం చేయదు.మరోవైపున నగరాలలో కనపడనిరీతిలో నిరుద్యోగాన్ని పెంచుతూ, సమాజాన్ని క్రమంగా అలగా జనంతో నింపే స్తుంది.

ఇటువంటి పరిస్థితులలోకొందరు భావిస్తు న్నట్లుగాపెట్టుబడిదారీ విధానాభివృద్ధితో కుల చైతన్యం, కులవైరుధ్యాలు, కులఘర్షణలు అదృశ్యం కాకపోగా, సామాజికంగా అణచబడు తున్న తరగతులకు ప్రతికూలంగా ఈఘర్షణలు మరింతగా పెరుగుతాయి. మనలాంటి దేశాల లో అభివృద్ధి అవుతున్న పెట్టుబడిదారీ విధానం పాత సామాజిక వ్యవస్థను నాశనంచేసి, కుల చైతన్యాన్ని, కులవైరుధ్యాలనునాశనం చేయక పోగా, సామాజికంగా అణచబడుతున్న వారికి ప్రతికూలంగా వాటిని మరింతతీవ్రంచేస్తుంది. కాబట్టే నేను సామాజిక ప్రతీఘాత విప్లవం అనే మాటను వాడాను.

ఈ ధోరణిని ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న దశలో, నెహ్రూ ప్రభుత్వం అను సరించిన విధానాలు, ప్రభుత్వరంగం ప్రధాన పాత్ర వహించిన దశలో, కులపరమైన అసమా నతలను కొంతమేరకు అదుపులో ఉంచటానికి ప్రభుత్వం ప్రయత్నించింది. మధ్యతరగతి ప్రజలచే జనాకర్షక పథకాలని హేళన చేయబడ్డ ,ప్రజలకు విద్య, వైద్యం లాంటి కొన్ని సేవలతో పాటుకొంత సహాయం అందించాలనే ప్రభుత్వ కట్టుబాటు ప్రజలలోని అణచబడ్డవారికి, దళితులకు కొంతవెసులుబాటును కల్పించిం ది. కాని నయాసరళీకరణ విధానాలు ప్రారంభం కావటం, తిరిగి మరొకసారి పెట్టుబడిదారీ విధానం యొక్క విశృంఖలత పెరుగుతూండటం తో సామాజిక ప్రతీఘాత విప్లవక్రమం ఊపందుకుంది.

4

నయా-సరళీకరణ విధానాల అమలు వలన నాలుగు విధాలుగా సామాజిక అసమా నతలు తీవ్రం అవుతాయి. మొదటిది సాధారణ మైనది. పెట్టుబడిదారీ విధానం పాత సామాజిక నిర్మాణాన్ని నాశనం చేయకుండా ఆవిధానం పైనే పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మించటానికి పూనుకున్నపుడు,అంతకు ముందున్న వ్యవస్థలో ఉన్నతస్థాయిలో ఉన్నవారు ఆవ్యవస్థ పక్కకునెట్టిన వారికన్నా ఎక్కువ ప్రయోజనం పొందగలిగే స్థితిలో ఉంటారు. ఈవిధమైన పెట్టుబడిదారీ అభివృద్ధి నమూనా సామాజిక అసమానతలను మరింత తీవ్రం చేస్తుంది. స్వంతంగా ఆస్థులున్న వారు,విద్య నేర్చుకోవటానికి ఎక్కువ అవకాశా లున్నవారు,ఉత్పత్తి రంగంతో దగ్గర సంబధాలు న్నవారు ఆర్థికంగా ప్రతికూలస్థితిలో, సామాజి కంగా అట్టడుగున ఉన్నవారికన్నా అభివృద్ధి ఫలితాలను స్వంతం చేసుకోవటానికి ఎక్కువ అవకాశాలు కలిగి ఉంటారు.

మనం ఇంతకుముందు చూసినట్లుగా స్వాతంత్ర్యానంతరం వచ్చిన ప్రభుత్వం అనుస రించిన విధానాలు,పేదలకు అందించిన సహాయం నిస్సందేహంగా ఈధోరణిని కొంతమే రకు అదుపు చేయటానికి దోహదం చేసింది. ప్రైవేటీకరణ విధానాలు పెరగటం వలన ఈ విధానాలు తమ ప్రభావాన్ని కోల్పోయాయనేది నేను చెప్పదలచుకున్న రెండవ అంశం. నయా-సరళీకరణ యుగంలో పెట్టుబడిదారుల ప్రయోజ నాలు దెబ్బ తింటాయని(వారి జంతుప్రవృత్తి దెబ్బతింటుందని) ప్రైవేటురంగంతో దృఢంగా వ్యవహరించలేకపోవటంతో, ప్రభుత్వరంగ సంస్థలలో చట్టరీత్యాఈ విధానాలు అమలు జరుగుతున్నప్పటికీ, సామాజిక అసమానతలను తొలగించటంలో తమ ప్రభావాన్ని కోల్పో యాయి. దీనితోపాటుగా విద్య,వైద్యం లాంటి సేవారంగాలను ప్రైవేటీకరించటంతో అవి ఖరీ దైనవిగా మారి పేదలకు అందుబాటులో లేకుండాపోవటం, వీరిలో సామాజికంగా అణచ బడినవారు అత్యధిక సంఖ్యలో ఉండటంతో ఆర్థిక అసమానతలనేగాక సామాజిక అసమానతలను కూడా పెంచటానికి దోహదంచేశాయి.

మూడవఅంశం నిరుద్యోగం పెద్ద ఎత్తున పెరుగుతున్న పరిస్థితుల్లో ఉద్యోగావకాశాలు పరిమిత ంగా ఉండటం కూడా పాత సామాజిక సంబంధాలు,కుల సంబధాలు బలపడేలా చేస్తుంది. దీనితోపాటు కులచైతన్యం పెరగ టం, ఆధిపత్య కులాల పెత్తనం కొనసాగటం,కుల అసమానతలూ పెరగటానికి దారితీస్తుంది. ఈ మాట చెబుతున్నామంటే పాత ఆధిపత్య కులాలు నూతన పరిస్థితుల్లో తమ పెత్తనానికి ఎటువంటి సవాళ్ళను ఎదుర్కోవటం లేదనికాదు. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో కొన్ని కులసంఘటనలు ఏర్పాటుకావటం, సంఖ్యరీత్యా ఆధిక్యత ఉన్న మధ్యంతర కులాలు కొంతమేరకు పైస్థాయికి చేరటం జరుగుతుంటుంది.ఉద్యోగిత తగ్గిన పరిస్థితులలో అణచివేయబడుతున్న కులాలు ఎక్కువగా నష్టపోతారు.(ఇది సాధారణంగా తమకు కావలసినవారికి ఉద్యోగాలు ఇవ్వటానికి దారితీస్తుంది.)

ఈసందర్భంలో రెండు అంశాలను గమ నించాలి. ఉద్యోగావకాశాలు పరిమితంగా ఉన్నస్థితిలో కావలసినవారికి ఉద్యోగాలు ఇవ్వ టంలో కులం ఒక్కటి మాత్రమే ప్రధానం కాదుఅనేది మొదటిఅంశం. జాతి, భాషా, ప్రాంతం, చివరకు గ్రామం లాంటి ఇతర అంశాలు కూడా పాత్ర వహిస్తాయి.(ఉద్యోగాలకు కొరత ఉన్నటువంటి పరిస్థితులలో ఒక నిర్దిష్ట ప్రాంతం నుండి వచ్చిన పైకులాలకు చెందినవ్యక్తి తనకు ఏ ప్రత్యేక సంబంధాలులేని ఇతర ప్రాంతం నుండి వచ్చిన వ్యక్తికన్నా కుల,మత విభేదాలను పక్కనపెట్టి, తన ప్రాంతం నుండి వచ్చిన దళితుడికో,ముస్లింకో ప్రాధాన్యత ఇస్తాడా అన్న విషయంలో నాకు సందేహాలున్నాయి.)

సత్యజిత్ రే సినిమా మహానగర్‌లో కూడ తామిద్దరూ పాబ్నా నుండి రావటం వలన తన భార్య పనిచేసే ఆఫీసులోని అధికారి అతనికి ఉద్యోగం ఇస్తానని వాగ్దానం చేస్తాడు.(ఈ సినిమా సరళీకరణ విధానాలు ప్రవేశపెట్టటానికి చాలా ముందు,ఉద్యోగాలకు తీవ్రకొరత ఏర్పడిన పరిస్థితులలో వచ్చింది.) అన్నిఅంశాలను మార్కెట్‌కు వదిలివేసిన పరిస్థితుల్లో పాత సంబంధాలు, ముఖ్యంగా కుల సంబంధాలు ప్రాధాన్యత వహిస్తాయి.శ్రమ ఉత్పాదకత వేగంగా పెరగటంతో జిడిపి పెరుగుదల ఎక్కువగా ఉన్నప్పటికి ఉద్యోగ అవకాశాలు నిదానంగా పెరగటంతో ఉద్యోగాలు దొరకటం మరింత కష్టం అవుతుంది.

> **❝ నిరుద్యోగం పెద్ద ఎత్తున పెరుగుతున్న పరిస్థితుల్లో ఉద్యోగావకాశాలు పరిమితంగా ఉండటం కూడా పాత సామాజిక సంబంధాలు,కుల సంబధాలు బలపడేలా చేస్తుంది. దీనితో పాటు కులచైతన్యం పెరగటం,ఆధిపత్య కులాల పెత్తనం కొనసాగటం,కుల అసమానతలూ పెరగటానికి దారితీస్తుంది. ఈమాట చెబుతున్నామంటే పాత ఆధిపత్య కులాలు నూతన పరిస్థితుల్లో తమ పెత్తనానికి ఎటువంటి సవాళ్ళను ఎదుర్కోవటం లేదనికాదు. ❞**

రెండవ అంశం ఉద్యోగావకాశాలు కుదించుకుపోతున్న పరిస్థితులలో అణచబడుతున్న కులాలు కూడా కొన్ని ప్రయోజనాలు పొందటానికి ఐక్యసంఘటనలు ఏర్పాటు చేసుకోవచ్చునని కొందరు వాదించవచ్చు. అణచబడ్డ కులాలకు వ్యతిరేకంగా ,కులాలను రద్దుచేయటానికి బదులుగా,వాస్తవంగా కులచైతన్యాన్ని పెంచుతున్నపుడు,కుల విభేదాలను పెంచుతున్నపుడు కూడా,లాంఛనప్రాయమైన ప్రజాస్వామ్యమైనా అణచబడ్డ కులాలకు వ్యతిరేకంగా వ్యవహరించదని వారు చెపుతారు.ఈ వాదనను మనం అంగీకరిస్తే అణచబడ్డ కులాలను దూరంగా ఉంచటం వలన వారుతీవ్రమైన భారాన్ని మోస్తున్నారు కాబట్టి దీన్ని తొలగించాలంటే ప్రభుత్వం వైపు నుండి తీవ్రమైన కృషి జరగాల్సి ఉంటుందనే నిర్ణయానికి రావాలి.(నయా-సరళీకరణ దశలో ఇది అసంభవం) ప్రభుత్వం నయా-సరళీకరణ విధానాలు అమలు జరుపుతున్న దశలో కొన్ని ప్రయోజనాల్ని సాధించటం కోసంఅణచబడ్డ కులాలు కొన్ని సంఘటనల్ని ఏర్పాటుచేసినా, సామాజికంగా అణచబడుతున్న కులాలలో అత్యధికులు అంతకు ముందు వలెనే దూరంగానే ఉంచబడతారు.

నయా-సరళీకరణ ఆర్థిక విధానాల అమలులో కులాల మధ్యవైరుధ్యాలను తీవ్రం చేసే నాలుగవ అంశం ఈవిధానాలు సంక్షోభాన్ని ఎదుర్కోవటం,సుదీర్ఘమైన స్థబ్దతలో ఉండటం. నయా సరళీకరణ విధానాల అమలు కాలంలో పెరుగుదల ప్రధానంగా ఆస్తుల ధరలలో ఏర్పడే బుడగలపై ఆధారపడి ఉంటుంది.ప్రపంచంలో ప్రధాన పెట్టుబడిదారీ దేశమైన అమెరికా ఆర్థిక వ్యవస్థలో అటువంటి బుడగలు ఏర్పడి నపుడు, మొత్తం పెట్టుబడిదారీ ప్రపంచంలో, దానితో పాటు భారతదేశ ఆర్థిక వ్యవస్థలోనూ అధిక పెరుగుదల ఉంటుంది. ప్రపంచ ఆర్థిక పెరుగుదల ఉచ్ఛస్థితిలో ఉన్నపుడు దానిపై ఆధారపడి దేశంలోనూ బుడగలు ఏర్పడి పెరుగుదల ఉంటుంది. అటువంటి బుడగలు పగిలిపోయినపుడు ఆర్థిక పెరుగుదల కుప్పకూలిపోయి,కొత్తగా మరో బుడగ ఏర్పడేవరకూ ఆర్థిక వ్యవస్థ స్తబ్దతలో ఉంటుంది.ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ,దానితోపాటు భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఈ స్థితిలోనే ఉన్నాయి.

సంక్షోభం, మాంద్యం వచ్చినపుడు ఈ వ్యవస్థను రాజకీయంగా నడపటానికి వాటి ఫలితంగా వచ్చిన వైరుధ్యాలను తీవ్రం చేస్తారు. మధ్యతరగతులను పేదలకు వ్యతిరేకంగా, మధ్యంతర కులాలను అణచబడ్డ కులాలకు వ్యతిరేకంగా, మెజారిటి మతాన్ని మైనారిటి మతాలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టటం ద్వారా రాజకీయ వ్యవహారాలను నిర్వహిస్తారు. నయా సరళీకరణ విధానాల అమలులో ఆధిపత్యశక్తిగా ఉన్న కార్పొరేట్, ద్రవ్య పెట్టుబడి గుత్తాధిపతుల ఆధిపత్యాన్ని వ్యతిరేకించే శక్తులను ఐక్యం కాకుండా చీల్చివుంచటమే ఈ వ్యూహాలలో ప్రధానాంశంగా ఉంటుంది.ఈ విభజనలన్నింటినీ ఒకే సమయంలో తీవ్రంచేయటం ఇంతకు ముందు చెప్పినట్లుగా సామాజిక ప్రతీఘాత విప్లవాన్ని సమగ్రంగా నిర్వహించటంలో భాగమే.ఈ విడదీసే వ్యూహాలు ఫాసిజం వైపు చేసే ప్రయాణంలో భాగం.

నయా సరళీకరణ విధానాలు అమలు చేసే ఈ ప్రభుత్వం కొనసాగటానికి మధ్యతరగతుల నుండి లభిస్తున్న మద్దత్తు కీలకమైనది. వీరిలో కొందరు సరళీకరణ విధానాల వలన ప్రయోజనం పొందినవారుకాగా,మిగతా వారు కూడా వీరి లాగే ప్రయోజనం పొందగలమని భావిస్తున్నారు. నయా సరళీకరణ విధానాల ఫలితంగా ఏర్పడుతున్న సంక్షోభాలకు అవినీతి మాత్రమే కారణం అని, (అవినీతి విస్తృతం కావటాన్ని నయా సరళీకరణ విధానాల నుండి వేరు చేసి చూస్తారు) లేదా ప్రజాకర్షక విధానాలే కారణమని భావించటం(వీటిని తరచుగా అవినీతికి మరో రూపంగా చూస్తారు) వలన నయా సరళీకరణ విధానాల ఫలితంగా మధ్య తరగతిలో పెరుగుతున్న అసంతృప్తిని దారి తప్పిస్తుంది. ప్రజాకర్షక విధానాలను వ్యతిరేకించే రాజకీయశక్తులు అధికారంలోకొస్తే మంచి రోజులు దగ్గరలోనే ఉంటాయనే మధ్యతరగతి ఆశలను సజీవంగా ఉంచుతుంది.పేదలకు వ్యతిరేకంగా జరుగుతున్న వాదనలు దళితులకు వ్యతిరేకంగా జరుగుతున్న వాదనలతో కలిసిపోయి,దళితులను వ్యతిరేకించే,గ్రామీణ పేదల ఆత్మస్థైర్యాన్ని పెంచే గ్రామీణ ఉపాధి లాంటి చట్టబద్ధ పథకాలను వ్యతిరేకించే మధ్యంతర కులాల వారికి ఆకర్షణీయంగాఉంటాయి. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో మతోన్మాద ఫాసిజానికి స్థానం ఉంటూనే ఉంది.నయా సరళీకరణ విధానాల ఫలితంగా సంక్షోభాలు వచ్చినపుడు కార్పొరేట్, ద్రవ్య పెట్టుబడిదారుల ఆధిపత్యానికి వస్తున్న సవాలును ఎదుర్కోవటానికి పేదల వ్యతిరేక, దళిత వ్యతిరేక, ముస్లీం వ్యతిరేక ఎజెండా శక్తివంతమైన ఆయుధంగా పని చేస్తుంది.

ఇది కేవలం రాజకీయ నిర్వహణా కార్యక్రమమే కాదు.కార్పొరేట్,ద్రవ్య పెట్టుబడి గుత్తాధిపతుల ఆధిపత్యానికి ఎదురౌతున్న సవాళ్ళ తగ్గిన మేరకు,సంక్షోభాన్నిఅధిగమించాలంటే వారి జంతుప్రవృత్తికి స్వేచ్ఛ నివ్వటం అత్యవసరం అనిప్రచారం చేస్తారు.పేదల కోసం అమలు చేస్తున్న ప్రజాకర్షక పథకాలే సంక్షోభానికి కారణమని ప్రచారం చేస్తూ కార్పొరేట్ ఎజెండాను మరింత నిర్దాక్షిణ్యంగా ముందుకు తీసుకుపోవటా నికి దోహదం ఇది చేస్తుంది. అభివృద్ధి ప్రాజెక్టులను గిరిజనులు నివసిస్తున్న ప్రాంతాలలోనే ఏర్పాటు చేస్తున్నామనే పేరుతో వారిని అక్కడి నుండి తొలగించటం తేలికౌతుంది. అభివృద్ధిని తిరిగిప్రారంభిస్తున్నామనే పేరుతో కార్మిక సంఘ కార్యకలాపాలను నిరోధించటం సులభమౌతుంది. కార్పొరేట్ల కనుకూల మైన అభివృద్ధిని గురించిన చర్చ సామాజిక ప్రతీఘాత విప్లవంప్రారంభం కావటంతో మరింత ఊపందుకుంటుంది.కులాల మధ్య శతృత్వాలను పెంచటానికి,ఆర్థిక,సామాజిక అసమానతలను పెంచటానికి సంక్షోభం అను కూల సమయంగా ఉంటుంది.

> **“ నూతన బుడగలు ఏర్పడనపుడు సంక్షోభం కొసాగుతుంటుంది కాబట్టి, సంక్షోభానికి విరుగుడుగా ఆర్థిక, సామాజిక అసమానతలు పెంచే విధానాలను అనుసరించటం విరుగుడు కాదని ప్రజలు గ్రహిస్తారని అనుకోవచ్చు. ఆర్థికాభివృద్ధిని సాధించటంలో ఇది నిరుపయోగమని అర్థమైనపుడు సామా జిక ప్రతీఘాత విప్లవాన్ని ప్రజలు వ్యతిరేకిస్తారని భావిస్తారు. ఫాసిజం వాగ్దానం చేసిన విధంగా అభివృద్ధి జరగనపుడు ఫాసిజంవైపుకు వెళ్ళే మార్గం నుండి వెనక్కు మళ్ళుతారని భావిస్తారు. ”**

నూతన బుడగలు ఏర్పడనపుడు సంక్షోభం కొసాగుతుంటుంది కాబట్టి, (వాటి ఫలితాలు కూడా తాత్కాలికంగానే ఉంటాయి.) సంక్షోభానికి విరుగుడుగా ఆర్థిక,సామాజిక అసమానతలను పెంచే విధానాలను అనుసరించటం విరుగుడు కాదని ప్రజలు గ్రహిస్తారని అనుకోవచ్చు.ఆర్థికాభివృద్ధిని సాధించటంలో ఇది నిరుపయోగమనిఅర్థమైనపుడు సామాజిక ప్రతీఘాత విప్లవాన్ని ప్రజలు వ్యతిరేకిస్తారని భావిస్తారు. ఫాసిజం వాగ్దానం చేసిన విధంగా అభివృద్ధి జరగనపుడు ఫాసిజం వైపుకు వెళ్ళే మార్గం నుండి వెనక్కు మళ్ళుతారని భావిస్తారు.

ఈ వాదన రెండువిధాలుగా తప్పవుతుంది.మొదటి అంశం ఆర్థిక పునరుజ్జీవం జరగకపోయినా, కులవ్యవస్థ వేళ్ళూనుకున్న సమాజంలో సామాజిక ప్రతీఘాత విప్లవ ప్రచారం ఒక తరగతి ప్రజల్ని ఎప్పుడూ ఆకట్టుకుంటూనే ఉంటుంది. రెండవ అంశం అభివృద్ధిని వాగ్దానం చేసి,దాన్ని సాధించలేనపుడు ఈ శక్తులు మరింతగా ప్రజల ఐక్యతను విచ్ఛిన్నంచేసే, సామాజిక ప్రతీఘాత విప్లవాన్ని మరింత తీవ్రంచేసే విధానాలను అనుసరిస్తారు. తప్పుడు విధానాలను ప్రచారం చేసినవారు ఆవిధానాలు తప్పని రుజువు కాగానే తాముగా వెనుతిరగరు. తమంతట తాముగా నిజమైన చైతన్యాన్ని పొందటానికి అది దోహదం చేయదు. ఆ విధానాలనే కొనసాగించటానికి,మరింత తీవ్రం చేయటానికి కుయుక్తులు పన్నుతారు.కాబట్టి ఈ తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా పోరాడటానికి ప్రత్యామ్నాయ విధానాలు ఉండాలి.

5ఇటువంటి ప్రత్యామ్నాయ విధానాలలో ఏఏ అంశాలుండాలి. మనలాంటి సమాజాలలో పెట్టుబడిదారీ విధానాభివృద్ధి, ముఖ్యంగా నయా సరళీకరణ విధానాల అమలు సామాజిక ప్రతీఘాత విప్లవానికి దారితీస్తుందని నేను వాదిస్తున్నాను. కాబట్టి సామాజిక ప్రతీఘాత విప్లవాన్ని ఎదుర్కోవాలంటే నయా సరళీకరణ విధానాలను పూర్తిగా రద్దు చేయాలి. ఈనాటి పెట్టుబడిదారీ విధానం ఎత్తిన అవతారమే నయా సరళీకరణ విధానాలు.పెట్టుబడిదారీ విధానం ఈరోజు వరకు సాధించిన అభివృద్ధిలో ఇదే అత్యున్నతమైనది. కాబట్టి దీనికి ప్రత్యామ్నాయంగా పెట్టుబడిదారీ విధానాన్ని పూర్తిగా రద్దు చేసే సామాజిక నిర్మాణం కావాలి.

నేను ఈ అభిప్రాయానికి వచ్చాను కాబట్టి ఇతరులను కూడా నాతో ఏకీభవించమని కోరను. సామాజిక ప్రతీఘాత విప్లవం నుండి వెనక్కు మళ్ళటానికి తీసుకోవాల్సిన కనీస చర్యలకు నేను పరిమితమౌతూ,ఈ అంశాలపై ఏకాభిప్రాయం ఉండాలని కోరుతున్నాను.వీటిని మనదేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ పరిధిలోనే సాధిస్తే మంచిదే. అలా సాధించటం సాధ్యం కాకపోతే ఈ నినాదాల చుట్టూ ప్రజలను సమీకరించి,వాటిని సాధించటానికి ప్రయత్నించాలి. సాధ్యం కాకపోతే ఈ వ్యవస్థను మార్చేవరకూ పోరాడాలి.

దేశప్రజలందరికి కొన్ని సార్వత్రిక హక్కులను ప్రవేశపెట్టటం దీనిలో కీలకాంశంగా ఉండాలి.ఆహారహక్కు,ఉపాధి హక్కు,నాణ్యమైన ఉచిత వైద్యం,నాణ్యమైన ఉచిత విద్య(కనీసం స్కూలు స్థాయి వరకు) తగిన మొత్తంలో వృద్ధాప్య పెన్షన్,వికలాంగులకు, పనిచేసే శక్తి లేని వారికి తగిన మొత్తం ఇవ్వటం లాంటి కనీస చర్యలు తీసుకోవటం వీటిలో భాగంగా ఉండాలి.

వీటిని ఇప్పటికే మనదేశంలో ప్రవేశపెట్టారని కొందరు భావించవచ్చు.కాని అది పొరపాటు. మనదేశంలో సార్వత్రిక ఆహార హక్కు,సార్వత్రిక ఉపాధి హక్కు,(ఉద్యోగం లేకపోతే బ్రతకటానికి సరిపోయే నిరుద్యోగభృతి) బ్రతకటానికి సరిపోయే సార్వత్రిక వృద్ధాప్య పెన్షన్ హక్కు, నాణ్యమైన ఉచిత వైద్య హక్కు,ప్రభుత్వం నివాసప్రాంతాల్లో స్కూళ్ళనుఏర్పాటు చేయటం ద్వారా నాణ్యమైన ఉచిత విద్యను పొందే హక్కు మనదేశంలో లేవు.యుద్ధానంతర కాలంలో అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో ఈ హక్కులన్నింటిని కల్పించారు.నయా సరళీకరణ విధానాలు ప్రారంభమైన తర్వాత వీటిని క్రమంగా బలహీనపరుస్తున్నప్పటికీ, అనేక దేశాలలో ఇవి కొనసాగుతూనే ఉన్నాయి. మనదేశంలో అటువంటి సార్వత్రిక ఆర్థిక హక్కులను ఎప్పుడూ ప్రవేశపెట్టలేదు.

పేదలకు మాత్రమే ఉద్దేశించిన లక్షిత పథకాలకు భిన్నంగా సార్వత్రిక హక్కులు ఇవ్వటంతో లబ్దిదారులు తాము పొందే మొత్తాన్ని దానంగా పొందుతున్నామని భావించరు. పౌరులుగా తమ హక్కుగా పొందుతున్నామని భావిస్తారు. ఈ హక్కులు ప్రతివారికీ ఉంటాయి కాబట్టి ఒక తరగతి ప్రజలకు వ్యతిరేకంగా మరో తరగతి ప్రజలను రెచ్చగొట్టటానికి ఉపయోగించటం సాధ్యం కాదు. అటువంటి పథకం కుల, మత, లింగ, జాతి విభేదాలను అంతం చేస్తూ, సమానహక్కులు గలపౌరులను రూపొందిస్తుంది. వలస వ్యతిరేక పోరాటంలో చేసిన వాగ్దానాన్ని నేరవేరుస్తూ భారత ప్రజాస్వామిక విప్లవాన్ని ముందుకు తీసుకువెళుతూ, సామాజిక విముక్తి కోసం కంటున్న కలలను నిజం చేసేవైపుగా ముందుకు సాగుతాం.

ఈపథకానికి కావలసిన నిధులు ఎక్కడి నుండి వస్తాయనే ప్రశ్న వెంటనే అడుగుతారు. ఈ పథకాన్ని అమలు చేయటానికి జి.డి.పి.లోపది శాతం నిధులు అదనంగా కావాల్సివుంటాయని నేను భావిస్తున్నాను. ప్రపంచంలో జి.డి.పి. పన్నుల నిష్పత్తి అతి తక్కువగా ఉన్న దేశాలలో భారతదేశం ఒకటిగా ఉంది.కేంద్రం,రాష్ట్రాలు కలిపి జి.డి.పి.లో 14 శాతం మాత్రమే పన్నులుగా వసూలు చేస్తున్నాయి.ఈమొత్తం కార్యక్రమాన్ని అదనంగా విధించే పన్నుల వసూలు ద్వారా వచ్చే ఆదాయంతోనే నిర్వహించాలంటే ,జి.డి.పి.,పన్నుల నిష్పత్తి 24 శాతానికి ,అమెరికాలో ఉన్న స్థాయికి పెంచాలి.అమెరికాలో జి.డి.పి.,పన్నుల నిష్పత్తి సుమారుగా 24 శాతంగా ఉంది.దేశంలో ఆర్థిక,సామాజిక రంగాలలో పెనుమార్పులు తీసుకురావాలంటే,దేశంలో పన్ను, జి.డి.పి. నిష్పత్తిని ప్రపంచంలోనే శక్తివంతమైన పెట్టుబడిదారీ దేశమైన అమెరికాలో ఉన్న స్థాయికి పన్నులను పెంచితే సరిపోతుంది.

నయా సరళీకరణ విధానాల చట్రంలో దీనిని అంత సులభంగా సాధించగలమనే భ్రమల్లో ఉండరాదు. అందుకు భిన్నంగా అటువంటి కార్యక్రమాన్ని ప్రారంభించాలంటే అనేక ఇతర మార్పులను కూడా ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమాన్ని కార్పొరేట్,ద్రవ్య పెట్టుబడి గుత్తాధిపతులు,వీరితో సన్నిహిత సంబంధాలున్న అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిదారులు తీవ్రంగా వ్యతిరేకిస్తారు.వారి అసంతృప్తి దేశంనుండి పెట్టుబడులు తరలిపోవటానికి దారితీస్తుంది

(మిగతా 34వ పేజీలో)

# ప్రపంచీకరణ సంస్కృతి- స్థానిక విలువలు



**నీలాంజన గుప్తా**

ప్రపంచీ కరణ అనే పదం హఠాత్తుగా ఇవాళ పండిత చర్చలలోకి, ప్రజావేదికల మీదకువచ్చింది. 'ప్రపంచీకరణ' మీద ఇవాళ అనేక పుస్తకాలు వస్తున్నాయి. లెక్కలేనన్ని సెమినార్లు జరుగుతున్నాయి. దిన-వార పత్రికలలో లెక్కకుమిక్కుటంగా వార్తలు, వింతలు, విశేషాలు ప్రచురితం అవుతున్నాయి. 'ప్రపంచీకరణ' మీద ఎందుకింత ఆసక్తి? ఎందుకంటే - పబ్లికున గానీ, ప్రైవేటుగా గానీ ఇది మన జీవితాలపై ఎలాంటి ప్రభావం చూపనుంది? దీన్ని ఎట్లా ఎదుర్కోవాలి అనేది అర్థం చేసుకోవడానికి మనం పడే తంటాలే ప్రపంచీకరణను తాజా అంశంగా నిలిపి ఉంచుతుంది. ప్రపంచీకరణ నిర్వచనాన్ని, దాని గుణగణాల్ని అర్థం చేసుకోవ డానికి - వ్యక్తులుగా, ఈ సమాజంలో పౌరులుగా, విశ్వమానవుడిగా - విద్యావేత్తలకు అర్జంటుగా మరో పుస్తకం రావాల్సిందే.

ప్రపంచీకరణ అనే పదం ఇవాళ తారక మంత్రంలా అందరి నోళ్ళలో నానుతున్నది. ఐతే ఒక్కోళ్ళూ ఒక్కో అర్థంలో మాట్లాడుతున్నారు. ఒక సుప్రసిద్ధ ఆర్థికవేత్త ఏం చెబుతున్నాడంటే - "భారతదేశానికి సంబంధించినంత వరకు ప్రపంచీకరణ, ఉదారవాద విధానాలు, ప్రైవేటీకరణ, ఈ మూడూ ఒక ప్యాకేజిగా వచ్చాయి. అందుకే సైద్ధాంతిక రీత్యా మాట్లాడాల్సి వచ్చినా విషయాలన్నీ కలగాపులగం అయిపోతున్నాయి". ఇంకోవాదన ఏమిటంటే- "ప్రపంచీకరణ ఇవాళ కొత్తదేం కాదు. కొన్ని శతాబ్దాలకు పూర్వమే అంతర్జాతీయ వాణిజ్య వర్తకాలు జరిగిన దాఖలాలు మనముందున్నాయి. వలసవాదం, అంతర్జాతీయకరణ... ఇలా పేరు ఏదైనప్పటికీ వివిధ దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు మన పూర్వుల కాలం నుండి నడుస్తూనే ఉన్నాయి".

ఈ రెండు వాదనల సంగతేమో గానీ, నా వరకు నాకు ఏమనిపిస్తుందంటే ప్రపంచీకరణ అనేది కొన్ని నూతన ఆర్థిక, సామాజిక, సైద్ధాంతిక, సంస్థాగత నిర్మాణాలకు సంకేత రూపం. సంస్థాగత విధానాలు, సైద్ధాంతిక అంచనాలు కలిసి వివిధ దశల్లో కొత్త రూపం ఎలా సంతరించుకున్నాయి అనేదానికి నేను మీ ముందు కొన్ని ఉదాహరణలు ఉంచుతాను.

మొదటి అంశం - అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి (గ్లోబల్ ఫైనాన్స్). ఈ ద్రవ్య పెట్టుబడి దేశ కాల సరిహద్దులు లేకుండా, ఈ రంగం ఆ రంగం అని తేడా లేకుండా ఎక్కడికిబడితే అక్కడికి స్వేచ్ఛగా ప్రవేశిస్తుంది. చిటికలో ఒకచోట నుండి మరోచోటుకి తరలిపోతుంది. ఈ అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడుల రాక-పోకల వల్లనే దక్షిణాసియా దేశాల కరెన్సీ విలువ కుప్పకూలిపోయిందని ఆర్థికవేత్తలు చెబుతున్నారు.

అలాగే బహుళజాతి గుత్త సంస్థలు. నేను వీటిలో పెద్దపెద్ద వాటి గురించి మాట్లాడడం లేదు. రూపర్ట్ మర్డోక్‌కు చెందిన ఒక వార్తా సంస్థ గురించి చెప్పదలుచుకున్నాను. మర్డోక్ ఆధీనంలో హార్పర్ కాలిన్స్ సహా అనేక ముద్రణా సంస్థలు ఉన్నాయి. ట్వంటీయత్ సెంచురీ ఫాక్స్ ప్రొడక్షన్ పేరిట సినిమా నిర్మాణ సంస్థ, లైబ్రరీ ఉన్నాయి. అమెరికాలో ఫాక్స్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషను, యూరప్‌లో శాటిలైట్ బ్రాడ్ కాస్టింగ్ సంస్థలు, ఆసియాలో 'స్టార్ నెట్‌వర్క్', లాటిన్ అమెరికా దేశాల్లో వార్తా ఛానళ్ళు, పిల్లలకు ఉద్దేశించిన టీవీ ఛానళ్ళు ఉన్నాయి. ఈ సంస్థ స్వంతానికి ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ టీమ్‌లు ఉన్నాయి. అమెరికాలో బహుళజనాదరణ పొంది ఉన్న 'నేషనల్ ఫుట్‌బాల్ లీగ్'లో 49 శాతం వాటాలు ఉన్నాయి. చైనాలో ఇంటర్నెట్ సేవలు అందిస్తుంది. 'పీపుల్స్ డైలీ' పత్రికా ప్రచురణలో సహభాగస్వామి కూడా. ఈ లిస్టు ఇక్కడితో అయిపోలేదు. స్థలాభావం, సమయాభావం వలన కొండవీటి చాంతాడంత లిస్టు మొత్తం విప్పి మీకు చెప్పటంలేదు.

ఇక 'సోని' అనే మరో బహుళజాతి గుత్త సంస్థను తీసుకోండి. ఇది హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ రెండు రంగాలలో ఉత్పత్తి, పంపిణీలు రెండింటినీ చేతుల్లో ఉంచుకుని ప్రపంచాన్ని ఏలుతున్నది. 'సోని' టెలివిజన్ వంటి ఎలక్ట్రానిక్ ఉత్పత్తులలో పాటు సాఫ్ట్‌వేర్ రంగంలో కూడా పాతుకుపోయింది. 'సోని మ్యూజిక్' కార్పొరేషన్ ఒక్కటే

---

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**
'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక,
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

> **❝ ద్రవ్య పెట్టుబడి సంచయంతో కొత్తకొత్త పని పద్ధతులు రంగంలోకి వచ్చేశాక 'ప్రపంచ దేశాలు' అనే సమకాలీన పదానికున్న సాంప్రదాయిక అర్ధమే మారిపోయింది. మొదటి ప్రపంచదేశాలు, రెండో, మూడో ప్రపంచదేశాలు అనే సూత్రీకరణ నిరర్ధకంగా మారిపోయింది. ప్రపంచాన్నే ఓ కుగ్రామంగా మార్చేసిన ప్రపంచీ కరణ విధానాలు రాజకీయంగా దేశాల మధ్య ఉన్న విభజనను చెరిపేసినా అసమానతలు, దరిద్రం, సాధికారతలేమి వంటి సామాజిక వ్యత్యాసాలను మాత్రం తొలగించలేకపోయింది. ❞**

సోని సంస్థ లాభాల్లో సగభాగాన్ని ఆర్జించి పెడుతుంది. కొలంబియా పిక్చర్స్ అనే సినిమా నిర్మాణ సంస్థా ఈ కంపెనీదే. వీడియోగేమ్స్ ప్రపంచ మార్కెట్‌లో నాలుగింట మూడువంతులు ఈ కంపెనీదే. ఆసియా, ఐరోపా, ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా, చివరికి మన భారతదేశంలో కూడా సోని టెలివిజన్ నెట్‌వర్క్ నడుస్తున్నది.

ఇలాంటిదే జనరల్ ఎలక్ట్రానిక్ కంపెనీ కథ. ఎలక్ట్రానిక్స్ పరికరాలు, వస్తువుల తయారీతో పాటు, అమెరికా సహా అనేక ప్రపంచ దేశాల్లో టీవీ ఛానళ్ళు నడుపుతుంది. అనేక ప్రచురణ సంస్థలు దీని ఆధీనంలో ఉన్నాయి. ఈ కంపెనీయే 'డిస్కవరీ ఛానల్' కూడా నడుపుతున్నది.

ఇలాంటి బహుళజాతి కార్పొరేషన్లకు ఏదో ఒక దేశంలో ప్రధాన కార్యాలయం ఉండాల్సిన అవసరమే లేదు. వీటిని దేశాంతర, ఖండాంతర (ఓవర్సీస్, కాంటినెంటల్) కంపెనీలు అని చెప్పడమంటే చిన్నబుచ్చడమే. అచ్చంగా ఇవి గ్లోబల్ కంపెనీలు, ప్రపంచ దేశాలన్నింటా వేళ్ళూనుకున్న సంస్థలు.

ప్రపంచీకరణకు సంబంధించిన మరో విశేషం ఏమిటంటే – ఉత్పత్తి ప్రపంచ వ్యాపితంగా ఉంటుంది. ఎటి&టి అనే కంపెనీ ఇందుకు ఒక ఉదాహరణ. మొదట్లో ఈ కార్పొరేట్ సంస్థ అమెరికా ప్రధాన కేంద్రంగా పని చేసింది. కాని గత ఇరవై ఏళ్ళలో దీని రూపురేఖలే మారిపోయాయి. మొదట్లో ఈ కంపెనీ ఉత్పత్తులను అమెరికాలో చవకగా కార్మికశక్తి లభించే లూసియానా రాష్ట్రంలోని చిన్నచిన్న కంపెనీలు నిర్వహించేవి. 1980వ దశకంలో అక్కడికన్నా సింగపూర్‌లో ఇంకా చవకగా ఉత్పత్తి చేసే అవకాశాలు కనిపించడంతో అక్కడికి మారి పోయింది. 90వ దశకం నాటికి సింగపూర్‌లో ఉత్పత్తి నిర్వహణా వ్యయం ప్రియంగా అనిపించి అక్కడనుండి ఇంకా చౌకయిన చోటుకి – థాయిలాండ్‌కు ప్రయాణం కట్టింది. ఇంతకన్నా చౌకగా రేపు ఏ భారత దేశంలోనో, బంగ్లాదేశ్‌లోనో గిట్టుబాటు అవుతుందనుకుంటే అక్కడికి బిచాణాఎత్తేస్తుంది. ఈ కంపెనీ చేతుల్లో ఉన్న అపారమైన ద్రవ్య పెట్టుబడి వల్ల దానికాశక్తి వచ్చింది. ఉత్పత్తి క్రమాన్ని ప్రపంచంలో ఎక్కడికంటే అక్కడికి తరలిస్తుంది. నైక్, రీబక్, ఆట వస్తువుల తయారీ కంపెనీలు, కార్ల ఫ్యాక్టరీలు, పుస్తక ప్రచురణా యాలు – వీటిన్నింటిదీ ఇదే దారి.

భారతదేశానికి ఇబ్బంది కలిగించే మరో అంశం – సేవారంగ ప్రపంచీకరణ. ఇప్పుడు మనం చవిచూస్తోంది ఆవగింజంతే. డబ్ల్యూటీఓ ఒప్పందాల ఫలితంగా సేవలరంగంలో పెను మార్పులు సంభవించనున్నాయి. ఇంతకుముందు మనం చెప్పుకున్నట్లే వస్తూత్పత్తి రంగమే కాకుండా ఇప్పుడు సేవల రంగం కూడా నిలకడగా ఒక దేశంలో కాలూనుకుని ఉండడానికి సిద్ధంగా లేదు. కొల్‌కత్తా నగరంలో ఇప్పుడు చాలా చోట్ల మెడికల్ ట్రాన్స్క్రిప్షన్‌కి సంబంధించిన ప్రకటనల హోర్డింగ్‌లు మనకు కనబడుతున్నాయి. అమెరికన్ కంపెనీలకు, అమెరికన్ ఆసుపత్రులకు చౌకగా 'ఈ' సేవలు అందించడానికి ఇప్పుడు మనం తయారుగా ఉన్నామన్నమాట. విమానయాన కంపెనీలు కూడా వాటి 'డేటాప్రాసెసింగ్' పనులను భారతదేశానికి తరలిస్తున్నాయి.

ఇలా ద్రవ్య పెట్టుబడి సంచయంతో కొత్తకొత్త పని పద్ధతులు రంగంలోకి వచ్చేశాక ప్రపంచ దేశాలు అనే సమకాలీన పదానికి ఉన్నసాంప్రదాయిక అర్థమే మారిపోయింది. మొదటి ప్రపంచదేశాలు, రెండో ప్రపంచదేశాలు, మూడో ప్రపంచదేశాలు అనే సూత్రీకరణ నిరర్ధకంగా మారిపోయింది. ప్రపంచాన్నే ఓ కుగ్రామంగా మార్చేసిన ప్రపంచీకరణ విధానాలు రాజకీయంగా దేశాల మధ్య ఉన్న విభజనను చెరిపేసినా అసమానతలు, దరిద్రం, సాధికారతలేమి వంటి సామాజిక వ్యత్యాసాలను మాత్రం తొలగించలేకపోయింది. ఇంకా సరళంగా చెప్పుకోవాలంటే ధనిక–పేద దేశాలు అనేవి ఈ ప్రపంచపటంలో నిర్దిష్ట ప్రాంతాలకే పరిమితమై లేవు. ధనిక–పేద తారతమ్యం సర్వే సర్వత్రా వ్యాపించి ఉంది. అపరకుబేరులు అవతరిస్తున్న ప్రతిచోటా నిర్భాగ్యులను ఆవిష్కరిస్తూనే ఉన్నారు. ఇప్పుడు ధనిక దేశాల్లో కూడా దరిద్రదీవులు పెరిగిపోతున్నాయి. పెట్టుబడులకు, సమాచార సాంకేతిక రంగానికి చెందిన కార్మికులకు చలనశీలత (మొబిలిటీ) వచ్చింది. ఐ.టి. నిపుణులు, బహుళజాతి కార్పొరేషన్ల మేనేజర్ల కాళ్ళకు రెక్కలు మొలిచాయి, కానీ రెక్కల కష్టం చేసే కార్మికులు మాత్రం గండ శిలల్లా పడి ఉండాల్సి వస్తుంది. ఒకప్పుడు అమెరికా దేశ నిర్మాణంలో వలస కార్మికులు ఎంతటి ప్రముఖపాత్ర పోషించారో హిమానీ బెనర్జీ విపులంగా వివరించారు. ఐతే ఇవాళ కార్మికుల వలసలకు బదులు 'సేవలు' వలస వస్తున్నాయి.

ఇంతకు ముందు మనం చెప్పుకున్నట్లే ప్రపంచీకరణ విధానాల వల్ల జాతిరాజ్యాలు, రాజకీయ సరిహద్దులు, భౌగోళిక ఉనికి, ప్రాంతీయత – వీటన్నింటి సంప్రదాయక నిర్వచనాలు మారిపోయాయి. ధనిక–పేద దేశాల మధ్య సంబంధాల్లో మార్పులు వచ్చాయి. కానీ వర్గ సంఘర్షణ మాత్రం సమసిపోలేదు. అసలు ప్రపంచీకరణ విధానాలే వర్గ విభాజకాలని మనం గుర్తించాలి. ఇవాళ 'వర్గం' అంటే ఏదో ఒక జాతి రాజ్యానికే పరిమితం కాలేదు. 'వర్గం' ఇవాళ అంతర్జాతీయత సంతరించుకుంది. వర్గాలు ఇవాళ అంతర్జాతీయ కూటములుగా ఏర్పడుతున్నాయి. 'అమియబాగ్చి' చెప్పినట్లు అపర దోపిడీరాయుళ్ళంతా ఇవాళ అంతర్జాతీయంగా ఒక కూటమిగా ఏర్పడ్డారు. అంబానీలు, హిందూజాలు భారతీయ పెట్టుబడిదారులే కానీ వీళ్ళు కూడా ఇవాళ గ్లోబల్ పారిశ్రామికవేత్తల సరసకు చేరుకున్నారు. దోపిడిరాయుళ్ళంతా ప్రపంచం నలుదిక్కులా ఉన్నట్లే దోపిడికి గురయ్యే పేదలు, శ్రమ జీవులు కూడా విశ్వవ్యాప్తంగా ఉన్నారు. అభివృద్ధి చెందిన ధనిక దేశాల్లో కూడా దోపిడికి బలయ్యే వర్గ ప్రజానీకం ఉన్నారు. వర్ధమాన దేశాలు, ధనిక దేశాల్లోని ఈ వర్గానికి చెందిన ప్రజానీకం మరింతగా ఐక్యం కావల్సిన పరిస్థితి ఈనాడు నెలకొని ఉంది.


ప్రపంచీకరణ విధానాలే వర్గ ప్రయోజనాలతో కూడుకున్నవి. కాబట్టి ఉత్పత్తి సంబంధాలు, సేవలు, నైతిక విలువలు, మంచి చెడులు, అవసరాలు – విలాసాలూ – వీటన్నింటిలోనూ 'వర్గ' ప్రాతిపదికన మార్పులు చోటు చేసుకున్నాయి. ఫలితంగా ప్రజల జీవన సరళి, ఆలోచనా క్రమంలో కూడా ఈ మార్పుల ప్రభావం పడుతుంది. ప్రపంచీకరణ విధానాల ఫలితంగా వస్తున్న ప్రయోజనాలను స్వంతం చేసుకోవడానికి

కొంత మంది తహతహలాడుతుంటే, దాని ప్రతికూలప్రభావాలను తిప్పికొట్టడానికీ ఇంతకు రెండింతల పెనుగులాట చోటుచేసుకుంటున్నది. కొన్ని తరగతులకు చెందిన ప్రజానీకం ప్రపంచీకరణ విధానాల ఫలితాలను అందు కోవడంలో తాము వెలికి గురయ్యామనే అభిప్రాయంతో ఉన్నారు. ఇలా 'మినహాయింపు'కు గురయ్యామనే భావన ఏర్పడడానికి ఆయా తరగతుల ప్రజానీకం నిస్సహాయతే కారణం కావచ్చు.

ఈ నిస్సహాయత సహేతుకమే. ప్రపంచీకరణ విధానాలు పేదరికాన్ని రూపుమాపడానికి బదులు పేదలను పెడదారిపట్టించే సైద్ధాంతిక తాత్వికతను సంతరించుకున్నాయి. ఇదేదో కక్ష కొద్దీ అంటున్న మాటలు కావు. 'ఎకనమిస్టు' పత్రికలో ఎయిడ్స్ పరిశోధనల మీద చేస్తున్న నిధుల ఖర్చు గురించి ఒక చర్చ నడిచింది. అందులో ప్రపంచ బ్యాంకు ప్రతినిధి ఏమని వ్రాశాడో చదవండి – "పేద దేశాల్లోని పేద ప్రజానీకం మీద ఎయిడ్స్ కోరలు చాచిందంటే వాళ్ళకు మరణం తప్ప శరణ్యంలేదు. ఫలితంగా ఆయా దేశాల ఆర్థికాభివృద్ధి మీద ఈ మానవ వనరుల నష్టం ప్రతికూల ప్రభావం చూపించకమానదు". ఇదీ ఆయనగారి వరస. పేదల మరణాలకన్నా దేశ ఆర్థికాభివృద్ధి మీదపడే ప్రతికూల ప్రభావం గురించే వీరికి బెంగ అంది.

అసలు ప్రజలలో 'మినహాయింపుకు' గురయ్యామనే భావన బలీయంగా ఏర్పడటానికి, ఇందుకు కారణమైన నిస్సహాయతకు గురవడానికి మూలాలు ప్రపంచీకరణ విధానాలలోనే ఉన్నాయి. ప్రపంచీకరణది వస్తువినిమయ సంస్కృతి. మనం ఏం తింటున్నాం, ఏం కట్టు కుట్టున్నాం, ఏం కొంటున్నాం, ఎలా గడుపుతున్నాం – ఈ అంశాలను బట్టే మన ఉనికి, ప్రతిష్ట, సాంఘికహోదా ఇవన్నీ నిర్ణయించబడే సంస్కృతి ప్రపంచీకరణ విధానాలది. చేతినిండా డబ్బు ఉంటేనే ప్రపంచీకరణ సంస్కృతిలో సభ్యత్వం లభిస్తుంది. మరి 'లేని' వాళ్ళ సంగతి? వీరంతా గుమ్మానికి ఈవల ఉండిపోవాల్సిందే. అదీ ప్రపంచీకరణ సంస్కృతి ప్రజలను విభజించేతీరు. సంస్కృతీ సంప్రదాయాలంటే మనకు తెలిసిన అర్థం మారిపోయింది ఈనాడు. ప్రపంచీకరణ నిర్వచనం ప్రకారం మన జీవనశైలే మన సంస్కృతి. శాటిలైట్ టెలివిజన్ ఛానళ్ళన్నీ రోజూ మన మీద ఈ సంస్కృతినే కుమ్మరిస్తున్నాయి. 'అలయంజ్' కంపెనీ టీవీల్లో ఇచ్చే ప్రకటన మీరు చూశారా? అందులో రాయంచలాంటి విదేశీ కారులోంచి ఒకతను తన కూతుర్ని ఒక సువిశాల భవంతి ముంగిట దిగవిడుస్తాడు. ఇందులో స్థల, కాల, దేశ 'సంకేతాలు' ఉండవు. అతను భారతీయుడో, విదేశీయుడో మీరు కనిపెట్టలేరు. ఈ విదేశీ కారు ప్రయాణం విమాన ప్రయాణాన్ని తలపించేలా – 'మాంటేజ్ దృశ్యం'గా దిగంతాల్లో దూసుకుపోతున్న ఒక విమానాన్ని చూపించడంతో ఈ అడ్వర్టయిజ్‌మెంట్ ముగుస్తుంది. డబ్బు, విలాసం, సౌకర్యం – ఇవి తప్ప మరో జీవిత నిర్వచనం మీకీ 'యాడ్'లో కనబడదు (చివరాకరికి ఆ పాప తల్లి కూడా ఈ ప్రకటనలో మీకు కనిపించదు). ఇలాంటి జీవన సంస్కృతి భారతదేశంలో ఎంతమంది అనుభవిస్తున్నారు. ఆధునిక జీవనశైలిని ఆవిష్కరించే ఈ ప్రకటన చూసి ఎంతమంది పరవశించి, పలవరిస్తారూ? కల లోనైనా ఇలాంటి భాగ్యం దక్కేనా అని ఎంత మంది నిట్టూరుస్తారు? – ఇదిగో ఇదే 'ప్రపంచీకరణ సంస్కృతి' విభాజకం. అలాంటి విలాస సౌకర్యాలను అనుభవించే వాళ్ళు అనుభవిస్తుంటే, అవి దక్కనివాళ్ళు, దక్కించుకోలేనివాళ్ళు ఈసురోమనో, నిష్టురాలు పోయో, శాపనార్థాలుపెట్టో కడుపుమంట వెళ్ళగక్కుతారు. మాయదారి కాలం వచ్చి పడింది, ఏం మెరమెచ్చుల జీవితాలో? మా కాలంలో ఇలా ఉండేదా? అని వగచి చివరికి ఆత్మసంతృప్తి కోసం మతవిశ్వాసాలూ, సాంప్రదాయాలను ఆలంబనగా చేసుకుంటారు. వస్తువినిమయ సంస్కృతికి ప్రత్యామ్నాయంగా మత సంస్కృతులు ముందుకు వస్తాయి. ఇదీ ప్రపంచీకరణ విధానాల విషమ పర్యవసానం.

❝ ప్రపంచీకరణ ప్రోది చేస్తున్న వస్తువినిమయ సంస్కృతికి దూరంగా ఉండటమంటే మతవిశ్వాసాలకు దగ్గరగా జరగడమే అని అభిప్రాయానికి ప్రజానీకం లోనవుతున్నారు. ఏతావాతా మనం అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే - ప్రపంచీకరణ సంస్కృతిని తిప్పికొట్టే పేరిట జనాల్ని మతవిశ్వాసాల వైపుకు మళ్ళించే ప్రక్రియ ప్రపంచ వ్యాప్తంగా చోటు చేసుకుంటున్నది. ఇందుకు భారతదేశం మినహాయింపు కాదు. ❞




రూపర్ట్ మర్డోక్ ట్వెంటీయత్ సెంచరీ ఫాక్స్

ఇదేదో మనదేశానికి మాత్రమే పట్టిన పీడకాదు. ప్రఖ్యాత లాటిన్ అమెరికా విమర్శకుడు మార్టిన్ బార్బెరో కూడా ఆ దేశాల్లో జరుగుతున్న ఇలాంటి పరిణామాల గురించే వ్రాశాడు. 'మూలాల్లో'కి పోవటం పేరిట అక్కడ కూడా జరుగుతుంది ఇదే తంతు. ప్రపంచీకరణ ప్రోది చేస్తున్న వస్తువినిమయ సంస్కృతికి దూరంగా ఉండటమంటే మతవిశ్వాసాలకు దగ్గరగా జరగడమే అని అభిప్రాయానికి ప్రజానీకం లోనవుతున్నారు. ఏతావాతా మనం అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే – ప్రపంచీకరణ సంస్కృతిని తిప్పికొట్టే పేరిట జనాల్ని మతవిశ్వాసాల వైపుకు మళ్ళించే ప్రక్రియ ప్రపంచ వ్యాప్తంగా చోటు చేసుకుంటున్నది. ఇందుకు భారతదేశం మినహాయింపు కాదు.

ఇంకో తరగతి సిద్ధాంతకర్తలేమో ప్రపంచీకరణ వల్ల అనివార్యంగా ప్రాంతీయత, స్థానికత అంశాలు ప్రజలకు ఆలంబనగా నిలుస్తాయి అని వాదిస్తున్నారు. భారత్‌వంటి వర్ధమాన దేశాల్లోనే కాదు యూరప్‌లో కూడా ఇలాంటి వాదనలే ముందుకు వచ్చాయి. "సాంస్కృతిక ప్రపంచీకరణకు విరుగుడుగా ప్రాంతీయ అస్థిత్వాలు వెల్లువలా ముందుకు వస్తాయి. ప్రజాజీవిత అర్థపరమార్థాలను ప్రపంచీకరణ విధానాలు తుడిచి పెట్టేశాయి. వీటి పునరుద్ధరణ కోసం యూరప్ ఇవాళ స్థానిక మూలాలవైపుకు పయనిస్తోంది" అని 1990వ దశకంలోనే డేవిడ్‌మోర్లీ–కెవిన్‌రాబిన్స్‌లు తమ పుస్తకంలో

> **“ప్రపంచీకరణ సంవిధానంలో మినహాయింపుకు గురవుతున్న, గురైన ప్రజానీకానికి రకరకాల సిద్ధాంతకర్తలు రకరకాల నామకరణాలు చేశారు. ప్రపంచమనే కుగ్రామంలో మినహాయింపుకు గురైన తరగతుల ప్రజానీకాన్ని గిరిజనులుగా సరిపోల్చారు. ఈ నయా-అనాగరికులు నాగరికత సంతరించుకోనంత కాలం ప్రపంచ మార్కెట్లలో వీరు ఇమడలేరు. వాటికి వీరి అవసరం ఉండదు అని సూత్రీకరించారు.”**

పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన ధనిక దేశాల్లో కూడా ప్రపంచీకరణకు పోటీగా స్థానిక సంస్కృతులు స్పందించడం మనం చూడవచ్చు.

ప్రపంచీకరణ సంవిధానంలో మినహాయింపుకు గురవుతున్న, గురైన ప్రజానీకానికి రకరకాల సిద్ధాంతకర్తలు రకరకాల నామకరణాలు చేశారు. ప్రపంచమనే కుగ్రామంలో మినహాయింపుకు గురైన తరగతుల ప్రజానీకాన్ని గిరిజనులుగా సరిపోల్చారు. ఈ నయా–అనాగరికులు నాగరికత సంతరించుకోనంత కాలం ప్రపంచ మార్కెట్లలో వీరు ఇమడలేరు. వాటికి వీరి అవసరం ఉండదు అని సూత్రీకరించారు. ఒక్కమాటలో చెప్పాలంటే – ప్రపంచీకరణ విధా నాలు ఎగదోసే అంతర్జాతీయ వినిమయ సంస్కృతిలో వీరు భాగస్వాములు కారు, కాలేరు అనేదే ఈ సిద్ధాంతకర్తల ఉవాచ.

ఇప్పుడు మనముందు రెండు రకాల సాంస్కృతిక ఉత్పత్తులు ఉన్నాయి. ఒకటి ప్రపంచీకరణ సంస్కృతి. రెండు స్థానిక సంస్కృతి లేదా ప్రత్యామ్నాయ సంస్కృతి. ప్రపంచీకరణ సంస్కృతిని తెగనాడే పేరిట బెంగాల్ కమర్షియల్ సినిమారంగం ప్రోది చేస్తున్న స్థానిక, సంప్రదాయిక విలువల గురించి ఇప్పుడు నేను చెప్పదలుచుకున్నాను.

బెంగాల్ కమర్షియల్ సినిమాలకు ప్రేక్షక మహారాజులు ఆర్థికంగా అణగారిన ప్రజానీకమే. మధ్య తరగతి ప్రజానీకం ఎందుకో ఈ సినిమాలకు దూరంగా ఉంటారు. ఈ సినిమాలన్నీ గ్రామీణ తరగతి ప్రేక్షకుల కోసం తీశాం అని చెబుతుంటారు. కానీ ఇవన్నీ ఆడేది కొల్‌కతాలోనే, అదీ వారాల తరబడి. నా దృష్టిలో బెంగాల్ కమర్షియల్ సినిమా గ్రామీణ – పట్టణ అన్న ప్రాంతాలవారీ తరగతిగా కాకుండా క్లాసు–మాస్ అన్న దృష్టితో తీస్తున్నారు. దాదాపు ఈ సిన్మాలన్నీ – కనీసం నే చూసినవన్నీ – మూసపోసినట్టు ఎవరో, ఏదో ఒక గ్లోబల్ శక్తికి వ్యతిరేకంగా స్థానికశక్తిని ఎదురుగా బెట్టి (అంటే షోకిల్లారాయుడికి పల్లెటూరి బ్రతుకి పోటీ పెట్టినట్లు) చివరికి విలువల రీత్యా స్థానిక సాంప్రదాయాలే పై చెయ్యి సాధించినట్లు చూపిస్తారు.

సుధారతి ఇంటర్నేషనల్ నిర్మాణంలో నితిష్ రే దర్శకత్వం వహించిన ‘ఏక్ పస్లాబ్రిష్టి’ అనే సినిమా (1991) గురించి నేనిక్కడ ప్రత్యేకంగా ప్రస్తావించ దలుచుకున్నాను. ఈ మెయిన్ స్ట్రీం కమర్షియల్ సినిమా కథ టూకీగా మీకు వివరిస్తాను.

సౌమిత్రా ఛటర్జీ ఒక మధ్యతరగతి తండ్రి. ప్రసేన్ జిత్ మన హీరో – ఈ తండ్రికి ఒక్కగానొక్క కొడుకు. బుద్ధిగా చదివి స్కాలర్ షిప్ తెచ్చుకుంటాడు. స్కూలు చదువు పూర్తయ్యాక ‘నాన్నా నేనింకా పై చదువులు చదవను నీలాగే ఆటో ఫ్యాక్టరీలో పనిచేస్తా ఈ ఇంటి బరువు బాధ్యతలు మోస్తా’ అని చెబుతాడు. అలాకాదు బాబూ నువ్వయినా బాగా చదివి పైకి రావాలని తండ్రి చెబుతాడు. చివరికి రాజీమార్గంగా మన హీరో పనిచేస్తూ చదువుకుంటానని రాయల్ హోటల్‌లో పనికి కుదురుకుంటాడు. ఇక ఈ హోటల్ పని దృశ్యాల చిత్రీకరణలో డబ్బుగలవారు ఎంత డాబుగా, ఎంతపొగరుగా ఉంటారో చూపిస్తుంటారు. సీన్లమీద సీన్లు. మన హీరోకి వీళ్ళ చేతుల్లో అనేక అవమానాలు. ఐనా అన్నీ దిగమింగి నిజాయితీగా పని చేస్తుంటాడు. ఈ నిజాయితీ వల్ల చివరికి గూండాల చేతుల్లో తన్నులు కూడా తింటాడు.

ఒకసారి పెళ్ళి విందుకు కిరాయికి కుదురుకుంటాడు. అదిగో ఆ పెళ్ళి వేడుకల్లో మన హీరోయిన్ రీతూదాస్ ‘ఎంటర్’ అవుతుంది. మన హీరోయిన్ బెంగాలీ సినిమాల్లో నటించే అవకాశాల కోసం అమెరికా నుండి వచ్చిన అమ్మడన్నమాట. చేతిలో కెమెరాతో దర్శనమిస్తుంది. (ఏంట్విస్టో చూడండి. తను నటించేదే కెమెరా ముందు. ఐనా కెమెరాతో సిన్మా కథలోకి ఎంట్రన్సు). హీరోయిన్ అన్నాక, అందులోనూ అమెరికా నుండి వచ్చింది కనుక టిప్‌టాప్‌గా ఉంటుంది. పెళ్ళికొచ్చిన ప్రతివాళ్ళ చూపులూ మన హీరోయిన్ మీదే. జనాలు తన కోసం అలాపడి చావడం అమ్మడికి గర్వంగా తోస్తుంది. పొగరుగా వ్యవహరిస్తుంటుంది. మగాళ్ళంతా హీరోయిన్ కోసం కళ్ళప్పగించి చూసే క్రమంలోనే కామెడీ సీన్లు పండించడం, సంప్రదాయ విలువలు ఆవిష్కరించడం చేశారు. పెళ్ళి విందు వడ్డించే క్రమంలో వడ్డించే వాళ్ళంతా మన హీరోయిన్ దగ్గరే తచ్చాడుతుంటారు. ఇంతలో ఒక ముసలాయన – ఏమయిందర్రా అబ్బాయిలూ నా ఆకులో ఒక్కడు వడ్డించడే అని అడగడం. ఆ వెంటనే మన ప్రసేన్‌జిత్ ఆ పెద్దాయన దగ్గరకి వెళ్ళి క్షమించమని అడగడం, పెద్దరికాన్ని గౌరవించడం చేస్తాడు. మిగతా కుర్రాళ్ళకన్నా తనలోనే సంప్రదాయ విలువలు మూర్తీభవించి ఉన్నాయని రుజువు చేసుకోవడానికా అన్నట్లు ‘ఏరా దేభ్యం మొహాల్లారా. మొహానికి రంగుపులుముకున్న ఆడదాని మొహం ఎరగరా’అని మిగిలిన కుర్రాళ్ళని కేకలేసి ముసలాయనకి స్వయంగా వడ్డిస్తాడు. అలా పెద్దల మన్నన పొందుతాడు. రెండో వంకన సంప్రదాయబద్ధంగా ఉండాల్సిన ఆడపిల్లకు ఉండాల్సిన లక్షణాలేవీ హీరోయిన్‌లో లేవని ఎత్తిపొడుస్తాడు. సమాజాన్ని లెక్క చెయ్యకుండా నేను’ అన్న అహాన్ని ప్రదర్శిస్తున్న హీరోయిన్ తెంపరితనాన్ని ఈసడిస్తాడు. ఇక్కడికిది అయిపోయిందా! ఆ తర్వాత పెళ్ళి తంతు సీను. పెళ్ళికూతురు, పెళ్ళి కొడుకు కుటుంబాలు, స్నేహితులు, చుట్టాలు పక్కాలతో తెల్లార్లూ జాగారం చెయ్యాలి. ఎలా గడపాలి అని చర్చవస్తే ‘అంత్యాక్షరి’ పాటల పోటీ పెట్టుకుందాం గెలిచిన వాళ్ళకి పెళ్ళి కొడుకు రూ॥500ల బహుమానం ఇస్తాడు అని ప్రకటిస్తారు. పోటీ మొదలవుతుంది. ఆడవాళ్ళు తాజా హిందీ పాటలు పాడుతుంటే మగవాళ్ళు పాత బెంగాలీ పాటలుపాడుతుంటారు. మధ్యలో ఒకతను “ఏం మీరూ మధురమైన మన బెంగాలీ పాటలు పాడలేరా’ అని ఆడవాళ్ళను రెట్టిస్తాడు. దాంతో ఆడవాళ్ళు కూడా ఆ పాత మధుర బెంగాలీ గీతాలు ఆలపిస్తారు. ఇదిగో ఇలా ‘మన బెంగాలీ పాటలు’ అనే సర్వోత్తమ సాంస్కృతిక వారసత్వాన్ని మనముందు ఆవిష్కరిస్తారు. నిజమే సంప్రదాయిక సందర్భాలలో కవీంద్రుడు రవీంద్రుని సంగీతాన్ని పాడుకోవడం బాగానే ఉంటుంది. అది మన బెంగాలీ సంస్కృతి. కాని ఈ సంస్కృతి చదువుకున్న మధ్య తరగతి బెంగాలీ ప్రజానీకానికే పరిమితం అయిపోయింది. నిజానికి రవీంద్రుని సంగీతం అవసరపడేది సత్యజిత్‌రే ‘శాఖా పశాఖా’,

అపర్ణాసేన్ 'పరోమితర్ ఏక్ దిన్', గౌతమ్ ఘోష్ 'పెక్కా' వంటి సినిమాలకు మాత్రమే. ఈ తరహా సినిమాల వీక్షకులు చదువుకున్న మధ్యతరగతి బెంగాలీ ప్రజానీకమే తప్ప 'మినహాయింపు'కు గురయిన ప్రజానీకం కాదు.

హిందీ సినిమా పాటలను తేలికగా తీసిపారెయ్యడమే ఈ సినిమాలో చూపారు. సినిమా పండితులు ఏం చెబుతారంటే హిందీ సినిమాలు 'జాతీయ సంస్కృతి'ని మహా చక్కగా బోధిస్తాయి అని. అవునో కాదో అనే చర్చను పక్కన బెట్టినా ఇక్కడ మనం గమనించాల్సిన అంశం ఏమిటంటే 'ప్రపంచీకరణ సంస్కృతికి ప్రత్యామ్నాయంగా' స్థానిక సంస్కృతులను నిలబెట్టే క్రమంలో 'జాతీయ' సంస్కృతి పక్కకు నెట్టి వెయ్యబడుతుంది. చూశారా మన బెంగాల్ కమర్షియల్ సిన్మా వాళ్ళు కూడా దీన్నే అందిపుచ్చుకున్నారు.

❝ ఇంకో విషయం ఏంటంటే హీరోయిన్ ఎంత ఆధునికంగా ఉన్నా ఆమెకి ప్రాపంచిక జ్ఞానం ఉండదు మన సినిమాల్లో. హీరో పల్లెటూరి బైతయినా సరే హీరోయిన్ కి కనువిప్పు కలిగించేంత జ్ఞానబోధ చెయ్యగల సత్తా ఉంటుంది. అలాగే మన సినిమాల్లో హీరోయిన్లు మగ దాష్టీకాన్ని ఎదుర్కోలేని నిస్సహాయ అబలగా చూపిస్తారు. ❞



బెంగాలీ సినిమా ఏక్ పోస్లా ప్రిస్తి

సరే మనం ఎక్కడ నుండి ఎక్కడికో వెళుతున్నాం. అంత్యాక్షరి పాటల పోటీల సీను దగ్గర ఉన్నాం కదా. ఈ పోటీ జరుగుతుండగానే మధ్యలో మన హీరో హీరోయిన్ పూర్తి పాశ్చాత్య వేషధారణతో పాడుతూ ఆడుతున్నట్లు ఊహించుకుంటాడు. హీరో కూడా ఊహల్లోనే ఆమెతో జతకూడి పాడతాడు. ఇక హీరో ఆధునిక వస్త్రధారణ జోకర్‌కిమల్లే నవ్వు తెప్పిస్తుంది ఇక పాటల చిత్రీకరణ అంతా విదేశీ నేపథ్యంలోనే. ఈఫిల్‌టవర్ (పారిస్), బిగ్ బెన్ (లండన్), పవన విద్యుత్ యంత్రాలు (ఫ్రాన్స్) – ఇలా సరిహద్దులు లేని అంతర్జాతీయ సాంస్కృతిక చిహ్నాలు మనముందు కదలాడతాయి. ఇక డాన్సుల సంగతి చెప్పనక్కర్లేదు. జఘన విన్యాసాలు, మూర్ఛనలు, కిందా మీదా పడి దొర్లడాలు.

అక్కణ్ణించి సీన్ వేరే అంకంలోకి మారిపోతుంది. తెల్లవారు జామున హీరో, హీరోయిన్‌లు తమ తమ గమ్యాలు చేరుకోవడం కోసం బస్టాండుకి వస్తారు. హీరో హీరోయిన్‌కు అడక్కుండానే సాయం చెయ్యాలని ప్రయత్నించడం, ఆవిడ మొహం చిట్లించడం, ఆ తర్వాత హీరో సాయం కోరందే దిక్కుతోచని పరిస్థితి ఎదురవడం షరా మామూలుగా గడిచిపోతుంది. చివరికి బాత్రూంకి ఎటువెళ్ళాలి అని హీరోయిన్ హీరోను సాయం అడుగుతుంది. దేహబాధ తీర్చుకువచ్చి అసహనంగా ఉన్న హీరోయిన్‌తో 'ఇది అమెరికా కాదు. భారతదేశం ఇక్కడ జీవిత వాస్తవాలు ఇలానే ఉంటాయి' అని చెబుతాడు. తర్వాత హీరోయిన్‌కి దప్పికయి కూల్‌డ్రింక్ తెచ్చిపెట్టమని అడుగుతుంది. బదులుగా కొబ్బరి బోండాం తెచ్చి ఇచ్చిన హీరో మీద రుసరుసలాడుతుంది. మళ్ళీ హీరోగారికి మన సంప్రదాయ పానీయాలు, కోలాలతో వచ్చే చిక్కుల గురించి లెక్చరిచ్చే అవకాశం వచ్చింది.

ఇక ఇక్కడ నుండి సినిమా షరా మామూలు మలుపు తిరుగుతుంది. సినిమా వేషం కోసం ప్రయత్నించే క్రమంలో 'ఆఫర్' ఇస్తానన్న ముసలి డైరెక్టరు ఆమెతో అసభ్యంగా ప్రవర్తించడం, హీరోయిన్ అతన్ని చివాట్లు పెట్టడం. అందుకు బదులుగా అతను 'నువ్వుగానీ సహకరించకపోతే ఈ సిన్మాలో వేషమే కాదు అసలు ఇండస్ట్రీలోనే నీకు అవకాశాలు లేకుండా చేస్తా" అని బెదిరించడం మనం చూస్తాం. అంటే గడపదాటి వచ్చిన ఆడది దేనికయినా సిద్ధపడాలి అనే సామెతను హెచ్చరికగా మరోసారి, మరోసారి వెయ్యినొక్కటోసారి సాధ్వీమణులకు గుర్తుచేస్తారు. పరాయిదేశంతో మన జీవగడ్డను పోల్చి దీని ప్రాశస్త్యం గురించి లెక్చరుదంచిన హీరో ఆడవారికి ఎదురయ్యే ఈ చేదు అనుభవాల గురించి ఎందుకనో మాట మాత్రం అయినా చెప్పడు మరి. పరాయి సంస్కృతి దిక్కుమాలినది, మన సంస్కృతి గొప్పదని హీరోగారు ఆవిష్కరించే క్రమంలో ఇలాంటి దగుల్బాజీ సంస్కృతి ఊసే ఎత్తలేదు.

ఇంకో విషయం ఏంటంటే హీరోయిన్ ఎంత ఆధునికంగా ఉన్నా ఆమెకి ప్రాపంచిక జ్ఞానం ఉండదు మన సినిమాల్లో. హీరో పల్లెటూరి బైతయినా సరే హీరోయిన్‌కి కనువిప్పు కలిగించేంత జ్ఞానబోధ చెయ్యగల సత్తా ఉంటుంది. అలాగే మన సినిమాల్లో హీరోయిన్లు మగదాష్టీకాన్ని ఎదుర్కోలేని నిస్సహాయ అబలగా చూపిస్తారు. హీరోయిన్ శీలాన్ని చెరబట్టే సమయానికి హీరో ప్రసేన్‌జిత్తో, చిరంజిత్తో ఎవరో ఒకరు వచ్చి ఆదుకోవాల్సిందే. పురుషాధిక్య ప్రపంచంలో ఆడదానికి రక్షణగా నిలిచేదీ పురుష పుంగవుడే. ఆ తరువాత హీరోయిన్ పశ్చాత్తాపపడి, చేసిన తప్పు తెలుసుకుని, గడపదాటిన ఆడదానికి ఎన్ని అవమానాలు ఎదురవుతాయో గ్రహించి భద్రజీవితం కోసం హీరోగారితో పెళ్ళికి సిద్ధపడిపోతుంది. తను, తన కుటుంబంతో హాయిగా గడిపేస్తుంది. సినిమాలో ఉండే మిగిలిన స్త్రీ పాత్రలు కూడా సుఖాంతమైన ఈ కథ నుండి తగిన గుణపాఠాలు నేరుస్తారు. అయ్యా! స్థూలంగా ఇదీ ఆ సినిమా కథ. కాస్త అటూ ఇటూగా సినిమాలన్నీ ఇలాంటి కథా కథనాలు, ట్విస్టులు చుట్టే తిరుగుతాయి.

మొత్తానికి ఇలాంటి ఫక్తు కమర్షియల్ సినిమాల ద్వారా హీరో పాత్రధాటటరులు ఆడవారికి సమగ్రమైన గుణపాఠాలు ఎన్నో నేర్పుతారు. ఇందులో భాగంగానే

**“ హైక్లాస్ సొసైటీ స్త్రీలను చిత్రించడం, వారికి 'విలువలు' నేర్పించడం, సమాజంలో వాళ్ళ పాత్ర ఏమిటో తెలియ చెప్పడం ఇదే బెంగాల్ కమర్షియల్ సినిమా ఫక్తు ఫార్ములా. అప్పుడప్పుడూ ఇందులో మార్పులు ఉంటాయి. హీరో బాగా సంపన్న కుటుంబానికి చెందిన వాడుగా, హీరోయిన్ సాదాసీదా కుటుంబానికి చెందినదిగా చిత్రించే ఇంకో కోవ సిన్మాలు ఉన్నాయి. ”**

వినిమయదారీ సంస్కృతి అంతర్జాతీయ ప్రతీకలను తిరస్కరించే ధోరణి మనకు కనిపిస్తుంది. కోకోకోలా, పెప్సీ, చల్లటి కొబ్బరి బోండాం - ఇవన్నీ కొన్ని విలువలకు సంకేతాలు. కోలా, పెప్సీలు నైతికంగా అడుగుజారిన, విలువలులేని సమాజానికి చెందినవిగా, ప్రపంచీకరణ ప్రోది చేస్తున్న వినిమయదారీ సంస్కృతితో నడుస్తున్న సమాజాలకు ప్రతీకలని ఈ సినిమాల ద్వారా ఆడవాళ్ళం తెలుసుకోవాలి. ఇంతకీ ఈ సినిమా లో నీతి ఏమిటి. ఆడవాళ్ళు గడప దాటకూడదు అనేనా!?

హైక్లాస్ సొసైటీ స్త్రీలను చిత్రించడం, వారికి 'విలువలు' నేర్పించడం, సమాజంలో వాళ్ళ పాత్ర ఏమిటో తెలియచెప్పడం ఇదే బెంగాల్ కమర్షియల్ సినిమా ఫక్తు ఫార్ములా.

అప్పుడప్పుడూ ఇందులో మార్పులు ఉంటాయి. హీరో బాగా సంపన్న కుటుంబానికి చెందిన వాడుగా, హీరోయిన్ సాదాసీదా కుటుంబానికి చెందినదిగా చిత్రించే ఇంకో కోవ సిన్మాలు ఉన్నాయి. స్వపన్‌సాహ్‌క్రియేషన్స్ వారు 97లో 'టోమ్‌కే చాయ్', 2000లో 'బస్తిర్ మేరాధో' అనే సినిమాలు తీశారు. 'టోమ్‌కే చాయ్' సినిమాలో హీరోయిన్ రీతు పర్ణ ఒక తోటమాలి కూతురు. హీరో ప్రసేన్ జిత్ కలవారి అబ్బాయి. చిన్నప్పటినుంచి వీరికి మంచి స్నేహం ఉంటుంది. హీరో పై చదువుల కోసం లండన్ ప్రయాణం అవుతాడు. మన హీరోయిన్ తోటలో గులాబి పువ్వు తెంపి హీరో గారికి ఇవ్వడానికి వెళుతుంది. ఇదిచూసి హీరో తండ్రి 'అలగా జనంతో నీకేంట్రా బాబూ పద' అని హీరోని బయల్దేరదీస్తాడు. కారు అలా బయల్దేరడంతో హీరోయిన్ హీరోగారి చేతికి పువ్వు అందించడం కోసం పరుగులు తీస్తుంటుంది. చెప్పులులేని కాళ్ళతో పరుగులు, చేతిలో పువ్వు, చెక్కిళ్ళ మీద కన్నీళ్ళతో హీరోయిన్ అలా కారు వెనకాతల పరుగెడుతున్న నేపథ్యంలో 'మెలోడ్రమెటిక్' సంగీతంతో, క్లోజప్ షాట్‌లతో మన హృదయాలు బరువెక్కిపోతాయి. ఇంతలోనే హీరో ఎక్కిన విమానం గాల్లోకి లేచి పోతుంది. మన హీరోయిన్ గాల్లో ఎగిరిపోతున్న విమానం కేసి చూస్తుండగా సిన్మాటైటిల్స్ మొదలవుతాయి. అవి పూర్తయ్యే సరికి విమానం తిరిగి వచ్చేస్తుంది. మన హీరో తిరిగి వచ్చేస్తాడు. కానీ హీరో, హీరోయిన్‌లు ఒకరినొకరు గుర్తుపట్టలేకపోతారు. హీరోయిన్‌ని గూండాలు వెంటాడుతుంటే మన హీరో ప్రసేన్‌జిత్ వచ్చి ఆమెను కాపాడతాడు. అది కూడా ఎయిర్‌పోర్ట్ నుండి ఇంటికి తిరిగివచ్చే దార్లోనే. ఇలా సాగుతుంది ప్రేమకథ.

హీరోగారికేమో మరో పెద్దింటి అమ్మాయితో పెళ్ళి నిశ్చయం అవుతుంది. ఆ అమ్మాయి (ఆదితి ఛటోపాధ్యాయ) మన హీరోయిన్ దగ్గర పూలు కొనడానికి వస్తుంది. డబ్బులు తీసుకోకుండా మన హీరోయిన్ నిశ్చితార్థపు పెళ్ళికూతురికి పూలు ఇస్తుంది. ఇచ్చిన డబ్బుపుచ్చుకోలేదని ఆదితి మన హీరోయిన్‌ని అవమానపరుస్తుంది. అప్పుడు మన హీరోయిన్ 'అన్నీ డబ్బుతో కొనగలనని అనుకోకు, ప్రేమను కొనగలవా' అని ప్రశ్నిస్తుంది. అలా డబ్బుగల లోకాన్ని నిలదీస్తుంది. డబ్బుకన్నా విలువైంది మానవ హృదయస్పందనలు అని బోధిస్తుంది. ఇలా డబ్బుకల అమ్మాయికి, పేదరాలికి మధ్య పోరాటం జరుగుతుంది. చివరికి పేదరాలి ప్రేమ ఫలించడంతో సిన్మా సుఖాంతం అవుతుంది.

అలాగే 'బస్తిర్‌మే రాధా' సినిమా. ఇందులో కూడా ఇద్దరు హీరోయిన్లు (రీతూపర్ణ, రూపా గంగూలీ) ఒక హీరో (చిరంజీత్) ప్రేమ కోసం పోటీపడుతుంటారు. రీతుపర్ణ షరా మామూలుగానే పేదరాలు. రూపా గంగూలీ ఆధునిక యువతి. డాక్టర్ కూడా. హీరోగారిని ఇంటికి పిలిచి షడ్రుచుల భోజనం వండి వడ్డిస్తుంది. ఇల్లంతా తీర్చిదిద్దినట్లు ఉంచుతుంది. ఎలా చూసినా సినిమా సాధ్వీమణి లక్షణాలన్నీ ఉంటాయి. ఐనా రీతూపర్ణ ముందు ఓడిపోతుంది. ఎందుకంటే హీరో సుఖం కోసం రూపాగంగూలీ కన్న రీతూ పర్ణ సర్వం త్యాగం చెయ్యడానికి సిద్ధపడుతుంది.

ముక్కోణపు ప్రేమ కథలన్నింటా చివరకు డబ్బులు లేనివాళ్ళే హీరోను గెలుచుకుంటారు. దీనికోసం ఆ హీరోయిన్ నెత్తికి ఎత్తుకునే కష్టాలూ, త్యాగాలూ ఇన్నీ అన్నీ కావు. మొదట్లో ఈ పేదరాలితో హీరో పెళ్ళికి అడ్డుచెప్పిన వాళ్ళంతా ఈ కష్టాలూ, త్యాగాలూ చూసి మనసు మార్చుకుని మన హీరోకి సరయిన జోడీ పేదరాలే అన్న నిర్ణయానికి వచ్చేస్తారు.

బెంగాల్ కమర్షియల్ సినిమాల నిండా మంచి - చెడులకు అర్థం ఇదే. 'గ్లోబల్ సంస్కృతి' కి వ్యతిరేకంగా పాదుకొల్పాలని చూస్తున్న విలువల వ్యవస్థ ఇదే. ఇవాళ సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాలక్ష సమస్యలలో దేనికయినా ఈ 'స్థానిక సంస్కృతీ' విలువలు పరిష్కారం చూపిస్తాయా? అలాంటి ఆశ పెట్టుకోకండి. 'గడప' అనే లక్ష్మణరేఖ దాటవద్దని, మహిళలను ఇంటికే పరిమితం కావాలని, మంచి భార్యగా - చల్లని తల్లిగా బతకమని బోధిస్తాయి. హీరో, హీరోయిన్ల పేదరికం సమాజంలోని బడుగు జీవులు ఆయా పాత్రలతో తమని తాము మిళితం చేసుకుని ఆత్మసంతృప్తి పొందడానికి ఊరటగా పనికొస్తాయి ఈ సినిమాలు. ప్రపంచీకరణ విధానాల వల్ల రోజురోజుకీ కుంచించుకుపోతున్న తమ జీవితాలను చక్కదిద్దుకోవడానికి తగిన పరిష్కారాల కోసం వెదుకులాడే పని లేకుండా - విలువలతో కూడిన ఇలాంటి జీవితం గడపడంలోనే హాయి ఉందని ఈ సిన్మాలు నీతిబోధలు చేస్తాయి.

'జెండర్' సంబంధాల మీద ఆర్థిక - రాజకీయ కోణాల నుండి పోరాటం చెయ్యడానికన్నా స్థానిక-సంప్రదాయిక విలువలకు కట్టుబడి ఉండడానికి మహిళలు ఎంతటి త్యాగాలకయినా సిద్ధం కావాలని సిఫార్సు చేస్తున్నాయి. కూడుకు వచ్చేనా గుడ్డకు వచ్చేనా ఈ విలువలు? వీటి కోసం మళ్ళీ త్యాగాలు కూడా!

సరి, సరి- నేను ఎక్కడనుండి ఎక్కడికి వచ్చేశానో చూశారా. అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడుల దగ్గర బయల్దేరి గృహహింస దాకా వచ్చాను. ఏం చేద్దాంమరి? ఏ రకంగా చూసినా, ఏ లెక్కన చూసినా ఇవాళ మహిళలు ఇంటా-బయటా ఏదో ఒక రకమైన దోపిడికి, హింసకు గురవుతూనే ఉన్నారు. రాన్రానూ ఈ విపరీతధోరణులు మరింత పెరిగిపోతున్నాయి. ప్రపంచీకరణ సంస్కృతిలో భాగంగా హాలీవుడ్ సినిమాలూ, వాణిజ్య ప్రకటనలు స్త్రీని ఒక భోగవస్తువుగా, వినిమయ వస్తువుగా చిత్రీకరిస్తుంటే, స్థానిక సంస్కృతి పేరిట మనం మైనపు ముద్దల్ని తయారు చెయ్యడానికి చూస్తున్నాం.

# సామ్రాజ్యవాద పాలకవర్గాల సాంస్కృతిక ధాటిని ఎదుర్కోగలిగేంత స్థాయికి పీడిత ప్రజలు ఇంకా రాలేదు

## సందేహాలు సమాధానాలు



**- బి.వి.రాఘవులు**

**కా॥ బి.వి. రాఘవులుగారికి లాల్‌సలామ్, ప్రజా ఉద్యమం విస్తృతస్థాయిలో ఉన్నప్పుడు సాంస్కృతిక ఉద్యమాలూ వస్తాయి. అవి ప్రజా ఉద్యమాల్ని మరింత ఉధృతం, పటిష్టం, విస్తృ తం చేస్తాయి. ఇలా ఒకదానికొకటి ప్రభావితం చేసుకుంటుంటాయి. భారత స్వాతంత్ర్య ఉద్యమకాలంలో వచ్చిన బెంగాల్ సాంస్కృతిక ఉద్యమం, తెలంగాణా సాయుధ పోరాట కాలం లో వచ్చిన 'బండెనెక బండి కట్టి... పదహారు బండ్లు కట్టి... ఏ బండ్లో వస్తవు కొడకో...' వంటి పాటలు, నేటి ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో వచ్చిన సాంస్కృతిక ఉద్యమాలు అందుకు మంచి ఉదాహరణలు. ప్రస్తుతం రాష్ట్రంలో, దేశంలో ఉద్యమాలకు ఒక కృత్రిమ వాతావరణం కనిపిస్తోంది. ఇటువంటి వాతా వరణంలో ప్రజా ఉద్యమాలు ఎలా వస్తాయి. అనుబంధంగా సాంస్కృతిక ఉద్యమాన్ని ఎలా ముందుకు తీసుకెళ్ళాలి. వివరించగలరు?**

**పి. అబ్దుల్ వహీద్‌ఖాన్,**
నాగర్‌కర్నూల్,
మహబూబ్‌నగర్‌జిల్లా.

సమాజాన్నీ, సంస్కృతినీ అర్థం చేసుకోవడానికి వీటిని విడివిడిగా చూస్తాం తప్ప వాటినన్నింటినీ నిత్య జీవితంలో వేరుజేయడం సాధ్యంకాదు. సమాజంలో ప్రజలయొక్క ప్రధానమైన ఆర్థిక జీవనంలో, భౌతిక పరిస్థితులలో మార్పులు జరుగుతున్నప్పుడు వాటి ప్రభావం ప్రజా జీవితంలో ఇతర అంశాలలో కూడా పడుతుంటుంది. కుటుంబం, మతం, విద్య, ఆరోగ్యం, ఆహార నివాస అలవాట్లు, సాహిత్యం, కళలు, ఆలోచనలు, తాత్విక భావనలు, ఆధ్యాత్మిక భావనలు మొదలగు అంశాలన్నీ ప్రభావితం అవుతాయి. తిరిగి ఈ అంశాలన్నీ ఆర్థిక భౌతిక పరిస్థితులనుకూడా ప్రభావితం చేస్తాయి. అందువలన విశ్లేషణ కోసం విడివిడిగా పరిశీలించినా అన్నింటినీ కలిపి మొత్తంగా చూస్తేనే వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోగలం.

అలాగే వర్గ సమాజంలో ఆనాడు ఉండే ఆధిపత్య వర్గాలయొక్క సాంస్కృతిక అంశాలే సమాజంలో ఆధిక్యతలో కన్పిస్తాయి. దానికి పాలించే వర్గాలయొక్క అధికారం, ధనశక్తి, వ్యవస్థలమీద పెత్తనం, పాత సాంప్రదాయాల పట్టు తోడ్పడతాయి. అయితే శ్రామికులు ఇతర కష్టజీవుల ఆలోచనలకూ, సాంస్కృతిక అంశాలకూ తావుండదని కాదు. ఆధిపత్య సంస్కృతి కనుసన్నలలోని సామాన్య ప్రజల సంస్కృతి కూడా సాగుతూ ఉంటుంది. కొన్ని సందర్భాల్లో పరస్పరం పోటీ కూడా పడతాయి. దోపిడి వర్గాలకూ, శ్రామిక ప్రజలకూ మధ్య వైరుధ్యాలు, సమస్యలు, ఘర్షణలు తీవ్రమైనప్పుడు అవి వివిధ రూపాలలో సాంస్కృతిక రంగంలో కూడా వ్యక్తమయ్యే అవకాశం ఉంది. ఉన్న సమాజంపై అసంతృప్తి చెందినప్పుడు ఆగ్రహం, ఆవేశం, నిరాశా, నిస్పృహ, ఆశలు, కళలూ మొదలైనవన్నీ వివిధ రూపాల్లో సంస్కృతిలో వ్యక్తమవుతాయి. ఉద్యమాలు పోరాటాలు వచ్చినప్పుడు కూడా వాటి ప్రభావం, స్ఫూర్తి సాంస్కృతిక రంగంలో కూడా ప్రతిబింబిస్తుంది. అయితే ప్రజా ఉద్యమాలు వచ్చినప్పుడు మాత్రమే దానికి అనుబంధంగా సాంస్కృతిక ఉద్యమం వస్తుం దని అనుకోవడం యాంత్రికం అవుతుంది. కొన్ని సందర్భాలలో సాంస్కృతిక ఉద్యమం ప్రజా ఉద్యమాన్ని పురికొల్పవచ్చు. మరికొన్ని సందర్భాల్లో ప్రజా ఉద్యమాల స్ఫూర్తితో సాంస్కృతికోద్యమం ఆవిర్భవించవచ్చు. ఆయా సందర్భాలను నిర్దిష్టంగా అధ్యయనం చేసినప్పుడు ఇది విదితమవుతుంది. బెంగాల్‌లో సాంస్కృతిక ఉద్యమం ముందు వచ్చి జాతీయోద్యమానికి స్ఫూర్తినిచ్చింది. తెలంగాణా సాయుధ పోరాటం ఉధృతమై సాంస్కృతిక ఉద్యమాన్ని సృష్టించింది.

ప్రస్తుతం ప్రపంచ వ్యాపితంగా సరళీకరణ విధానాల రూపంలో ఆధునిక పెట్టుబడిదారీ విధానం నడుస్తున్నది. సాంస్కృతిక రంగంలో కూడా ఈ పరిణామం తీవ్రమైన వైరుధ్య పూరిత ప్రభావం వేసింది. సామ్రాజ్యవాద అధిపత్యం సాంస్కృతిక రంగాన్ని శాశించడానికి ప్రయత్నం చేస్తుంది. ఈ ప్రయత్నాన్ని ప్రతిఘటించే అభ్యుదయ, స్థానిక సాంస్కృతిక కృషి లేదనుకోలేము. సాంస్కృతిరంగంలో ఇప్పుడు జరుగుతున్నదంతా కృత్రిమం అని కూడా అనుకోలేం. ఇప్పుడున్న ఆధిపత్య వర్గాలకు అనుగుణమైనదానిని ప్రోత్సహిస్తున్నాయి. ప్రపంచ వ్యాపితంగా సామాన్య ప్రజలు, పీడిత ప్రజలు సామ్రాజ్యవాద పాలకవర్గాల సంస్కృతి ధాటిని ఎదుర్కోగలిగేంత స్థాయికి ఇంకా రాలేదు. ఉద్యమాలు కూడా అంత తీవ్రమైన స్థాయికి ఇంకా అభివృద్ధి కాలేదు. పాలకవర్గాల్ని ఏ రంగంలో ప్రజా ఉద్యమం, సాంస్కృతిక ఉద్యమం ముందు ప్రతిఘటించడం మొదలవుతుందో, ఎప్పుడు మొదలవుతుందో ఇప్పుడే చెప్పలేం. అనేక శక్తులు వివిధ రూపాల్లో చేస్తున్న ప్రయత్నాలు ప్రస్తుతం అంతర్జాతీయ పెట్టుబడి ఎదుర్కొంటున్న సంక్షోభం తీవ్రమయ్యే కొద్దీ ఒక ఉద్యమ రూపం తీసుకొన్నప్పుడు మాత్రమే స్పష్టత వస్తుంది. ఏ రంగంలో ప్రతిఘటన ప్రారంభం అయ్యింది, ఏ రంగాన్ని ప్రభావితం చేసింది అన్నది ప్రధానం కాదు. ఎక్కడ ప్రారంభమై ఎక్కడకు విస్తరించినా పాలక వర్గాలను ప్రతిఘటించడం ముఖ్యం. దానికోసం ఎవరి శక్తిని, అవకాశాన్ని బట్టి ఏ రంగంలో ప్రతిఘటనలు నిర్మించగలిగినా మంచిదే.

**కామ్రేడ్ రాఘవులుగారికి, ఇటీవల ఫేస్ బుక్‌లో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు జి. రాము లుగారు పెట్టిన ఒక వ్యాఖ్యానం చదివి ఈ ఉత్తరం రాస్తున్నాను. ఆ వ్యాఖ్యానం ఇలా వుంది: అంబేద్కరిస్టు కమ్యూనిస్టులంతా ఒకే తల్లి బిడ్డలు. మార్క్స్, పూలే, లెనిన్, అంబేద్కర్, మావో, సుందరయ్య, రాజేశ్వరరావు, చారుమ జుందార్, కాన్షీరామ్‌లు స్వయానా అన్నదమ్ములే. వీరందరికీ తల్లి మరెవరోకాదు బుద్ధిజమే... ఈ ఉత్తరాన్ని ఎలా అర్థం చేసుకోవాలి. ఒకటి, ఈ భావం, రెండు ఒక స్థాయిగలిగిన నాయకుడు తన భావాలను వ్యక్తం చేసిన పద్ధతి సరైందేనా?**

**స్ఫూర్తి,**
ప్రజానాట్య మండలి,
ఎద్దుమైలారం, మెదక్ జిల్లా.

ఫేస్‌బుక్‌లో రాష్ట్ర కమిటీ సభ్యులు జి. రాములుగారు పెట్టిన వ్యాఖ్యానాన్ని నేను చదవలేదు. మీ ప్రశ్నలో ఉన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని సమాధానం ఇస్తున్నాను. బుద్ధిజమే అంబేద్కరిజానికి మార్క్సిజానికి మూలం, ఈ రెండు ధోరణులకు సంబంధించిన నాయకులందరికీ బుద్ధిజమే తల్లి అన్న వాఖ్యా నాలు విషయాన్ని శాస్త్ర బద్ధంగా, తర్కబద్ధంగా చర్చించుకోవడానికి ఉపయోగపడదు. అన్నీ వేదాల్లోనే ఉన్నాయన్న వాదన ఎటువంటిదో అన్ని బుద్ధిజంలో ఉన్నాయని చెప్పే వాదనకూడా అటువంటిదే. నిజమైన బుద్ధిజం ఈ రకమైన భావాన్ని అంగీకరించదుకూడా.

అన్ని సమాజాల్లో గణ సమాజంనుండి వివిధ రూపాల్లో ఉన్న వర్గ సమాజంలోకి పరిణామం చెందే కాలంలో కొత్త పనిముట్లు, పరికరాలు, ఉత్పత్తి పద్ధతులు అభివృద్ధయి వ్యవసాయ సమాజాలు రూపొందే కాలంలో వివిధ సమూహాల మధ్య వ్యాపారం అభివృద్ధైన ప్రాచీన కాలంలో అనేక కొత్త ఆలోచనలు, మతాలు పుట్టుకొచ్చాయి. భౌద్ధమతం, జైనం వంటి దర్శనాలు

మన ఖండంలో అటువంటి సందర్భంలోనే ఆవిర్భవించాయి. వీటిల్లో ప్రాచీన గణాల్లో ఉండే అనేక అంశాలు ముఖ్యంగా సమా నత్వం, భౌతికతత్వం వంటివి వ్యక్తమయ్యాయి. ఆ మేరకు ఆ వారసత్వం ఈనాటి అభ్యుదయ సిద్ధాంతాలకూ, ఉద్యమాలకూ స్ఫూర్తినిస్తాయి. అయితే ఆనాటి సమాజానికి తోడ్పడిన ఆ సిద్ధాంతానికీ, ఆధునిక సమాజాలు సృష్టించిన సిద్ధాంతాలకూ తల్లీ పిల్లలకు పోలికలు పెట్టడం సమంజసం కాదు. ఆధునిక పెట్టుబడిదారీ విధానం ఆవిర్భవించిన కాలంలో మార్క్సిజం ఉద్భవించింది. ఆధునిక పెట్టుబడిదారీ విధానం, వలసవాదం, కులవ్యవస్థలు కలగలిసిన సామాజిక నేపథ్యంలో అంబేద్కరిజం ఉద్భవిం చింది. అంబేద్కరిజం ప్రజాస్వామ్య విప్లవ సిద్ధాంతాన్ని ముందుకు తెస్తే మార్క్సిజం వర్గ విప్లవ సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చింది. ప్రాచీన కాలపు భౌద్ధంలో ఉండే కొన్ని అంశాలు ఆధునికంగా వచ్చిన అంబేద్కరిజం, మార్క్సి జంలోకూడా ఉండవచ్చు. అలాగే అంబే ద్కరిజం మార్క్సిజంలో కూడా కొన్ని అంశాలు సామ్యంగా ఉండవచ్చు. కానీ ఆ మూడింటిని ఒకటిగా భావించటమో, ఒకదానికి మరొకటి సంతానంగా భావించడమో సరికాదు.

అలాగే బౌద్ధం ప్రారంభమైన రోజులకూ, అది పరిణామం చెంది బలహీనపడి దాదాపు కనుమరుగైన రోజులకూ దాని స్వభావంలో ఎంతో వ్యత్యాసం వచ్చింది. బౌద్ధ ఆలోచనా విధానాల్లో అనేక ప్రతికూలాంశాలు బలపడ్డాయి. రాజరిక వ్యవస్థను సమర్థించడం ప్రారంభించింది. కులవ్యవస్థకు అండదండలిచ్చింది. దైవ చింతన, మూఢనమ్మకాలను కూడా ఆశ్రయించింది. హీనయానం, మహాయానం ఇంకా అనేక పద్ధతుల్లో ఛిద్రమైంది. అందువలన బౌద్ధ సిద్ధాంతాన్ని ఒక అఖండమైన భావ సమూహంగా చూడడం సరిగాదు.

అన్నీ బౌద్ధంలో ఉన్నాయని అనుకోవడం తప్పు ఎలాగో మార్క్సిజంలో అన్నింటిని గురించి మార్క్స్ చెప్పాడని అనటం కూడా తప్పవుతుంది. మార్క్స్ అనుసరించిన అధ్యయన, విశ్లేషణా పద్ధతిని వినియోగించి ఎప్పటికప్పుడు సమాజాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నం చేయడంలోనే సరైన శాస్త్రీయమైన నిర్ధారణలకొచ్చే అవకాశం ఉంటుంది. అయితే ఆయన చెప్పిన మార్గాన్ని అనుసరించే వారిలో, సంస్థల్లో ఎన్నో తేడాలనూ, వివాదాలనూ చూస్తున్నాము. మార్క్సిజం పేరు చెప్పుకుంటూనే పొరపాటు అంశాలను సమర్థించేవారినికూడా చూస్తున్నాము. అందువలన ఏది సరైందో కాదో ఆచరణ, సామాజిక మార్పు తేల్చాల్సి ఉంటుంది. ఒక సిద్ధాంతానికే ఇటువంటి పరిస్థితి ఉంటే వేల సంవత్సరాలనాటి సిద్ధాంతాలనుంచి ఈనాడు ఇంకో సిద్ధాంతం పుట్టిందని అనుకోవడం సరికాదు.

**ఇటీవలి ఉపఎన్నికల్లో కొన్ని ఎదురు దెబ్బలు తిన్నప్పటికీ బిజెపి మళ్లీ మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల్లో విజయం సాధించింది. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నా, గత యుపిఎ విధానాలకు భిన్నమైన విధానాలు అమలు చేయలేకపోతున్నా కూడా దానికి విజయాలు సమకూరడానికి కారణం ఏమిటి? ప్రజల్లో మార్పు వస్తుందంటారా?**

**కె. ఆశీర్వాదం,**
నూతక్కి,
గుంటూరు జిల్లా.

2014 ఎన్నికల్లో బిజెపి దాని మిత్రులు అఖండ విజయాన్ని సాధించడానికి తోడ్పడిన ప్రధాన అంశాలు రెండు. ఒకటి: జాతీయ అంతర్జాతీయ కార్పోరేట్ పెట్టుబడిదారీ శక్తుల మదతు. రెండు: హిందూత్వ మతోన్మాద శక్తుల విషపూరిత ప్రచారం. ఇప్పటికీ ఈ రెండు అంశాల ప్రభావం ఇంకా కొనసాగుతూనే ఉంది. మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల్లో బిజెపి గెలుపుకు కారణం కూడా ఈ అంశాలే. బిజెపి కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక చర్యలను ఇప్పుడే ప్రారంభించింది. రాబోయే కాలంలో ఇంకా తీవ్రం కావచ్చు. అందువలన బిజెపి ప్రభుత్వంపై ప్రజలలో ప్రతికూల వాతావరణం ఇప్పటికే తీవ్రమైందని భావించలేము. దానికి కొంత సమయం పడుతుంది. తరువాతనైనా ప్రజలలో అసంతృప్తి పెరిగినప్పుడు మతోన్మాద శక్తులు దాన్ని దారి మళ్లించవని అనుకోకూడదు. అదే జరిగితే ప్రజా ఉద్యమాలకు నష్టం జరుగుతుంది. బిజెపి ప్రభుత్వ మనుగడకు ఇబ్బంది ఉండదు. వామపక్ష ప్రజాతంత్ర శక్తులు ప్రజల అసంతృప్తి తప్పుడు మార్గాల్లోకి మళ్లకుండా చూడడంపైనే ప్రజా ఉద్యమాలయొక్క భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. అందుకే దేశంలో వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యతను సాధించేందుకు మార్క్సిస్టు పార్టీ గట్టి ప్రయత్నాన్ని ప్రారంభించింది. రాబోయే అఖిల భారత మహాసభల్లో కూడా ప్రధానమైన అంశంగా చర్చించబడుతుంది.

# పెరుగుతున్న సామాజిక ప్రతీఘాత విప్లవ ప్రమాదం

(26వ పేజీ తరువాయి)

కాబట్టి,ఈ అసంతృప్తి యొక్క ప్రతికూల ప్రభావాలు దేశంపై పడకుండా ఉండాలంటే దేశం నుండి పెట్టుబడులు తరలిపోకుడా ఆంక్షలు విధించాల్సి ఉంటుంది.

ఈ విధానాలను అమలు జరపాలంటే ప్రత్యామ్నాయ అర్థికాభివృద్ధి నమూనాను అనుసరించాలి. అటువంటి ప్రత్యామ్నాయ విధానాల అమలులో రెండంశాలు కీలకంగా ఉండాలి. మొదటి అంశం ప్రైవేటు పెట్టుబడులకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ,సహకార రంగ పెట్టుబడులను వినియోగించాలి. తద్వారా పెట్టుబడిదారుల జంతు ప్రవృత్తిని అదుపులో పెట్టవచ్చు. రెండవ అంశం ఇంతకు ముందు చెప్పినట్లు సార్వత్రిక హక్కులు కల్పించటం ద్వారా మాత్రవే కాకుండా, ఆదాయాలను,ఆస్థులను మరింత సమానంగా పంపిణి చేయటం ద్వారా దేశీయ మార్కెట్‌ను విస్తరింపచేయాలి.

ప్రజలందరికి ఆస్థులను పంపిణి చేయటంలో భూమి పునఃపంపిణి అనేది కీలకాంశంగా ఉంటుంది. దానితోపాటు ఆస్థులు, ఆదాయాలపై క్రమానుగత వృద్ధి పన్నును విధించాలి. ఈ పన్ను మనదేశంలో దాదాపుగా లేదు. భూమి పునఃపంపిణీతో పాటు రైతు వ్యవసాయాన్ని అభివృద్ధి చేయటానికి, మద్దతివ్వటానికి,రక్షణ కల్పించే చర్యలతో పాటు, రైతుల, వ్యవసాయ కార్మికుల సహకార సంఘాలను ఏర్పాటు చేయటం అత్యంత ముఖ్యమైనవి. గ్రామీణ భారతదేశంలో, వ్యవసాయ రంగంలో ఉత్పత్తిశక్తులు అభివృద్ధి కావటమే దేశీయ మార్కెట్ విస్తృతిని, దానితో పాటు మొత్తం ఉత్పత్తిని, ప్రభుత్వం చేతిలోకి ఏమేరకు నిధులొస్తాయనే అంశాన్ని కూడా నిర్ణయిస్తుంది.

ఆర్థికాంశాలొక్కటే కుల దురహంకారాన్ని,కుల చైతన్యాన్ని,కుల అణచివేతను అంతం చేస్తాయనే భ్రమలకు మనం లోను కారాదు. దీన్ని నమ్మటమంటే ఇంతకు ముందు చెప్పుకున్నట్లు పెట్టుబడిదారీ విధానం కుల అణచివేతపై ఆధారపడిన పాత సామాజిక నిర్మాణాన్ని నాశనం చేస్తుందనే భ్రమలకు లోనుకావటమౌతుంది. కుల అసమానతలకు కాణమైన సామాజిక వ్యవస్థపై చైతన్య పూర్వకమైన,ప్రత్యక్ష దాడికి పూనుకోవాలి. అందుకు సామాజిక, సాంస్కృతిక విప్లవం జరగాలి. (ఖాప్ పంచాయితీలను నిరోధించటం, తమజీవిత భాగస్వామిని ఎంచుకొనే స్వేచ్ఛను వ్యక్తులకు కల్పించటం దీనిలో ప్రధానంగా ఉండాలి)అభ్యుదయాన్ని కోరుకొనే అన్ని శక్తులూ దీనిలో భాగస్వాములు కావాలి. ఈవిధమైన సామాజిక, సాంస్కృతిక విప్లవం ముందుకు పోవాలంటే కొన్ని సార్వత్రిక ఆర్థిక హక్కులు కల్పించటం అతి ముఖ్యమైనదని నేను అభిప్రాయ పడుతున్నాను.

**(అనువాదం. ఎ. కోటిరెడ్డి)**

# కంఠంనేని వెంకటరత్నం

**(2వ పేజీతరువాయి)**

జమిందారుని కూడా ఆకర్షించింది. స్వాతంత్ర్యం రావాలని కాంక్షించిన జమిందారు ఆయన భవనాన్ని కూడా కమ్యూనిస్టుల రక్షణ కేంద్రంగా రూపొందించటంతో కామ్రేడ్ కంఠమనేని కృషి అర్థమవుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం కాపలా యంత్రాంగాన్ని పెడితే అందులోని యువకులను కూడా కమ్యూనిస్టులుగా తయారు చేసి పల్లె కోన గ్రామాన్ని కమ్యూనిస్టులకోటగా మార్చారు.

ప్రభుత్వ అసమర్థతవల్ల కృష్ణా డెల్టాకు ఆయువు పట్టువంటి బందరు కాల్వ మేట వేసింది. పూడిక తీయించమని అప్పటికే చాలాకాలంగా రైతు సంఘాలు ఆందోళన చేస్తు న్నాయి. పూడికలు సకాలంలో తీయించే సమయం లేక అధికార్లు నీళ్ళు నములుతున్నారు. రైతులు నీటి ఎద్దడిని గూర్చి ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర రైతుసంఘం పరిస్థితుల్ని అవగతం చేసుకున్నది. ఇంజనీర్లను ఒప్పించి, స్వయంగా కాల్వత్రవ్వకం పని చేపట్టింది. కమ్యూనిస్టు పార్టి తరపున పార్టి నిర్మాత కామ్రెడ్ సుందరయ్య పిలుపు యిచ్చారు. గ్రామాలనుండి దళాలు కదిలాయి. మొగల్రాజపురంలో మకాం పెట్టాయి. ఉత్సాహంగా సాగిన ఈ పని అను కున్న సమయం కంటే ముందే పూర్తయింది. రైతులు ఉప్పొంగిపోయారు. పార్టీనీ, దాని ఉ క్కునాయకత్వాన్నీ అందరూ అభినందించారు. పార్టీ బద్ధశత్రువులు తలలు వంచారు. నెల జీతాలకు పని చేశామంటే చేసామని అనిపించు కునే ఇంజనీర్లు ఈ కఠోర శ్రమను చూసి కలా! నిజమా! అని అనుకున్నారు. ఈ కార్యక్రమంలో కామ్రేడ్ కంఠంనేని వెంకటరత్నం నాయకత్వం లోని పల్లెకోన దళం, కామ్రేడ్ దండా నారాయణ స్వామి నాయకత్వంలోని గోరంట్లవారిపాలెం దళం పోటాపోటీగా పనిచేశాయి. అఖిలభారత కిసాన్ మహాసభలు విజయవాడలో పెద్ద ఎత్తున నిర్వహించబడినప్పుడు వాలంటీర్ దళనేతగా కామ్రేడ్ కంఠమనేని తన కర్తవ్యాన్ని ప్రశంసా పాత్రంగా నిర్వహించారు. ఈ రెండు కార్యక్రమా ల్లోనూ గోరంట్లవారిపాలెం కామ్రేడ్ దండా నారాయణ స్వామి దళం, పల్లెకోన కామ్రేడ్ కంఠంనేని వెంకటరత్నం దళం పోటీ పడ్డాయి. రెండూ సమఉజ్జీలుగా ప్రకటించబడ్డాయి. 1947లో పల్లెకోనలో వ్యవసాయ కార్మికుల కూలిరేట్ల పెంపుకు ఉద్యమాన్ని నడిపారు. అస్పృశ్యతా నివారణకు కృషి చేశారు. కంట్రోల్ రోజుల్లో బ్లాక్ మార్కెట్లు అరికట్టి సక్రమ పంపిణీ జరగటానికి కళ్ళల్లో వత్తులు వేసుకుని కాపలాకాశారు. పల్లెకోనలో రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు.



పల్లెకోనలో పంచాయితీ కార్యాలయానికి కంఠంనేని వెంకటరత్నం స్మారక భవనంగా నామకరణ చేశారు


తెలంగాణా సాయుధ పోరాటం తీవ్రం కాగానే కమ్యూనిస్టులను నిర్మూలించడానికి ప్రభుత్వం పార్టీపై నిషేధం విధించటమే కాకుం డా, సాయుధ బలగాలను దించింది. దొరికిన వారిని దొరికినట్లుగా కాల్చి వేయటం మొదలు పెట్టింది. కామ్రేడ్ కంఠంనేనిని ఏరివేస్తే చాలని భావించిన పోలీసులు ఆ కామ్రేడ్ కోసం వేట తీవ్రతరం చేశారు. కామ్రేడ్ కంఠంనేని అజ్ఞాతంలోకి వెళ్లారు. ప్రభుత్వం మలబారు పోలీసులను గ్రామాల మీదకు దించింది. వీరికి భూస్వాములు తోడయ్యారు. కామ్రేడ్ కంఠంనేని వెంకటరత్నం కోసం చుట్టుప్రక్కలగ్రామాలలో పోలీసుల వేట తీవ్రమైంది. అర్ధరాత్రి, అపరాత్రి అని లేకుండా పార్టీ కార్యకర్తల, సానుభూతి పరుల ఇళ్ళపైపడి భీభత్సం సృష్టించటం, దొరికినవారిని ఆడ, మగా అనే తేడా లేకుండా హింసించటం నిత్యకృత్యమైపోయింది. కార్య కర్తలు బతకాలంటే ఏదోఒక ప్రతిచర్య తప్పదన్న నిర్ణయానికి పార్టీ వచ్చింది. ఆ ప్రతిచర్య ఏవిధం గా ఉండాలో నిర్ణయించడానికి సమావేశం కేంద్ర డెన్‌లో ఏర్పాటు చేశారు. నిర్ణయించిన సమయానికి కామ్రేడ్ కఠంనేని డెన్‌కు చేరారు. అదే సమయానికి కామ్రేడ్స్ మాలెంపాటి భాస్కరరావు, బెల్లంకొండ వీరయ్య కూడా సమావేశానికి వచ్చారు. పార్టీ ఆర్గనైజర్‌గా చెలా మణి అవుతున్న ఒక ద్రోహి కామ్రేడ్ కంఠంనేని వెంకటరత్నం డెన్‌కు చేరిన సమాచారాన్ని పోలీసులకు అందించాడు. అర్ధరాత్రి పోలీసు మూకలు డెన్‌ను చుట్టిముట్టాయి. తప్పుకునే అవకాశం లేదు. ఆ సమయంలో పోలీసులపై కాల్పులు జరుపుతూ మిగిలిన కామ్రేడ్స్ తప్పు కునేందుకు అవకాశం కల్పించాలని నిర్ణయిం చుకున్నారు కామ్రేడ్ కంఠంనేని వెంకటరత్నం. నేనుకూడా దాడికి దిగుతానని ముందుకు వచ్చారు కామ్రేడ్ మోటూరు వెంకటరత్నం

కౌంటర్ ఆపరేషన్ మొదలైంది. కొందరు కామ్రేడ్స్ డాక్యుమెంట్స్‌ను తగులబెట్టే పనిలో పడ్డారు. కామ్రేడ్ కంఠంనేని వెంకటరత్నం కిటికీగుండా పోలీసులపై గుళ్ళవర్షం కురిపిం చారు. ఒక ఇన్స్‌స్పెక్టర్, మరి ఇద్దరు పోలీసులు నేలకొరిగారు. ఖంగుతిన్న పోలీసులు వ్యూహం మార్చి ఇంటిపై పెట్రోలు చల్లి నిప్పుపెట్టి చుట్టూ పొజిషన్ తీసుకున్నారు. లోపలనుండి ఒక్క ఉ దుటున కామ్రేడ్స్ బయటికి వచ్చారు. కామ్రేడ్ కంఠంనేని, కామ్రేడ్ మోటూరు వెంకటరత్నం ముందు నిలబడి కాల్పులు జరుపుతుంటే మిగి లిన కామ్రేడ్స్ తప్పుకున్నారు. పోలీసుల ఎదురు కాల్పులలో కామ్రేడ్ కంఠంనేని, కామ్రేడ్ మోటూరు మరణించారు. వారితోపాటు కామ్రేడ్ మోటూరి వెంకటరత్నం రెండుసంవత్సరాల పాపకూడా కాల్పుల్లో చనిపోయింది. మొత్తం ప్రతిఘటన ఉద్యమంలోనే ఈ పాప మరణం అత్యంత విషాదకరమైన ఘటనగా మిగిలి పోయింది. జీవితపు చివరి క్షణాల్లో కూడా తోటి కామ్రేడ్స్‌ను రక్షించడానికి ఆత్మార్పణ చేసిన ఈ వీరుల చరిత్ర తరువాత తరాలకు ఆదర్శనీయం.

**('గుటూరు జిల్లా అమర వీరులు' గ్రంథం నుండి.... వేజెండ్ల శ్రీరామ ప్రసాదు (పల్లెకోన)తో ఇంటర్వ్యూ ఆధారంగా)**

RNI Reg. No. APTEL/2006/17554 Postal Regd. No L1/SD/407/13-15

# మెజారిటి మతతత్వం ప్రజలపై ఫాసిజాన్ని రుద్దుతుంది



–బిపన్ చంద్ర

మెజారిటి మతతత్వ ప్రమాదం మనముందు స్పష్టంగా ఉంది. భారత్‌లో మతతత్వం దాని మెజారిటి రూపం ద్వారానే ప్రబల శక్తిగా మారుతుంది. ప్రజాస్వామ్యంలో మెజారిటి మతతత్వం అధికారాన్ని హస్తగతం చేసుకోగలదు. ఏ మైనారిటీ మతతత్వానికి దానికున్నంత అవకాశం ఉండదు. తద్వారా మెజారిటి మతతత్వం తనకు తానే ఒక జాతీయవాదంగా చెల్లుబాటు చేసుకోగలుగుతుందికూడా. మెజారిటి మతతత్వం మాత్రమే ప్రజలపై ఫాసిజాన్ని రుద్దగలదు. భారతదేశంలో మెజారిటి ప్రజానీకం హిందువులు కాబట్టి, ఫాసిజం ప్రధాన బాధితులు సహజంగా వారే అవుతారు. నిర్హేతుకతకూ, విద్వేషానికీ, అసహనానికీ, అభివృద్ధి నిరోధకతకూ ప్రాతినిధ్యం వహిస్తూ శతాబ్దాల సంస్కృతీ సాంప్రదాయాలు, మానవత, సామాజిక విలువల పరంపర నుంచి భారతీయులను ఈ మతతత్వ విజయం దారి మళ్ళిస్తుంది. ఈ సందర్భంగా మనం ఇతర ప్రజల చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవాలి. ఫాసిజానికి ఎవరు ప్రధాన బాధితులో వారినే అడిగి తెలుసుకోవాలి. వారు ఇటలీలో ఇటాలియన్లు, జపాన్‌లో జపనీయులు, జర్మనీలో యూదులతో పాటు యావత్ జర్మన్లు. ఇది సుస్పష్టం. కాబట్టి 1947కు పూర్వం ఆనాడు జాతీయ సమైక్యతకు ముస్లిం మతతత్వం ఎలా ప్రధాన విఘాతం కలిగించిందో 1947 తర్వాత అచ్చు అలాగే హిందూ మతతత్వం భారత సమైక్యతకూ, ప్రజాస్వామ్యానికీ ఈనాడు ప్రధాన ముప్పుగా మారింది.

**(బిపన్ చంద్ర రాసిన 'మతోన్మాదం: పుట్టుక, పరిణామం, నివారణ' గ్రంథం నుండి ఈ వాక్యాలు గ్రహించబడ్డాయి.)**

Marxistu, monthly organ of Communist Party of India (Marxist) A.P . State Committee.
Printer & Publisher B.V. Raghavulu. RNI Reg.No. APTEL/2006/17554. Vol.9, No.7. Published on November 1, 2014